Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 185 మేడ్చల్ మల్కాజ్‌గిరి 27 జూలై 2024 శనివారం పేజీలు : 4

## ఇకపై పకడ్బందీగా యూపీఎస్సీ పరీక్షలు

న్యూఢిల్లీ : వివాదాస్పద ట్రైనీ ఐఏఎస్ పూజా ఖేడ్కర్ కేసు నేపథ్యం లో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) అప్రమత్తమైం ది. అవకతవకలను నివారించి, పరీక్షలను మరింత పకడ్బందీగా నిర్వహించడానికి అత్యాధునిక డిజిటల్ సాంకేతికతలను ఉపయోగించుకోవాలని భావిస్తోంది. ఆధార్ ఆధారిత వేలిముద్రల ధ్రువీకరణ, అభ్యర్థుల ఫేషియల్ రికగ్నిషన్, ఈ-అడ్మిట్ కార్డులపై క్యూఆర్ కోడ్ స్కానింగ్‌తో పాటు దేశవ్యాప్తంగా వివిధ కేంద్రాల్లో నియమించిన సిబ్బంది పనితీరును, అభ్యర్థుల కార్యకలాపాలను పర్యవేక్షించడానికి ప్రత్యక్ష ఏఐ ఆధారిత సీసీటీవీ నిఘా కోసం ప్రభుత్వ రంగ సంస్థల నుంచి టెండర్లను ఆహ్వానించింది.

ఈ కాంట్రాక్టు కాలపరిమితి మూడేళ్లు ఉంటుందని, దీన్ని మరో ఏడాదిపాటు పొడిగించే అవకాశం యూపీఎస్సీ ఉందని తెలిపింది.



# భాగ్యనగరంపై పట్టు కోసం...

## కాంగ్రెస్ మార్క్ మార్పుకు రంగం సిద్ధం!

## సీఎం రేవంత్‌రెడ్డి అదిరిపోయే స్కెచ్!!

హైదరాబాద్ మహా నగరంపై పింక్ బ్రాండ్‌ని చెరిపేసి, మూడు రంగుల మార్కు, మార్పు చూపించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అడుగులు వేస్తున్నారా? బడ్జెట్‌లో హైదరాబాద్‌కు హై ప్రయారిటీ, వేల కోట్ల కుమ్మరింపు దానిలో భాగమేనా? మార్పు మంత్రంతో హమారా షహర్‌లో ఎలాంటి మార్పులు రానున్నాయి? ఇది రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న చర్చ. చార్ సౌ సాల్ పురానా సిటీ, హమారా షహర్ హైదరాబాద్. భాగ్యనగరం అంటేనే ఓ బ్రాండ్. హైటెక్ సిటీతో ఐటీ ఇమేజ్. ఇండియాలో ది మోస్ట్ హ్యాపెనింగ్ సిటీ. గత పదేళ్ల కేసీఆర్ పాలనలో బ్రాండ్ హైదరాబాద్‌కి కొత్త మెరుగులు దిద్దారు. సరికొత్త హంగులు అద్దారు. నగరంలో ప్రయాణికులను చకచకా గమ్య స్థానాలకు చేర్చే మెట్రో రైలుతో పాటు, దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జ్, ట్రాఫిక్ కష్టాలు తీర్చే ఫ్లై ఓవర్లు.. ఇలా ఒకటేమిటి.. హైదరాబాద్‌కి నయా లుక్ తెచ్చారు కేసీఆర్. అందుకేనేమో గ్రేటర్ పరిధిలో.. ఓల్డ్ సిటీ మినహాయించి దాదాపు అన్ని అసెంబ్లీ సీట్లను గులాబీ పార్టీ కైవసం చేసుకుంది. నయా హైదరాబాద్. నయా ఇస్మార్ట్ సిటీ జిందగీ. నగరం గురించి చర్చ వస్తే... అంతా మేమేం చేశాం అని చెప్పుకుంటుంది బీఆర్ఎస్. హైదరాబాద్ నగరంపై బీఆర్ఎస్ బ్రాండ్ బలంగానే ఉంది. అయితే ఇప్పుడు ఆ పింక్ బ్రాండ్‌కి చెక్ పెట్టి, తనదైన మార్క్‌తో హైదరాబాద్‌లో మార్పు చూపించబోతోందా అధికార కాంగ్రెస్ పార్టీ. నవాబుల తీన్మార్ సిటీకి..మూ డు రంగులతో నయా బ్రాండ్ తెచ్చేవిధంగా, కాంగ్రెస్ తన మార్క్ అద్దాలనుకుంటోందా? అందుకే తెలంగాణ బడ్జెట్‌లో హైదరాబాద్ అభివృద్ధికి పెద్ద పీట వేశారా అంటే..అవుననే అంటున్నాయి రాజకీయ వర్గాలు. ఇప్పటికే హైడ్రా, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్, రీజనల్ రింగ్ రోడ్ లాంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను ముందుకు తెస్తున్నారు సీఎం రేవంత్. తన డ్రీమ్ ప్రాజెక్టులతో భాగ్య నగరానికి మెరుపు కలలు, కళలు తేవాలనే గట్టి పట్టుదలతో ముందుకు అడుగులు వేస్తున్నారు ముఖ్యమంత్రి. హైదరాబాద్ నగరాభివృద్ధిపై స్పెషల్ ఫోకస్ పెట్టింది ప్రభుత్వం. దీనిలో భాగంగా.. ఎన్నడూ లేని విధంగా తెలంగాణ బడ్జెట్‌లో భాగ్య నగరానికి భళా అనిపించేలా పది వేల కోట్ల రూపాయల కేటాయింపులు చేసింది కాంగ్రెస్ సర్కార్. బడ్జెట్‌లో హైదరాబాద్‌కి కేటాయించిన పది వేల కోట్ల రూపాయలను వివిధ శాఖలకు కేటాయించనున్నారు. GHMC కి రూ. 3,065 కోట్లు, HMDA కి రూ. 500 కోట్లు కేటాయించారు. మెట్రో వాటర్ వర్క్సుకు రూ. 3,385 కోట్లు, హైడ్రాకు 200, అటు ఓల్డ్ సిటీకి, ఇటు శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు మెట్రో రైలు పొడిగింపు కోసం 600 కోట్లు కేటాయించారు. ఇక ఎంఎంటీఎస్‌కి 50కోట్లు, మూసీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు 1500 కోట్ల కేటాయింపులు జరిపారు. ఈ కేటాయింపులతో నగరంలో అభివృద్ధితో పాటు మౌలిక సదుపాయాలపై కూడా రేవంత్ సర్కార్ ఫోకస్ చేస్తోంది. బడ్జెట్‌లో హైదరాబాద్‌కు పది వేల కోట్ల రూపాయలను కేటాయించి... ప్రపంచ స్థాయి నగరంగా మార్చే విజన్‌తో ముందుకు వెళుతున్నామన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. ఈ కేటాయింపులతో హైదరాబాదీల జీవన ప్రమాణాలు మెరుగు పడతాయని, ఆర్థిక, సాంస్కృతిక కేంద్రంగా హైదరాబాద్ స్థానం మరింత సుస్థిరమవుతుందన్నారు ఉత్తమ్ కుమార్ రెడ్డి. హైదరాబాద్‌కు నయా బ్రాండ్... అది కూడా కాంగ్రెస్ మార్కుతో నగరంపై సరికొత్త ముద్ర వేయడానికి, పాత వాసలను చెరిపెయ్యడానికి, రేవంత్ సర్కార్ పక్కా ప్రణాళికతో ముందుకు వెళుతోందంటున్నారు విశ్లేషకులు.

## ఎల్ఆర్ఎస్ అమలుకు కొత్త జిల్లాల వారీగా ప్రత్యేక బృందాలు: డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్: లే అవుట్ క్రమబద్ధీకరణ పథకం(ఎల్ఆర్ఎస్) అమలు కోసం కొత్త జిల్లాల వారీగా బృందాలు ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ అమలుపై సచివాయలంలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా అమలు చేయాలని ఉపముఖ్యమంత్రి స్పష్టం



చేశారు. ఎల్ఆర్ఎస్ విధివిధానాల కసరత్తుపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 39 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వీలైనంత వేగంగా పరిష్కరించాలన్నారు.


జిల్లాల వారీగా బృందాలు ఏర్పాటు చేయాలని, సిబ్బంది కొరత ఉంటే ఇతర శాఖల నుంచి డిప్యుటేషన్‌పై తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి రామకృష్ణారావు, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల, శాఖల ముఖ్యకార్యదర్శులు నవీన్ మిత్తల్, జ్యోతి బుద్ధ ప్రకాష్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, గృహనిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి వీపీ గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.




హైదరాబాద్: ధరణి సమస్యల పరిష్కారానికి మరింత లోతుగా అధ్యయనం చేయాలని అధికారులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. కేసీఆర్ ప్రభుత్వంలో ధరణి పోర్టల్ విషయంలో రైతులు నానా ఇబ్బందులు పడిన విషయం తెలిసిందే. అయితే కాంగ్రెస్ ప్రభుత్వంలో అలాంటివేమి ఉండకూడదని భావించిన రేవంత్.. శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపడుతున్నారు.

శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో ధరణి సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ధరణి సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో ధరణిపై పలు అంశాలపై సీఎం రేవంత్ సంబంధిత అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సవరణలపై కొత్త సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. సవరణలపై ప్రజాభిప్రాయం పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. అఖిలపక్ష సమావేశం నిర్వహించి అభిప్రాయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి వివరించారు. ప్రజల అభిప్రాయాలు, సూచనల ఆధారంగా సమగ్ర చట్టం రూపొందించాలని సూచించారు. అవసరమైతే అసెంబ్లీలోనూ చర్చ పెడదామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు.

ధరణిపై కీలకంగా చర్చించిన ఈ సమావేశంలో మంత్రి పొంగులేటి, ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావు, జానారెడ్డి, ధరణి కమిటీ సభ్యులు కోదండ రెడ్డి, సునీల్, సీఎస్ ధరణిలో సమస్యలు, మార్పులు-చేర్పులపై సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించారు.




## వచ్చే నెలలోనే పంచాయతీ ఎన్నికలు

## రేవంత్ రెడ్డి కీలక ప్రకటన

పంచాయతీ ఎన్నికలపై సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఈ రోజు సీఎం అధికారులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే సర్పంచ్‌ల పదవీకాలం ముగిసి ఆరు నెలలు కావొస్తుందన్నారు. ఈ నేపథ్యంలో రిజర్వేషన్లలో ఎలాంటి మార్పు లేకుండా గత రిజర్వేషన్లలే కొనసాగించాలని అధికారులకు సూచించారు. ఆగస్టు నెలలో ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో మంత్రి సీతక్కతో పాటు అధికారులు పాల్గొన్నారు.








# ఉద్యోగార్థులకు శుభవార్త

## మరో 30 వేల పోస్టుల భర్తీపై సీఎం రేవంత్ కీలక ప్రకటన!

హైదరాబాద్: తెలంగాణ విపత్తు నిర్వహణ, అగ్నిమాపక శాఖలో భర్తీ అయిన 483 మంది ఫైర్‌మెన్ అభ్యర్థులకు ఇవాళ శిక్షణ పూర్తి అయిన విషయం తెలిసిందే. తెలంగాణ విపత్తు నిర్వహణ, అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో వీరంతా నాలుగు నెలలుగా తీసుకుంటున్న శిక్షణ నేటితో పూర్తయింది. ఈ క్రమంలోనే ఇవాళ ఫైర్ మెన్ అభ్యర్థుల పాసింగ్ అవుట్ పరేడ్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఫైర్ మెన్ శిక్షణ పూర్తి చేసుకున్న యువకులకు శుభాకాంక్షలు తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న మిమ్మల్ని చూసి మీ తల్లిదండ్రులు గుండెల నిండా సంతోషిస్తున్నారన్నారు. ఏ ఆకాంక్షతో యువత తెలంగాణ పోరాటంలో పాల్గొన్నారో.. ఆ ఆకాంక్షను గత ప్రభుత్వం నెరవేర్చలేదని రేవంత్ అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నిరుద్యోగుల ఆకాంక్షలు నెరవేర్చేందుకు ఉద్యోగ నియామక పత్రాలను పంపిణీ చేశామన్నారు. సమాజాన్ని కాపాడాలన్న ఉద్దేశంతో ముందుకు వచ్చిన మీ అందరినీ అభినందిస్తున్నానని రేవంత్ అన్నారు. తమ ప్రభుత్వం ప్రజల ఆలోచనలకు అనుగుణంగా ముందుకు వెళుతోందన్నారు. అందులో భాగంగానే విద్య, వ్యవసాయా నికి బడ్జెట్‌లో అత్యధిక నిధులు కేటాయించామని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఆలోచనలకు అనుగుణంగా విద్య, వైద్యానికి బడ్జెట్‌లో ప్రాధాన్యతనిచ్చామని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు మొదటి తారీఖు జీతం అందించి ఉద్యోగులకు ప్రభుత్వంపై విశ్వాసం కల్పించామని రేవంత్ తెలిపారు. 90 రోజుల్లో మరో 30 వేల ఉద్యోగాలను భర్తీ చేయబోతున్నామన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది తిరగకముందే 60 వేలకు పైగా ఉద్యోగాలు అందించి నిరుద్యోగుల్లో విశ్వాసం కల్పిస్తున్నామన్నారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసత్తా ముందుకెళతామన్నారు. నిరుద్యోగులకు, విద్యార్థులకు ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ఒక సూచన చేశారు. వారికి ఏవైనా సమస్యలు ఉంటే మంత్రులు, ఎమ్మెల్యేలకు విన్నవించాలని రేవంత్ తెలిపారు. మీ సమస్యలను పరిష్కరించేందుకు మీ రేవంతన్నగా మీకు ఎప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

# సంపాదకీయం

## పవర్ ఫుల్ పాస్ పోర్ట్ లలో భారత్ స్థానం తెలుసా?

ప్రపంచంలోనే శక్తివంతమైన పాస్ పోర్ట్ లు... ఈ చర్చ ప్రతీ ఏటా తెరపైకి వస్తుంటుంది. ఈ నేపథ్యంలో తాజాగా హెన్లీ పాస్ పోర్ట్ ఇండెక్స్ అనే సంస్థ.. ప్రపంచంలోనే పవర్ ఫుల్ పాస్ పోర్ట్ కలిగిన దేశాల జాబితాను విడుదల చేసింది. ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్ పోర్ట్ అసోసియేషన్ (ఐఏటీఏ) నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ఈ లిస్ట్ రూపొందించినట్లు వెల్లడించింది. అవును... వరల్డ్ వైడ్ పవర్ ఫుల్ పాస్ పోర్ట్స్ లిస్ట్ ను తాజాగా హెన్లీ పాస్ పోర్ట్ ఇండెక్స్ సంస్థ విడుదల చేసింది. ఈ సందర్భంగా... భారతీయులకు గుడ్ న్యూస్ చెప్పింది. ఇందులో భాగంగా... గతంతో పోలిస్తే మూడు స్థానాలు మెరుగుపర్చుకున్న భారత్... ఈ పవర్ ఫుల్ పాస్ పోర్ట్స్ తాజా జాబితాలో 82వ స్థానంలో నిలిచింది. కాగా... ఈ ఏడాది ఫిబ్రవరిలో 85వ స్థానంలో ఉండేది! ప్రస్తుతం మన పాస్ పోర్ట్ తో మలేషియా, థాయ్ లాండ్, ఇండోనేషియా వంటి 58 దేశాలకు వీసా లేకుండా ప్రయాణం చేయొచ్చు. వాస్తవానికి గతంలో ఈ లిస్ట్ లో 59 దేశాలు ఉండగా.. ఇప్పుడు ఒకటి తగ్గింది. ఇక మన పక్కనున్న పాకిస్థాన్ ఈ జాబితాలో 100 స్థానంలో ఉండగా.. ఆ దేశ పాస్ పోర్ట్ తో 33 దేశాలకు వీసా లేకుండా వెళ్లొచ్చు. ఇక వరల్డ్ లోనే పవర్ ఫుల్ పాస్ పోర్ట్ జాబితాలో సింగపూర్ అగ్రస్థానంలో నిలిచింది. ఈ పవర్ ఫుల్ పాస్ పోర్ట్ తో 195 దేశాలకు వీసా లేకుండా వెళ్లొచ్చని హెన్లీ పాస్ పోర్ట్ ఇండెక్స్ వెల్లడించింది! ఇక సింగపూర్ తర్వాత రెండో స్థానంలో... జర్మనీ, జపాన్, ఫ్రాన్స్, స్పెయిన్, ఇటలీ దేశాల పాస్ పోర్టులు ఉన్నాయి. ఈ దేశాల పాస్ పోర్ట్ లతో 192 దేశాలకు వీసా లేకుండానే ప్రయాణం చేయవచ్చు. ఇక మోస్ట్ పవర్ ఫుల్ పాస్ పోర్ట్స్ జాబితాలో మూడో స్థానంలో... నెదర్లాండ్స్, స్వీడన్, ఆస్ట్రియా, ఫిన్ లాండ్, ఐర్లాండ్, సౌత్ కొరియా, లగ్జెంబర్గ్ దేశాలు ఉన్నాయి. ఈ దేశాల పాస్ పోర్ట్ తో వీసా లేకుండా 191 దేశాలకు వెళ్లవచ్చు. ఇక ఈ జాబితాలో 8వ స్థానం దక్కించుకుంది అగ్రరాజ్యం అమెరికా. ఈ దేశం పాస్ పోర్ట్ ఉన్నవారు ప్రపంచలోని 186 దేశాలకు వీసా లేకుండా వెళ్లిరావొచ్చు. ఇక ఈ జాబితాలో అట్టడుగున నిలిచింది ఆఫ్ఘానిస్థాన్. 103వ ర్యాంక్ లో ఉన్న ఈ దేశ పాస్ పోర్ట్ కలిగినవారు 26 దేశాలకు వీసా రహిత ప్రయాణాలు చెయవచ్చు అని హెన్లీ పాస్ పోర్ట్ ఇండెక్స్, తన తాజా నివేదికలో వెల్లడించింది.

## అలియాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి మౌలిక సదుపాయాలు అందించిన

# బయోలాజికల్ ఈ లిమిటెడ్



శామీర్‌పేట, (గరుడ వార్త) : ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎస్ఆర్ నిధులతో అవ సరమైన మౌలిక సదుపాయాలు కలిపిస్తున్నా మని బయోలాజికల్ ఈ లిమిటెడ్ కంపెనీ సీఈఓ లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం శామీర్‌పేట మండలం అలియాబాద్ లోని ప్రభుత్వ పల్లె దవఖాన (ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్) లో అవసరమైన కొత్త వీల్ ఛైర్స్, టేబుల్స్, వాటర్ డిస్పెన్సరీ, మెడికల్ స్టోర్ ర్యాక్స్, ఫర్నీచర్, సోలార్ వస్తువులను సీఎస్ఆర్ నిధులతో బయోలాజికల్ ఈ లిమిటెడ్ కంపెనీ సీఈఓ లక్ష్మీనారాయణ అందజేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ...అలియాబాద్ లోని పల్లె దవఖానలో ప్రజలకు సహకారమందించాలనే ఉద్దేశ్యంతో తమ కంపెనీ ఆధ్వర్యంలో ప్రజలకు ఉపయోగపడే వస్తువులను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు అవ సరమైన వస్తువులను అందజేసి సహకారమందించడమే తమ కంపెనీ ధ్యేయమని ఆయన చెప్పారు. తమ కంపెనీ ద్వారా సీఎస్ఆర్ పథకం కింద సమాజ సేవ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రుల్లో తమ కంపెనీ ప్రజల కోసం ఆరోగ్య పరికరాలను అందజేసినట్లు చెప్పారు. అనంతరం పల్లె దవఖాన పరిసరాల్లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో నాయకులు కమఠం కృష్ణారెడ్డి, రాం రెడ్డి, బయోలాజీకల్ ఈ లిమిటెడ్ ప్రతినిధులు రుద్రరాజు ప్రభాకర్, క్రిష్ణచైతన్య, శామీర్‌పేట ఆస్పత్రి వైద్యులు శ్రీకాంత్, రవీందర్, సంగీత, సిబ్బంది పాల్గొన్నారు.

# కాలుష్య మిల్లులు!



పెద్దపల్లి: జిల్లాలో ఇప్పటికే పారిశ్రామిక ప్రాంతమైన రామగుండంలో ఎరువులు, విద్యుత్తు, సింగరేణి, సిమెంట్, ఇటుక పరిశ్రమలు వెదజల్లే కాలుష్యంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఆ కోవలోకి బియ్యం మిల్లులు కూడా వచ్చి చేరాయి. పెద్దకల్వల వయా రాజీవ్ రహదారి నుంచి సుల్తానాబాద్‌లోకి ప్రవేశించగానే ఒక్కసారిగా బియ్యం మిల్లుల నుంచి వచ్చే ఊక దుమ్ము, బాయిల్డ్ మిల్లుల నుంచి వచ్చే నల్లధూళి కణాలు కళ్లలో పడి నరకం చూపిస్తాయి. నిరంతరం వాహన చోదకులకు, ప్రయాణికులకు ఈ మార్గం ఇబ్బంది కరంగా మారింది. మరోవైపు బాయిల్డ్ (ఉప్పుడు) మిల్లుల నుంచి వెలువడే నీటి వ్యర్థాలు పరిసర పంటపొలాలకు నిల్వ చేరి దుర్వాసన వెదజల్లుతున్నాయి. సుల్తానాబాద్‌లోని కాట్నపల్లి, పూసాల గ్రామాల్లోని ఉప్పుడు మిల్లుల నుంచి వెలువడే బియ్యం వ్యర్థపు నీటిని తాగేందుకు పందులు, ఇతర పశువులు వచ్చి తమ పంటలను నాశనం చేస్తున్నాల యని ఇటీవలే ప్రజావాణీలో కొందరు రైతులు ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. దీనిపై జిల్లా పర్యావరణ కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) ఈఈని వివరణ కోరేందుకు చరవాణిలో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

గాలిలో దీపంగా పర్యావరణ పరిరక్షణ

కొంతమంది మిల్లర్లు ప్రత్యామ్నాయ రాజకీయ శక్తులుగా వ్యవహరిస్తూ పర్యావరణ నిబంధనలు అతిక్రమిస్తున్నారు. అధికారులు తనిఖీలు చేసేందుకు వస్తే రాజకీయ పైరవీలు, ఒత్తిళ్లు చేయిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా బియ్యం మిల్లుల సంక్షేమ సంఘాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. రాజకీయ పార్టీల వారీగా మిల్లర్లు ఉండటంతో అధికారులు వస్తే తనిఖీలు చేసేందుకు సహకరించడం లేదు.

రైస్‌మిల్లుల నుంచి వెలువడే ధాన్యపు పొట్టు బయటకు రాకుండా, రహదారులపై పడకుండా ప్రత్యేకంగా కవర్లు, సంచులను ఏర్పాటు చేయాలి. ఇలా 20 శాతం రైస్‌మిల్లులు మాత్రమే చేస్తున్నాయి. గాలిలో ధూళి, దుమ్ము చేరకుండా నాణ్యమైన యంత్రాలను ఉపయోగించాలి. 30 శాతం మిల్లుల్లో ఈ యంత్రాలకు కాలం చెల్లాయి.

ఈ మిల్లుల పరిశ్రమల చుట్టూ 10 మీటర్ల మేరకు వెడల్పుతో 'గ్రీన్‌బెల్ట్'ను అభివృద్ధి చేస్తూ మొక్కలు నాటి వాటిని పర్యవేక్షించాలి. జిల్లాలోని ఏ ఒక్క రైస్‌మిల్లులో చెట్లు పెంచడం లేదు.

ధాన్యం వండుతున్న క్రమంలో వెలువడే మిల్లులోని వ్యర్థ జలాలను బహిరంగ ప్రదేశాలకు, కాలువల్లోకి వదలవద్దు. ప్రత్యేకంగా రైస్‌మిల్లులో వ్యర్థాలకు సంబంధించిన ఏర్పాట్లు చేసుకోవాలి. 80 శాతం మిల్లులకు ఈ వ్యవస్థ లేదు.

బాయిలర్ నుంచి వచ్చే బూడిదను నిల్వ చేయడానికి మూసి ఉండే షెడ్లు ఏర్పాటు చేయాలి. ఈ నిబంధనల్లో ఏ ఒక్కటి ఎవరూ సరిగా పాటించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

మిల్లుల్లో వెలువడే పొగ మూలంగా సమీప ఇళ్లలో ఉండే గృహిణులు, వృద్ధులు ఎక్కువగా శ్వాసకోశ సంబంధ, నేత్ర సంబంధ వ్యాధులకు గురవుతున్నారు.

పెద్దపల్లి నూతన కలెక్టరేట్‌లో సమీపంలో ఉన్న 8 మిల్లులకు అధికారులకు గతంలో పీసీబీ నోటీసులు ఇచ్చింది. వెంటనే పొగ, ఊకధూళి రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించినప్పటికీ ఫలితం లేదు. ఇప్పటికీ ఇక్కడి మొక్కలు, కార్యాలయాలు, వాహనాలపై వీటికి సంబంధించిన ధూళి కమ్మేస్తున్నాయి.

నిబంధనల బేఖాతరు

నిబంధనలు పాటించని రైస్‌మిల్లుల నిర్వహణ మూలంగా కూడా పరిసరాలు కంపుకొడుతున్నాయి. కాలం చెల్లిన యంత్రాలు వెదజల్లే పొగతో కార్బన్ డై ఆక్సైడ్ మోతాదు ఎక్కువై సమీప పంట పొలాలు, చెట్లకు పొగ, ధూళి చేరుతుంది. వాతావరణంలో కర్బన ఉద్గారాలను విడుదల చేస్తున్నాయి. అయిదేళ్ల క్రితం వాయు కాలుష్యానికి కారణమవుతున్న మిల్లు యజమాన్యాలకు గతంలో పర్యావరణ కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) నోటీసులు జారీ చేయగా రాజకీయ పైరవీలతో నోటీసులకు స్పందించడం లేదు. జిల్లాలో 112 బాయిల్డ్, 80 వరకు రా రైస్ మిల్లులున్నాయి.

# సేవల విస్తరణలో జాప్యం

జగిత్యాల : ఉమ్మడి జిల్లా కేంద్రంగా ఉన్న జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) సేవలను కొత్త జిల్లాలకు విస్తరించేలా ఏడాది క్రితమే ఏర్పాటుచేయ తలపెట్టిన ప్రాంతీయ కార్యాలయాలను కనీసం ఈ ఆర్థిక సంవత్సరంలోనైనా అమలుచేస్తే రైతులకు కర్షకులకు ఉపయుక్తంగా ఉంటుంది. జిల్లాలవారీగా డీసీసీబీలను ఏర్పాటు చేయాలని ముందుగా నిర్ణయించినా వివిధ కారణాలతో ప్రాంతీయ కార్యాలయాలను ఏర్పాటుచేసి తదుపరి కొత్త జిల్లాలవారీగా డీసీసీబీలను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఇప్పటివరకు జిల్లా నుంచి కొందరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(ప్యాక్స్) అధ్యక్షులకు కరీంనగర్‌లోని డీసీసీబీలో సభ్యులుగా అవకాశం ఇస్తూవచ్చారు.

ప్రస్తుతం జిల్లాలో 15 బ్యాంకుశాఖలు పనిచేస్తుండగా జగిత్యాలలో ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటుచేసి రైతులు, సహకార సంఘాలకు సేవలను మరింతగా దరిచేర్చాలన్న నిర్ణయాన్ని తక్షణమే అమల్లోకి తేవాలి. ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుచేసిన అనంతరం డీసీసీబీలను కొత్త జిల్లాల వారీగా ఏర్పాటు చేసినట్లయితే జిల్లాకు చెందిన ప్యాక్స్‌ల అధ్యక్షులతోనే డీసీసీబీ కార్యవర్గం ఏర్పాటవుతుంది. ప్రస్తుతం కరీంనగర్ డీసీసీబీ పరిధిలో జగిత్యాలలో బ్యాంకు ఉండగా బ్యాంకు ఆవరణలోనే పాత భవనం కూడా ఉంది. ప్రస్తుతం డీసీసీబీ ప్రాంతీయ కార్యాలయాన్ని ఇక్కడే ఏర్పాటుచేసే వీలుంది, తదుపరి డీసీసీబీ ఏర్పాటుకు కూడా అనువుగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. డీసీసీబీ పరిధిలో ప్రస్తుతం రైతులకు పంట రుణాలు, టర్మ్ రుణాలు, దీర్ఘకాలిక, వ్యాపార రుణాలను ఇస్తుండగా కరీంనగర్‌లోని కేంద్ర కార్యాలయం నుంచి అనుమతి పొందాల్సి వచ్చేది.

గ్రామానికో ప్యాక్స్ లక్ష్యం..

దేశంలో అయిదేళ్లలో 2 లక్షల నూతన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని, ప్రతి గ్రామానికో ప్యాక్స్ ఉండాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు జిల్లాలోనూ ప్యాక్స్‌ల సంఖ్య పెరగనుంది. ప్యాక్స్‌ల ద్వారా 25 రకాల సేవలను అందించాలని కేంద్రం నిర్ణయించింది. జిల్లాలో ఇప్పటికే 51 ప్యాక్స్‌లుండగా 385 గ్రామపంచాయతీల్లో కనీసం మరో 50 గ్రామాల్లో నూతనంగా ప్యాక్స్‌లను ఏర్పాటుచేసే వీలుండటం కర్షకులకు కలిసిరానుంది. డీసీసీబీ పరిధిలో ఖాతాదారులు, సేవలు పెరిగినట్లయితే నాబార్డు, కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల రాయితీలు కూడా రైతులు, సహకార సంఘాలకు సులువుగా అందుతాయి. అన్నిసంఘాల పరిధిలో ధాన్యం, మక్కలను కొనుగోలు చేస్తుండగా జగిత్యాల, రాయికల్ తదితర సంఘాలు కేంద్ర ఎరువుల సంస్థ క్రిభ్‌కోలో రూ.50 లక్షల చొప్పున వాటాధనం చెల్లించి సాలీనా రూ.10 లక్షల డెవిడెంట్ పొందుతున్నాయి. చాలాసంఘాలు రుణాల మంజూరు, బ్యాంకింగ్ కౌంటర్లు, లాకర్లు, పెట్రోలు పంపులను నిర్వహిస్తుండగా విత్తనశుద్ధి ప్లాంట్లు, రైస్‌మిల్లుల ఏర్పాటుకు కృషి చేస్తున్నాయి. నాబార్డుద్వారా పలు సంఘాలకు రూ.20 లక్షల చొప్పున నిధులను అందించగా గోదాములను నిర్మించారు. ఈ నేపథ్యంలో డీసీసీబీ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు, ప్యాక్స్ కేంద్రాల సంఖ్యపెంపు, ప్యాక్స్‌ల్లో రైతులందరినీ సభ్యులుగా చేర్పించటం దీర్ఘకాలికంగా లాభం కలిగించనుంది.

## లాల్ గడి మలక్ పేట గ్రామాన్ని సందర్శించిన మండల ప్రత్యేకాధికారి

శామీర్ పేట, (గరుడ వార్త): షామీర్పేట్ మండల ప్రత్యేకాధికారి సైదులు లాల్ గడి మలక్ పేట గ్రామాన్ని సందర్శించారు. శుక్రవారం శామీర్ పేట మండల ప్రత్యేకాధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సైదులు లాల్ గడి మలక్ పేట గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మెదడు వాపు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలందరికీ ఈ టీకా వేయాలని





ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. గ్రామంలోని హరిజనవాడ లోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి బియ్యం నిలువలను పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రాలు సందర్శించి సమయానికి గర్భిణీలకు, తల్లులకు, పిల్లలకు పౌష్టికాహారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మమతా బాయి, పంచాయితీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డీ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఇన్నోవా కారు బీభత్సం ఇద్దరు మృతి ....

శామీర్ పేట, (గరుడ వార్త): ఇన్నోవా కారు బీభత్సం సృష్టించిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలైన సంఘటన తుర్కపల్లి జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం ఓ ఇన్నోవా కారు బేరింగ్ నెంబర్ ఏపి02క్యు 2268 సిద్దిపేట వైపు నుంచి హైద్రాబాద్ వైపు వస్తు లాల్ గడి





మలక్ పేట పరిధిలోని రాజీవ్ రహదారిపై కారు అతి వేగంగా వెళు అదుపు తప్పి డివైడర్ ను ఢీ కొట్టి పల్టీ కొట్టింది. ఈ క్రమంలో రోడ్డుకు అవతలవైపు మజీద్ పూర్ వైపు నుంచి తుర్కపల్లి వైపు వెళుచున్న ఆక్టీవ వాహనం, బయాలజికల్ ఈ లిమిటెడ్ కంపెనీకి చెందిన బస్సును ఇన్నోవా కారు ఢీకొట్టి నుజ్జు నుజ్జు అయింది. కారు నడుపుతున్న హకీం పేటకు చెందిన మోహన్(25) కారులో ఉన్న మౌలాలికి చెందిన దీపిక (23)లు అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలిసులు తెలిపారు. బైక్ పై వెళ్తున్న కంపెనీ ఉద్యోగి సుబిదాస్ (26) కు తీవ్రగాయాలైనట్లు, బస్సులో ఉన్న(కంపెనీ ఎంప్లాయిస్) 10 మందికి, డ్రైవర్ కు స్వల్ప గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. కారు అతివేగమే రోడ్డు ప్రమాదానికి కారణమని తెలిపారు. ఈ మేరకు జీనోమ్ వ్యాలీ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

## మారనున్న మదింపు విధానం

కామారెడ్డి : పురపాలికల్లో ఆస్తిపన్ను మదింపు విధానం మారనుంది. విలువ ఆధారంగా పన్ను ఖరారు కానుంది. దీనికి సంబంధించి కసరత్తును ప్రభుత్వం ముమ్మరం చేసింది. పన్ను విధింపులో కనిష్ఠ, గరిష్ఠ పరిమితులను నిర్ణయించింది. ఆయా పురపాలికల పరిధిలో పన్ను ఖరారు నిర్ణయాన్ని వారికే అప్పగించింది. దీంతో ఉమ్మడి జిల్లాలో ఏళ్ల నాటి ఆస్తి పన్నుల విషయంలో మార్పులు చోటుచేసుకోనున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ఈ విధానాన్ని అమలు చేయనున్నారు.ఆస్తి పన్ను ఖరారులో రిజిస్ట్రేషన్ల శాఖకు ప్రభుత్వం మెలిక పెట్టింది. తాజా విధానంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ భూములు, వ్యవసాయే తర ఆస్తుల విలువలను సవరించే మేరకు ఆస్తి పన్ను ఖరారవనుంది. ఇటీవల రిజిస్ట్రేషన్ల రుసుంలు పెరగడంతో నూతన విధానంలో ఎంత మేర ఆస్తిపన్ను ఉంటుందో అధికారులు అంచనా వేసే పనిలో నిమగ్నమయ్యారు. తాజాగా నిర్మాణ స్థలం, భవన విలువను పరిగణన లోకి తీసుకోనున్నారు. భూమి విలువ, ఆస్తి విలువ పెరిగే కొద్దీ పన్ను కూడా పెరగనుంది.

**75 గజాల్లోపు రూ.100** పురపాలక చట్టం ప్రకారం 75 గజాల్లోపు ఉన్న భవనానికి ఆస్తిపన్ను రూ.100 చెల్లించాల్సి ఉంటుంది. నివాసేతర భవనాలకు దాని విలువలో కనిష్ఠంగా 0.10 శాతం గరిష్ఠంగా 1 శాతం ఆస్తి పన్ను ఉంటుంది. వాణిజ్య భవనాలకు మార్కెట్ విలువలో కనిష్ఠంగా 0.25 శాతం, గరిష్ఠంగా 2 శాతం ఆస్తి పన్ను విధించనున్నారు. ఇక ప్రార్థన మందిరాలు, గ్రంథాలయాలు, చారిత్రక నిర్మాణాలు, ఆసుపత్రులు, బల్దియా భవనాలు, అనాథ, వృద్ధాశ్రమాలకు పన్నులో మినహాయింపు వర్తించనుంది.

ఖాళీ స్థలాలపై సైతం..నగర, పురపాలికల్లో ఖాళీస్థలాలకు పన్ను విధించనున్నారు. కనిష్ఠంగా 0.05 శాతం, గరిష్ఠంగా 0.20 శాతం ఖరారు కానుంది. ఖాళీస్థలాల్లో నిర్మాణాలు లేకున్నా ఇక నుంచి పన్ను పరిధిలోకి రానున్నాయి. నిర్మాణం చేసేటప్పుడు వీఎల్‌టీ కింద చెల్లించాల్సి ఉంటుంది. పురపాలకశాఖ నుంచి నిరభ్యంతర పత్రం అందజేయాల్సి ఉంటుంది. ఖాళీస్థలాలపై పన్ను వేయడం ద్వారా వచ్చే నిధులతో బల్దియాలు వివిధ అభివృద్ధి పనులకు వెచ్చించే వెసులుబాటు కలగనుంది.ఉత్తర్వులు రాగానే అమలు– సుజాత, కామారెడ్డి కమిషనర్‌పురపాలికలో ఆస్తి పన్నును మార్కెట్ విలువ ఆధారంగా పెంచేందుకు చర్యలు చేపట్టనున్నాం. అధికారిక ఉత్తర్వులు రాగానే క్షేత్రస్థాయిలో పక్కాగా అమలుకు చర్యలు తీసుకుంటాం. నిబంధనల మేరకు ఆస్తి పన్ను ఖరారు చేయనున్నాం.

# ఎప్పటికో శుద్ధీకరణ



సిరిసిల్ల : కోరుట్ల మున్సిపాలిటీ పరిధిలో మల వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రం నాలుగేళ్ల క్రితం, రామగుండం నగరపాలికలో ఏడాది క్రితం నిర్మించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు సెప్టిక్ ట్యాంకుల ద్వారా వచ్చే మానవ వ్యర్థాలను మాత్రమే శుద్ధి చేస్తున్నారు. దీని ద్వారా వచ్చే ఎరువును మొక్కలకు, పంట పొలాలకు వినియోగించుకుంటున్నారు. ఈ ఎరువు విక్రయించడం ద్వారా ఆదాయం కూడా రానుంది.చెత్త మొదలుకొని.. మానవ వ్యర్థాల వరకు ఎరువుల తయారీ చేయడంతో పాటు ఎప్పటికప్పుడూ శుద్ధీకరణ చేస్తే పట్టణాలు, నగరాలు ఆరోగ్యకరంగా ఉంటాయి. వీటిని నిర్మించేందుకు మూడేళ్ల కిందట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకొచ్చినప్పటికి.. కొన్ని పురపాలికల్లో పూర్తి కాగా, మిగతా ప్రాంతాల్లో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు.

న్యూస్‌టుడే, కరీంనగర్ కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీలు, నగరపాలికలు స్వచ్ఛ సర్వేక్షణ్‌లో బహిరంగ మలమూత్ర విసర్జన రహిత పట్టణాలుగా (ఓడీఎఫ్, ఓడీఎఫ్ంం) దూసుకెళ్తున్నాయి. కరీంనగర్ నగరపాలక సంస్థ ఒక అడుగు ముందుకేసి వాటర్ం సాధించింది. ఇంకేముంది ఎంపిక చేసిన మున్సిపాలిటీల్లో మానవ వ్యర్థాల శుద్ధీకరణ కోసం ఎఫ్ఎస్‌టీపీలు (ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా 16 మున్సిపాలిటీల పరిధిలో పది చోట్ల ఎఫ్ఎస్‌టీపీలు నిర్మించేందుకు మూడేళ్ల కిందట ప్రతిపాదనలు చేశారు. మూడు ప్రాంతాల్లో నిర్మించగా, అవి వినియోగంలోకి వచ్చాయి. మిగతా వాటి కోసం గతేడాది స్థలాలు అప్పగించినా ఇప్పటికి పనులు ప్రారంభించలేదు. ఒక్కో ప్లాంటుకు రూ.60 లక్షల మేర ఖర్చు అవుతుంది.

**మానవ వ్యర్థాలతో ఎరువు తయారీ**

ఇళ్లలోని సెప్టిక్ ట్యాంకుల నుంచి మానవ వ్యర్థాలను సెప్టిక్ క్లీనింగ్ వాహనాల ద్వారా వీటిని శుద్ధీ కేంద్రానికి తరలిస్తారు. యంత్రాల ద్వారా, గ్రావిటి ద్వారా వ్యర్థాలను వివిధ దశల్లో వేరు చేసి శుద్ధి చేస్తారు. ఘన, ద్రవ వ్యర్థాలు శుద్ధి చేసి నీటిని మొక్కలకు పంపిస్తారు. ఘన వ్యర్థాలతో ఎరువు తయారు చేస్తారు. ఇలా రామగుండం నగరపాలిక, సిరిసిల్ల, కోరుట్ల మున్సిపాలిటీల్లో శుద్ధి చేసే ప్రక్రియ కొనసాగుతోంది. దీని నిర్వహణను ఆస్కి సంస్థ నిర్వహణను చూసుకుంటుంది.

**భూగర్భ మురుగునీటి శుద్ధితోనే..**

కరీంనగర్ నగరపాలిక పరిధిలో భూగర్భ మురుగునీటి శుద్ధి కేంద్రం కొంతమేర ఊరటనిస్తోంది. నగరవ్యాప్తంగా ఉన్న సెప్టిక్ క్లీనింగ్ వాహనాలు సేకరిస్తున్న మల వ్యర్థాలను యూజీడీలోనే వేసి శుద్ధి చేస్తున్నారు. మొత్తం వ్యర్థాలను నీరుగా చేసి శుద్ధి చేసిన నీటిని చెరువుల్లోకి వదులుతున్నారు. ఎస్టీపీలోనే సాంకేతికను జోడించగా భవిష్యత్తు అవసరాలకు కొత్తగా ఎఫ్ఎస్‌టీపీ అవసరమని అధికారులు ప్రతిపాదనలు చేశారు.

**మూడేళ్లుగా పట్టింపేదీ?**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని నిర్మించాలని మూడేళ్ల క్రితమే టెండర్లు పిలిచారు. రాష్ట్రస్థాయిలోనే ప్యాకేజీల వారీగా ఖరారు చేయగా ఇప్పటికీ వీటిని నిర్మించేందుకు ముందుకు రావడం లేదు. వీరికి ఇచ్చిన ఒప్పంద గడువు ముగిసింది. మున్సిపాలిటీల్లో స్థలాలు సేకరించి అప్పగించడంలో కమిషనర్లు ఆసక్తి చూపించలేదు. ప్రస్తుతం ఆ పనులు చేసేందుకు ఏజెన్సీ సిద్ధంగా ఉండటంతో కరీంనగర్‌లో యూజీడీ ఎస్టీపీ పక్కనే ఎకరం స్థలం అప్పగించారు. ఆరు నెలలుగా పనులు మాత్రం ప్రారంభించలేదు. పరిశీలిస్తాంమున్సిపాలిటీల్లో మానవ వ్యర్థాల శుద్ధీ కేంద్రాలను నిర్మించడంలో ఎందుకు ఆలస్యం అవుతుందో పరిశీలిస్తాం. దీనికి సంబంధించిన వివరాలను తీసుకొని వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.ప్రఫుల్ దేశాయ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, కరీంనగర్

# మీటర్ ఒకటే.. బిల్లులు రెండు

కరీంనగర్ : నగరపాలక సంస్థ నుంచి రూ.లక్షల బిల్లులు రాబట్టుకొని ఖజానా నింపుకోవడమే లక్ష్యంగా విద్యుత్తు అధికారుల తీరు సాగుతోంది. బల్దియాపై పెను భారం మోపుతూ.. అటు వినియోగదారుల ఇళ్ల కనెక్షన్ల బిల్లులు వసూలు చేస్తూ రెండు రకాలుగా వ్యవహరించడం ఆ శాఖకే చెల్లిందనేదీ స్పష్టమవుతోంది!

కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోని విలీన కాలనీ తీగలగుట్టపల్లి ప్రాంతవాసులకు బావి ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఆ బావి దగ్గర 10 హెచ్‌పీ, 7.5 హెచ్‌పీ మోటార్లు నడుస్తున్నాయి. విద్యుత్తు సరఫరా కోసం సమీప డీటీఆర్(నియంత్రిక) నుంచి ఒక ఫీడర్ ప్రత్యేకంగా బావి మోటార్ల కోసం ఏర్పాటు చేశారు. దీనికి సంబంధించిన సీటీ మీటర్ డీటీఆర్ దగ్గరే ఉంది. నియంత్రిక వైపు నుంచి ఎడమ వైపులో పాతిక సంఖ్యలో నివాసిత భవనాలు ఉండగా.. కుడి భాగం గుండా పంపుల కోసం వెళ్తున్న ఒక ఫీడర్ నుంచి ఒకటెండ్రు స్తంభాలు వేసి ఆ ఇళ్లకు కనెక్షన్లు ఇచ్చారు.

**రెండు రీడింగ్‌లు ఒకే మీటర్‌లో..**

విద్యుత్తు నియంత్రిక దగ్గరే టీజీ/18/28 స్తంభానికి సర్వీసు నంబర్ 25738-03573 పేరుతో సీటీ మీటర్ 7031140 ఉంది. ఇక్కడి నుంచే బావికి విద్యుత్తు సరఫరా జరుగుతుండగా.. ఇదే లైనుకు సమీపంలోని ఇళ్లకు విద్యుత్తు సరఫరా ఇవ్వడంతో విద్యుత్తు మీటర్ తిరుగుతుంది. ఇళ్లకు, మోటార్లకు సంబంధించిన రెండు రీడింగ్‌లు ఒకే మీటర్‌లో నమోదు అవుతుండటంతో ఈ నెల 12,497 యూనిట్లకు రూ.1,68,329 బిల్లు వేశారు. ఇలా ఒక్కో నెలలో హెచ్చు,



తగ్గదలతో బిల్లు అధికమవుతోంది. నాలుగేళ్లుగా ఇలాగే సాగుతోంది. ఇంటి యజమానులకు వేరువేరుగా విద్యుత్తు బిల్లు వేస్తున్నారు. ఈ లెక్కన పరిశీలిస్తే నివాసిత ఇళ్ల వాడుకున్న విద్యుత్తు బిల్లు కూడా బల్దియాపైనే భారం మోపుతున్నట్లు తెలుస్తోంది.

**చూసీ చూడనట్లుగా..** మీటర్‌కు సంబంధించిన బిల్లులో సమీప ఇళ్ల కనెక్షన్లు వాడుకున్న యూనిట్లు ఇందులో కలుస్తున్నాయని పలుమార్లు నగరపాలక ఉద్యోగులు, సిబ్బంది.. విద్యుత్తు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని తెలిసింది. కటొట్లు, కేబుల్ కావాలని అధికారులు బలవంతం చేయడంతో సిబ్బంది వెనక్కి తగ్గారు. విద్యుత్తు శాఖ చేయాల్సిన పనిని బల్దియాపై రుద్దడం ఏమిటనే ప్రశ్న వారి నుంచి వ్యక్తమవుతోంది.

**రికవరీ చేస్తాం..** పంపు మోటార్ల సీటీ మీటర్‌పై ఇళ్లకు సంబంధించిన కనెక్షన్లు తొలగించి, ఆ బిల్లు మొత్తాన్ని రికవరీ చేసేందుకు విద్యుత్తు అధికారులకు లేఖ రాస్తాం. రెండింటినీ వేర్వేరు చేసేలా అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– ఆయుబ్‌ఖాన్, ఇన్‌ఛార్జి డీఈఈ, నగరపాలిక

# కాలానుగుణ వ్యాధుల విజృంభణ


కరీంనగర్: జిల్లాలో వైరల్ జ్వరాలు పెరిగిపోతున్నాయి. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు వీటి తీవ్రత మరింత ఎక్కువైంది. చెత్త కుప్పలు, మురుగుకాలువల్లో దోమలు పెరిగిపోయి.. ఇళ్లలోకి చేరుతున్నాయి. ఈక్రమంలో సీజనల్ వ్యాధులను అదుపులో పెట్టేందుకు పారిశుద్ధ్య పనులు, బ్లీచింగ్ చల్లడానికి ప్రభుత్వం ప్రతి ఆరోగ్య కేంద్రానికి, సబ్ సెంటర్‌కు, పంచాయతీలకు నిధులు ఇచ్చేది. ప్రస్తుతం అవి నిలిచిపోయాయి. ప్రజలు తీసుకునే జాగ్రత్తలు.. వైద్యులు, అధికారుల పాత్రను వివరిస్తూ 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

**అక్కడక్కడా అతిసారం కేసులు..**

గత కొన్ని రోజులుగా పిల్లలు, పెద్దలు అని తేడా లేకుండా సాధారణ, వైరల్ జ్వరాల వంటి వాటితో ఆసుపత్రుల్లో చేరుతున్నారు. అక్కడక్కడ అతిసార కేసులు నమోదవుతున్నాయి. జూన్, జులై నెలల్లో 20 మందికి పైగా డెంగీ నిర్ధారణ అయింది. కరీంనగర్ జనరల్ ఆసుపత్రిలో డెంగీ నిర్ధారణ పరీక్షల సౌకర్యం ఉండగా.. దాని బారిన పడిన వారికి వైద్య సౌకర్యాలూ ఉన్నాయి. తీవ్రత పెరిగితే ప్రత్యేక వార్డు ఏర్పాటు చేస్తామని వైద్యులు చెబుతున్నారు. వైద్య విధాన పరిషత్ పరిధిలోని జమ్మికుంట, హుజూరాబాద్‌తోపాటు నియోజకవర్గ కేంద్రాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యసేవలు మరింత పెంచాల్సిన అవసరముంది.

**వ్యాధుల లక్షణాలు..**

ఎడిస్ ఏజిప్టి అనే దోమ కారణంగా డెంగీ వస్తుంది. ఇది నిలువ ఉ



న్న నీటిలో గుడ్లు పెడుతుంది. దీని బారిన పడిన బాధితులు తీవ్ర జ్వరం, ఒళ్లు నొప్పులతో బాధపడ%ళి%తారు. రక్తంలోని ప్లేట్‌లేట్స్ తగ్గుతాయి. వెంటనే చికిత్స తీసుకోవాలి.

నీటి కుంటలు, ట్యాంకులలో ఆడ దోమ గుడ్లు పెడుతుంది. ఈ దోమ కాటుతో మలేరియా వస్తుంది. మురుగుకాలువలు, గుంతల్లో ఆడ క్యూలెక్స్ దోమ గుడ్లు పెట్టనుండగా.. దీని కాటుకు గురైతే పిల్లలు మెదడువాపు వ్యాధి బారిన పడతారు.

**ముందస్తు జాగ్రత్తలు....** పరిసరాల ఆవరణలో కొబ్బరిబొండాలు, సీసాలు, పగిలిపోయిన టైర్లలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. మురికి కాలువలు, నీటి నిల్వ ప్రదేశాల్లో గంబూషియా చేపలు వదలడం, ఆయిల్ బాల్స్ వేయాలి. ఇంటి చుట్టూ పిచ్చి మొక్కలు తొలగించాలి. ప్రతి ఇంటిలో తలుపులు, కిటికీలకు దోమ తెరలు అమర్చాలి. తెల్లవారుజామున, సాయంత్రం వేళల్లో ప్రధాన ద్వార కిటికీలు మూసి ఉంచాలినివారణ చర్యలు చేపడుతున్నాం..

డెంగీ, సాధారణ వైరల్ జ్వరాలపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యం అందుబాటులో ఉంది. గురుకుల పాఠశాలలు, వసతి గృహాలకు వైద్యులు వెళ్లి ప్రత్యేక పరీక్షలు చేస్తున్నారు. వారంలో ఒక రోజు డ్రైడే నిర్వహిస్తున్నాం.

– డాక్టర్ సుజాత, జిల్లా వైద్యాధికారి

# ఉచిత శిక్షణ... ఉపాధికి బాట



తిమ్మాపూర్: గ్రామీణ ప్రాంతాల యువతకు స్వయం ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఎస్‌బీఐ దేశ వ్యాప్తంగా వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రాలను గతంలో ఏర్పాటు చేసింది. ఉన్నత చదువులతో సంబంధం లేకుండా ఆసక్తి ఉన్న రంగాల్లో ఉచితంగా శిక్షణనందిస్తూ యువతి, యువకులకు ఉపాధి కల్పిస్తుంది. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్‌ఎండీ కాలనీలోని ఎస్‌బీఐ ఆర్.ఎస్.ఈ.టీ.ఐ(గ్రామీణా స్వయం ఉపాధి శిక్షణ సంస్థ) ద్వారా ఉమ్మడి జిల్లా యువతకు ఆయా కోర్సుల్లో ఉచిత శిక్షణతో పాటు వసతి కల్పిస్తూ వారి ఉజ్వల భవిష్యత్‌కు దారి చూపిస్తుంది. 2010లో ఈ శిక్షణ కేంద్రాన్ని నెలకొల్పగా.. ఇప్పటి వరకు 9308 మంది అభ్యర్థులు శిక్షణ పొందారు. 7149 మంది వారు తీసుకున్న శిక్షణ రంగంలో స్థిరపడ్డారు. 3395 మంది తమ వ్యాపార అభివృద్ధికి బ్యాంకు రుణాలను సైతం తీసుకున్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతులు కల్పిస్తుండగా.. శిక్షణ ముగిసిన తర్వాత ధ్రువీకరణ పత్రాలను అందచేసి, బ్యాంకు ఋణం తీసుకునే సౌకర్యాన్ని సైతం కల్పిస్తుండడం ఈ సంస్థ ప్రత్యేకత. అందుకే ఈ సంస్థ తెలంగాణలోనే ప్రథమ స్థానం.. 2013-14వ సంవత్సరంలో మొత్తం భారతదేశంలోనే ద్వితీయ స్థానంలో నిలిచింది.

**కోర్సులు..**

1.వ్యవసాయ విద్యుత్తు మోటార్ల మరమ్మతులు(ఎలక్ట్రికల్ మోటార్ రివైండింగ్), పంపుసెట్ నిర్వహణ 2.ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, 3.రిఫ్రిజిరేటర్, ఎయిర్ కండిషనింగ్(ఏసీ) రిపేరింగ్ 4.లేడిస్ టైలరింగ్ 5.ఫ్యాబ్రిక్ పెయింటింగ్, ఎంబ్రాయిడరీ 6.బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్ 7.చరవాణి రిపేరింగ్ 8.కంప్యూటర్ హార్డ్‌వేర్, నెట్ వర్కింగ్, 9.ఎల్.ఎమ్.వీ. డ్రైవింగ్ 10.కంప్యూటరైజ్డ్ అకౌంటింగ్ 11.ఎలక్ట్రిషియన్ 12.జ్యూట్ ప్రొడక్ట్ 13.కాస్ట్యూమ్ జూవెల్లరీ 14.సీసీ టీవీ ఇన్‌స్టాలేషన్ 15.టూ వీలర్ మెకానిక్.

**నలుగురికి ఉపాధి కల్పిస్తా**

బూరుగు లక్ష్మి, చిగురుమామిడి

గత 20 రోజులుగా సంస్థ వసతి గృహంలో ఉంటూ బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ తీసుకుంటున్నా. శిక్షకులు ఇచ్చే సలహాలు, సూచనలు వ్యాపార రంగంలో ఎంతగానో ఉపయోగపడతాయని భావిస్తున్నా. వీరు అందిస్తున్న శిక్షణతో తప్పకుండా బ్యూటీషియన్‌గా స్థిరపడడమే కాకుండా నలుగురికి ఉపాధి కల్పిస్తా.

**ఆత్మవిశ్వాసం పెరిగింది**

మానస, బసంత్‌నగర్

వార్తపత్రికలో ప్రకటన చూసి సంస్థలో అడ్మిషన్ తీసుకున్నా. బయట నేర్పించేవారికన్నా ఇక్కడ బాగా శిక్షణ ఇస్తున్నారు. బయట డబ్బులు పెట్టి నేర్చుకున్న ఇంత బాగా నేర్పరూ. ఇక్కడ శిక్షణతో పాటు వ్యాపార రంగంలో రాణించేందుకు అవసరమయ్యే మెళకువలు నేర్పిస్తున్నారు. దీంతో నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది.

**సద్వినియోగం చేసుకుంటే మంచి భవిష్యత్**

డి.సంపత్, డైరెక్టర్

తమ కాళ్లపై నిలబడుతూ నలుగురికి ఉపాధి కల్పించాలనేవారికి మా సంస్థ వెన్నుదన్నుగా నిలుస్తుంది. సంస్థలో అందించే శిక్షణను సద్వినియోగం చేసుకున్నవారికి మంచి భవిష్యత్తు ఉంటుంది. గ్రామీణా ప్రాంత యువతను వ్యాపార రంగంలో అగ్రగామిగా నిలపాలనే సంకల్పంతో ముందుకు వెళ్తున్నాం. సంస్థ ద్వారా ఇప్పటికి 9 వేల పైచిలుకు మందికి శిక్షణ ఇవ్వడం ఆనందంగా ఉంది.

# పదోన్నతులపై మిగిలిన ఉపాధ్యాయుల్లో ఆశలు

కరీంనగర్ : జిల్లాలో పదోన్నతులకు దూరమై నిరాశలో ఉన్న ఉపాధ్యాయుల్లో మరోసారి ఆశలు చిగురిస్తున్నాయి. ఇటీవల అర్హులైన ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించారు. మిగిలిన ఖాళీలను కూడా పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని రాష్ట్ర పాఠశాలల విద్యాశాఖ తాజాగా నిర్ణయించింది. నెల రోజుల కిందట పదోన్నతులకు కొందరు రెండు, మూడు స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు అర్హత కల్గి ఉండటంతో వాటన్నింటికీ ఆప్షన్లు ఇచ్చుకున్నారు. వారు వదిలేసిన పోస్టులు ఖాళీలుగా మిగిలిపోయాయి. దీంతో అర్హులైన ఇతర బోధకులు నష్టపోయారు.

**32 పోస్టులు ఖాళీ**

జిల్లాలో గత నెలలో చేపట్టిన బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ద్వారా 482 మంది ఎస్జీటీలు, భాషా పండితులు, పీఈటీలు స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు పదోన్నతి పొందారు. అనంతరం మిగిలిన ఖాళీల వివరాలను రాష్ట్ర విద్యాశాఖ కోరడంతో జిల్లా అధికారులు వాటిని పంపించారు. జిల్లాలో మొత్తం 32 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు చూపించారు. ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం 14, స్కూల్ అసిస్టెంట్ ఆంగ్లం 2, గణితం 2, జీవశాస్త్రం 6, భౌతికశాస్త్రం 4, సాంఘికశాస్త్రం 3, పీడీ 1 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు సమాచారం. జిల్లాలోని మెజారిటీ ప్రాథమిక పాఠశాలల్లో బోధకుల కొరత ఏర్పడింది. కొందరు పదోన్నతులు పొంది బదిలీ అయినా, వారు పనిచేస్తున్న బడిలో ఉపాధ్యాయుల కొరతతో పాత స్థానాల్లోనే పని చేస్తున్నారు.

**317 జీవో బాధితులకు ఊరట...**

317 జీవోతో నష్టపోయిన ఉపాధ్యాయులకు కేబినెట్ సబ్ కమిటీ తీసుకున్న



నిర్ణయం కొంత ఊరటను ఇస్తోంది. గత విద్యాసంవత్సరంలో స్థానికత ఆధారంగా ఉపాధ్యాయులను సొంత జిల్లాలకు కేటాయించారు. మరికొందరు సీనియారిటీ ప్రతిపాదికన పక్క జిల్లాలకు బదిలీ అయ్యారు. స్పౌజ్ కేటగిరీ కింద అప్పుడు కొన్ని జిల్లాలకు బ్యాన్ చేశారు. స్థానికత ఉన్న ఉపాధ్యాయులు, స్పౌజ్ కేటగిరీలోని వారు సొంత జిల్లాలకు బదిలీ చేయాలని అప్పటి ప్రభుత్వానికి అర్జీ పెట్టుకున్నా ఫలితం లేకుండాపోయింది. మరికొందరు కోర్టును ఆశ్రయించి సొంత జిల్లాలకు వచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వానికీ వినతులు అందడంతో కేబినెట్ సబ్ కమిటీ వారి సమస్యను పరిష్కరించాలని విద్యాశాఖకు సూచించింది. స్పౌజ్ కేటగిరీ కింద బదిలీ కోరుకునే వారితోపాటు ఇతర జిల్లాలకు వెళ్లేందుకు అర్జీలు పెట్టుకున్న వారి వివరాలను జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం అధికారులు పరిశీలించారు. 38 మంది వివరాలను ప్రభుత్వానికి పంపించనున్నారు.

# నాణ్యత ప్రశ్నార్థకం!

పెద్దపల్లి :మానేరు వాగుపై రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా.. రెండు జిల్లాలను కలిపేలా నిర్మిస్తున్న వంతెన గడ్డర్లు వరుసగా కూలిపోతుండటం విస్మయం కలిగిస్తోంది.. పనులు నాణ్యంగా జరిగాయా.. నిబంధనల ప్రకారం పనులు చేశారా.. అధికారులు సరిగా పర్యవేక్షణ చేశారా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి..

పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడు గ్రామం, ప్రస్తుత జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని గర్మిళ్లపల్లి గ్రామాలను అనుసంధానం చేస్తూ 2016 ఆగస్టు 4వ తేదీన రూ.47.40 కోట్ల అంచనాతో కిలోమీటర్ దూరం వంతెన నిర్మాణానికి అప్పటి రహదారులు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఇతర ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు. వంతెన నిర్మిస్తున్న క్రమంలోనే భారీ వరదలకు నిర్మాణ సామగ్రి దెబ్బతినడంతో రెండేళ్ల క్రితం గుత్తేదారు పియర్లపై గడ్డర్లను అనుసంధానం చేసే క్రమంలో అవి కూలిపోకుండా ఉండేందుకు చెక్క ముక్కలను పెట్టారు. వాటిని పూర్తి స్థాయిలో బిగించలేదు. మానేరు వాగు రెండేళ్లు భారీ వరదలతో ఉద్ధృతంగా ప్రవహించడంతో సపోర్టుగా ఉన్న చెక్కముక్కలు ధ్వంసమయ్యాయి. దీంతో గిడ్డర్లు పట్టు తప్పాయి. ఈ క్రమంలో ఈ ఏడాది ఏప్రిల్ 22న మూడు గడ్డర్లు కుప్పకూలాయి. అప్పుడు విచారణ జరిపిన అధికారులు చెక్కముక్కల ధ్వంసమవడంతోనే గడ్డర్లు కూలాయని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికలు రావడంతో పూర్తి స్థాయిలో దృష్టి పెట్టలేదు. మరోసారి అయిదు గడ్డర్లు నేలకూలాయి. రెండు సందర్భాల్లోనూ గాలి దుమారం బాగా వచ్చినప్పుడే కుప్పకూలాయని ఓడేడు గ్రామస్థులు పేర్కొంటుండగా గాలి దుమారానికి గడ్డర్లు కుప్పకూలే అవకాశం లేదని అధికారులు అంటున్నారు. వాస్తవానికి కాంక్రీట్ గడ్డర్లు చాలా బరువు కలిగి ఉంటాయి. వంతెనపై భారీ వాహనాలు రాకపోకలు సాగించాలంటే ఇవి బలోపేతంగా ఉంటేనే సాధ్యమవుతుంది. అలాంటి గడ్డర్లు పేకమేడల్లా కూలిపోవడం గమనార్హం. డిజైనింగ్ సరిగా ఉందా.. నిర్మాణానికి ముందు భూమి



పరీక్ష చేశారా.. పనులు చేసే సమయంలో పర్యవేక్షణ సరిగా ఉందా.. అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి.

**కాంక్రీట్ బీమ్ సరిగా లేకే..** ఒక్కో గడ్డరు 130 టన్నుల బరువుతో ఉంటుంది. కిలోమీటర్ వంతెన నిర్మాణానికి 120 గడ్డర్లు అవసరమయ్యాయి. ఇందులో 58 వంతెనకు అనుసంధానించగా మిగిలిన 62 ఇంకా బిగించలేదు. ఏప్రిల్ 22, జులై 2న కూలిన గడ్డర్లు మొదటగా అనుసంధానించిన 58 గడ్డర్లలోనివి. కాంక్రీట్ బీమ్‌లు సరిగా వేయకపోవడంతోనే కూలిపోయి ఉండవచ్చని భావిస్తున్నాం. మిగతా గడ్డర్లు కూడా నిర్మించిన వెంటనే అనుసంధించకుండా వదిలేశారు. ఇవి కూడా కూలిపోవడానికి అవకాశం ఉంటుంది. గతంలో కూలిన గడ్డర్లకు గ్యాస్ వెల్డింగ్ వేసి వంతెనకు అనుసంధానించేందుకు ప్రయత్నించినా నిలవడం లేదు. ఈ పనులు చేసిన గుత్తేదారు పనులు చేయడానికి ఆసక్తి చూపడం లేదు. ఆయన నుంచి జరిగిన నష్టం వసూలు చేస్తాం. మిగిలిన పనులు వేరే గుత్తేదారుకు అప్పగించి పనులు పూర్తి చేస్తాం. వంతెన పనులు పూర్తి స్థాయిలో పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటాం.జాఫర్, డీఈ, ఆర్‌అండ్‌బీ

# ఉపకార వేతనాల సాధనలో విద్యార్థుల ప్రతిభ

పెద్దపల్లి :పేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో మధ్యలోనే విద్యను ఆపేయకుండా ఉన్నత విద్యనభ్యసించేలా ప్రోత్సహించేందుకు కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ ఏటా జాతీయ ప్రతిభా ఉపకార వేతన అర్హత పరీక్ష(నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్) నిర్వహిస్తోంది. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న ప్రతిభావంతులైన ఎనిమిదో తరగతి చదివే విద్యార్థులు దీనికి అర్హులు.. ఈ పరీక్షలో రాణించిన విద్యార్థులకు తొమ్మిదో తరగతి నుంచి నాలుగేళ్ల పాటు ఏటా రూ.12 వేల చొప్పున కేంద్ర ప్రభుత్వం ఉపకార వేతనాలు అందజేస్తోంది. ఉమ్మడి జిల్లాలోనే రామగుండం లింగాపూర్‌లోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతి సంవత్సరం అత్యుత్తమ మార్కులు సాధించి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఉపాధ్యాయులు ఎన్ఎంఎంఎస్‌పై పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తూ విద్యార్థులు ఉపకార వేతనం సాధించేలా ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు.

**అర్హతలు... పరీక్ష విధానం**

కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్వహించే ఉపకారవేతన పరీక్షకు ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు.. వీరు ఏడో తరగతిలో 50 శాతం మార్కులు సాధించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీలు రూ.50, ఇతరులు రూ.100 రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. తదుపరి అర్హత పరీక్ష రాయాల్సి ఉంటుంది. దీనిని ఏటా నవంబరు మాసంలో నిర్వహిస్తారు. జిల్లా యూనిట్గా, కేటగిరీల వారీగా, ప్రతిభ కొలమానంగా అర్హులను ఎంపిక చేస్తారు. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు ఏటా ప్రతిభ కలిగిన పేద విద్యార్థులు ఈ అర్హత పరీక్ష రాసేలా ప్రోత్సహిస్తున్నారు.

**ఆదర్శ పాఠశాల నుంచి ఎంపికైన విద్యార్థులు**

2022-2023 : 19

2021-2022 : 23

2023-2024 : 17

**ఎంతో సంతోషంగా ఉంది**

నేను రామగుండం మోడల్ పాఠశాలలో ప్రస్తుతం తొమ్మిదో తరగతి చదువుతున్నా. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకుని పరీక్ష రాసి అత్యుత్తమ మార్కులు సాధించా. సీనియర్ల సలహాలు, సూచనలతో నిత్యం చదువుపై దృష్టి సారించా. ఉపాధ్యాయుల మార్గదర్శనంలో నమూనా ప్రశ్నపత్రాలతో నిత్యం సాధన చేశా. నా కష్టానికి ఫలితం దక్కింది. ఉపకార వేతనం పొందేందుకు ఎంపిక కావడం సంతోషంగా ఉంది.

చిట్టోజు అన్విత, తొమ్మిదో తరగతి

**ఉపాధ్యాయుల శిక్షణ బాగుంది**

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో అత్యుత్తమ మార్కులు సాధించా. ఉపాధ్యాయులు అందిస్తున్న ప్రత్యేక శిక్షణ ఇందుకు ఎంతగానో దోహదపడింది. ఉపాధ్యాయుల చొరవతో ఆన్‌లైన్ తరగతుల్లో ప్రత్యేక శ్రద్ధ వహించా. అనుకున్న విధంగా మంచి ర్యాంకు సాధించి ఉపకార వేతనానికి ఎంపికయ్యా. పాఠశాలలో ప్రత్యక్ష బోధనతో పాటు అంతర్జాలంలో కూడా ప్రతి అంశాన్ని వివరించారు.

ఎం.చక్రిక, తొమ్మిదో తరగతి

**సమష్టి కృషితో...**

ఈ విద్యా సంవత్సరం రామగుండం మోడల్ పాఠశాల నుంచి 17 మంది విద్యార్థులు ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికయ్యారు. విద్యార్థులను రీజనింగ్, నెంబరు సిరీస్ ఇతర అంశాలపై నిత్యం సన్నద్ధం చేయించాము. సాంఘిక, సామాన్య, గణితంపై ఇతర ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణ ఇచ్చాము. ప్రతి ఏటా విద్యార్థులు అధిక సంఖ్యలో ఉపకార వేతనాలకు ఎంపిక కావడం ఆనందంగా ఉంది. ప్రిన్సిపల్, ఉపాధ్యాయుల సమష్టి కృషితో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు.ముత్యం రాజశేఖర్, ఆంగ్ల ఉపాధ్యాయులు

# నూతన ఒరవడి.. పెరిగేనా దిగుబడి

హుజూరాబాద్ : ప్రస్తుత వానాకాలం సీజన్‌లో అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేసేలా జాతీయ పత్తి పరిశోధన సంస్థ ఉమ్మడి జిల్లాకు లక్ష్యాన్ని నిర్దేశించింది. దీంతో వ్యవసాయ శాఖతోపాటు జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రైతులను ప్రోత్సహించేలా అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ ప్రత్యేక సాగు విధానంలో అధిక దిగుబడులు వస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

524 ఎకరాల్లో సాగు లక్ష్యం

కరీంనగర్, పెద్దపల్లి జిల్లాలోని ప్రస్తుత వానాకాలం సీజన్‌లో 524 ఎకరాల్లో అధిక సాంద్రత పత్తి సాగు చేసేలా జాతీయ పత్తి పరిశోధన సంస్థ లక్ష్యాన్ని నిర్దేశించింది. ఈ బాధ్యతల్ని జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలకు అప్పగించింది. నూతన ఒరవడిలో పత్తి సాగు చేసేలా రైతులను ఎంపిక చేసేందుకు కసరత్తు ప్రారంభించారు. సాధారణ పత్తి సాగుకు భిన్నంగా విత్తనాలను దగ్గర దగ్గరగా విత్తి మొక్కల సంఖ్యను పెంచడమే అధిక సాంద్రత సాగు విధానం. ఇందుకో సం ఎర్రనేలలు, చెల్క నేలలు ఉండే గ్రామాలను ఎంపిక చేస్తున్నారు.

అదనపు పెట్టుబడికి ఆర్థిక ప్రోత్సాహం



సాధారణంగా పత్తి సాగు కంటే అధిక సాంద్రత సాగులో రెతులకు పెట్టుబడి ఎక్కువ కావడంతో ఆర్థిక ప్రోత్సాహం అందించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. విత్తనాలు, కూలీలు, యంత్రాల వినియోగం, ఇతర ఖర్చులన్నీ కలిపి సగటున ఎకరాకు రూ.4 వేల నుంచి రూ.5 వేల పెట్టుబడి పెరుగుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఈ అదనపు పెట్టుబడిని ఎంపిక చేసిన రైతులకు అందించేలా ప్రభుత్వమే ఇస్తుందని అధికారులు చెబుతున్నారు.

లాభాలు ఇవి..

సాధారణ పత్తి సాగులో ఎకరా విస్తీర్ణంలో 5,555 నుంచి 7,407 మొక్కలు ఉండటం వల్ల 7-8 క్వింటాళ్ల దిగుబడి ఉంటుంది. అదే అధిక సాంద్రత సాగు పద్ధతిలో దగ్గరదగ్గరగా 29,629 మొక్కలు ఉంటాయని, తద్వారా ఎకరాకు 10-12 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశమున్నట్లు పరిశోధనలో వెల్లడైనట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సాధారణంగా జూన్‌లో పత్తి విత్తుకున్న రైతులు పంట సాగుకు 180-190 రోజులు పడుతుంది. విడతల వారీగా అయిదారు సార్లు పత్తి తీయాల్సి (ఏరడం) ఉంటుంది. అదే అధిక సాంద్రత విధానంలో పంటంతా ఒకేసారి పూత, కాత, దిగుబడి చేతికి వస్తుంది. పంట కాలం కూడా 150-160 రోజులే.. తెగుళ్లు ఆశించకముందే ఒకేసారి పంట చేతి వస్తుంది. విత్తన ఖర్చు కొంత పెరిగినా.. ఎరువులు, పురుగు మందుల ఖర్చులు తగ్గుతాయని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. పైగా ఒకేసారి పత్తి తీయడం పూర్తయిన వెంటనే పంటను తొలగించి రెండో పంట సాగు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం

జాతీయ పత్తి పరిశోధన సంస్థ నిర్దేశించిన మేర అధిక సాంద్రత విధానంలో పత్తి సాగు చేసేలా రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాం. గతంలో ఈ విధానంలో సాగు చేసిన రైతులకు మంచి దిగుబడులు వచ్చాయి. రైతులను ఎంపిక చేసి సాగు చేసేలా తమవంతు ప్రయత్నాలు చేస్తున్నాం. సాధారణ విధానంలో పత్తి సాగు యాంత్రీకం ణకు అనుకూలంగా ఉండదు. అదే నూతన విధానంలో అలాంటి సమస్య ఉండదు. అధిక సాంద్రత విధానంలో పత్తి సాగు చేసేందుకు ముందుకు వచ్చే రైతులతో క్లస్టర్ ఏర్పాటు చేసి ఎంపిక చేసిన వారికి ఎకరాకు రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు ప్రోత్సాహం అందించనున్నాం.వెంకటేశ్వరరావు, శాస్త్రవేత్త, కేవీకే, జమ్మికుంట

# ఉచితానికి పచ్చజెండా..!


నల్గొండ : కరెంటు కోసం ఇబ్బందులు పడుతున్న రైతులకు ప్రభుత్వం శుభవార్త అందించింది. గత ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉచిత విద్యుత్తు వ్యవసాయ బోరుబావుల దరఖాస్తులకు పచ్చజెండా ఊపింది. దీంతో నల్గొండ జిల్లాలో పెద్ద సంఖ్యలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు మోక్షం లభించనుంది.గత రెండేళుగా నల్గొండ జిల్లాలో అనావృష్టి తాండవం చేస్తోంది. నీటి కొరత కారణంగా పంటలకు నీరు అందక ఎండిపోయాయి. వాటిని కాపాడుకునేందుకు రైతులు ఎక్కువ సంఖ్యలో బోర్లు తవ్వించారు. జిల్లాను పరిశీలిస్తే అధికంగా సాగర్ ఎడమ కాల్వ పరిధిలోని మండలాల్లో సుమారు ఏడు వేలకు పైగా కొత్త బోర్లు తవ్వించినట్లు సమాచారం. భూగర్భ జలాలపై ఆధారపడి సాగు చేసుకుంటున్న మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాల్లో సైతం ఈ ఏడాది రైతులు పెద్ద మొత్తంలో బోర్లు తవ్వారు. ఆ బోరుబావుల కింద పంటలు సాగు చేయాలంటే కరెంటు కీలకంగా మారడంతో ప్రభుత్వం నిర్ధేశించిన పైకంతో కూడిన డీడీలను జత చేస్తూ రైతులు ఉచిత కరెంటు వ్యవసాయ బోర్ల సర్వీసుల కోసం దరఖాస్తులు చేశారు. అవి గత ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉన్నాయి.

10 వేల దరఖాస్తులకు గ్రీన్‌సిగ్నల్..దక్షిణ ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ నల్గొండ సర్కిల్ పరిధిలో గత ఏడాది కాలంగా 11706 మంది రైతులు ఉచిత విద్యుత్తు వ్యవసాయ బోరుబావుల సర్వీసుల కోసం దరఖాస్తు చేశారు. అందులో 1700 మంది రైతులు ఓఆర్‌స్మీ చెల్లించాల్సి ఉంది. మిగతా 10 వేల మంది రైతులకు వెంటనే కరెంటు కనెక్షన్లు విడుదల చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో విద్యుత్తుశాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు.

మూడు నెలల్లో పూర్తిచంద్రమోహన్, ఎస్ఈ

పెండింగ్‌లో ఉన్న ఉచిత వ్యవసాయ దరఖాస్తులను పరిష్కరించి సర్వీసులు విడుదల చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అందుకు డివిజన్ల వారీగా కసరత్తు చేపట్టాం. మూడు నెలల్లో 10 వేల సర్వీసులను విడుదల చేస్తాం.

# దోమ కాటు.. డెంగీ పోటు



హైదరాబాద్ : నగరంలో దోమల సమస్య తీవ్రమైంది. డెంగీ జ్వరాలు వ్యాపిస్తున్నాయి. రోగ నిర్ధారణ పరీక్ష కేంద్రాల్లోనూ జ్వరం కేసులే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా.. దోమల కట్టడిపై జీహెచ్ఎంసీ నిర్లక్ష్యం వహిస్తోంది. ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని అధికారులు రోజూ ప్రకటనలు విడుదల చేస్తున్నా.. క్షేత్రస్థాయిలో చర్యలు కనిపించడం లేదు. ఇటీవల మూసాపేట సర్కిల్ పరిధిలోని భరత్‌నగర్‌లో డెంగీ జ్వరం వల్ల మృత్యువాత పడిన చిన్నారి విషయంలో అధికారులు తీసుకున్న చర్యలే ఇందుకు నిదర్శనం.

**ఏం జరిగింది.. ఏం చేయాలి..**

మూసాపేట భరత్‌నగర్‌లోని ఎల్ఐజీ ఫ్లాట్లలో ఉండే పదేళ్ల చిన్నారి వారం క్రితం డెంగీతో చనిపోయింది. అప్పటి వరకు జీహెచ్ఎంసీకి ఈ విషయం తెలియదు. మరుసటి రోజున 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తను చూసి చిన్నారి ఇంట్లో, కాలనీలో దోమల మందు పిచికారి చేసి, పాఠశాలను వదిలేశారు. వాస్తవానికి డెంగీ కేసుల వివరాలను బల్దిఆయ తెప్పించుకుని.. రెండు రోజుల్లో ఆ ఇళ్లను పరిశీలించాలి. సదరు ఇంట్లో.. చుట్టూ 50 ఇళ్లలో పైరొత్రియం మందును పిచికారి చేయాలి. పిల్లలు బాధితులుగా ఉన్న కేసుల్లో వారి పాఠశాలలోనూ పిచికారి చేయాలి.

**అడ్డగోలుగా ఫాగింగ్..**

డెంగీ దోమను పైరొత్రియం మందుతో అంతం చేయొచ్చని అధికారులు చెబుతున్నారు. కానీ, జీహెచ్ఎంసీలోని పలువురు సీనియర్ ఎంటమాలజిస్టులు, సహాయ ఎంటమాలజిస్టులు ఏఎల్ఓ, ఫాగింగ్ అడ్డగోలుగా నిర్వహిస్తున్నారు. బాధితులను గుర్తించడంలో జరుగుతోన్న నిర్లక్ష్యంపై అదనపు కమిషనర్ పంకజ, చీఫ్ ఎంటమాలజిస్టు డాక్టర్.రాంబాబును వివరాలు కోరగా.. వైద్యశాఖ నుంచి తమకు వివరాలు అందట్లేదన్నారు. తమకు వచ్చే సమాచారాన్ని జీహెచ్ఎంసీకి ఇస్తున్నట్టు జిల్లా వైద్యాధికారి వెంకటేశ్‌తో తెలిపారు.

# బడ్జెట్లో దక్కని భాగ్యం



హైదరాబాద్ :కేంద్ర బడ్జెట్‌లో భాగ్యనగరానికి పెద్దగా కేటాయింపులు దక్కలేదు. సిటీలో చేపట్టబోతున్న మూసీ సుందరీకరణ, మెట్రో విస్తరణ వంటి మౌలిక ప్రాజెక్టులకు నిధులిచ్చి అభివృద్ధికి అండగా నిలవాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరినా.. అంతగా ప్రయోజనం లేకపోయింది. కేంద్ర ప్రభుత్వం తాను నిర్దేశించుకున్న ప్రాధాన్య రంగాలకు మాత్రమే కేటాయింపులు జరిపింది. యువత, మహిళలు, పేదలు, మధ్యతరగతి వర్గాల్లో ఉపాధికల్పన, నైపుణ్య శిక్షణ, ఆవాస కల్పన, సాధికారత కల్పించే దిశగా కేంద్ర బడ్జెట్ సాగింది. కొంచెం మోదం..కొంచెం ఖేదం అన్నట్లుగా బడ్జెట్ ఉంది.

**మహిళలు.. బాలికల అభివృద్ధికి..**

నగరంలోని కోటి మందిలో మహిళలు, బాలికల జనాభా కీలకం. ఉన్నత చదువులు, ఉపాధి ఉంటే వారిలో సాధికారత పెరుగుతుంది. బడ్జెట్‌లో మహిళలు, బాలికల విద్య, ఉపాధి కోసం పెద్దపీట వేసింది. నగరంలోని మహిళలకు ప్రయోజనం చేకూరనుంది.

**భూ ఆధార్‌తో అక్రమాలకు చెక్..**

సంస్కరణల్లో భాగంగా అన్నిరకాల భూములకు యూనిక్ ల్యాండ్ పార్సిల్ ఐడెంటిఫికేషన్ నెంబరు(భూ ఆధార్) తీసుకురానున్నట్లు కేంద్రం ప్రకటించింది. రిజిస్ట్రేషన్లకు దీన్ని అనుసంధానం చేస్తారు కాబట్టి అక్రమాలు, ఆక్రమణలకు తెరపడే అవకాశం ఉంటుంది. భూ రికార్డులను సైతం జీఐఎస్ మ్యాపింగ్‌తో డిజిటలైజ్ చేయనున్నారు.

**శుభకార్యాల వేళ.. పసిడి కళ..**

కేంద్ర బడ్జెట్‌లో బంగారం, వెండిపై దిగుమతి సుంకాలను తగ్గించడంతో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో ఆ ప్రభావం తక్షణం కన్పించింది. మధ్యాహ్నం తర్వాత ఒక్కసారిగా పది గ్రాముల బంగారంపై 3వేల వరకు తగ్గిందని బులియన్ వర్గాలు తెలిపాయి. మగువలకు ఇది తీపి కబురే. రానున్నది శుభకార్యాల సీజన్ కావడంతో కొనుగోళ్లకు సిద్ధపడు తున్నారు.

**నగర పరిశోధనలకు ఊతం..**

నగరంలోని డీఆర్‌డీవో, సీఎస్ఐఆర్, డీఎస్‌టీకి చెందిన పలు ప్రయోగశాలల పరిశోధనలను తదుపరి దశకు తీసుకెళ్లేందుకు పలు అంకుర సంస్థలు ముందుకొస్తున్నాయి. వీటిని ప్రోత్సహించేందుకు కేంద్రం రూ.1లక్ష కోట్లతో నిధిని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. అంకుర సంస్థలపై ఏంజెల్ పన్ను ఎత్తేయడం కూడా కలిసిరానుందని అంటున్నారు.

**38.2 శాతం మందికి ఊరట**

కొత్త ఆదాయపన్ను ప్రకారం వేతనజీవులకు రూ.17500 వరకు పన్ను భారం తగ్గనుంది. తెలంగాణలో 2022-23లో 18 లక్షల మంది రిటర్న్‌ దాఖలు చేస్తే ఇందులో అత్యధిక మంది నగరంలోని ఉద్యోగులే. వీరిలో 38.2 శాతం మంది కొత్త పన్ను విధానంతో ప్రయోజనం పొందనున్నారు.

**రూ.10వేల కోట్లు అడిగితే..**

మూసీ నది సుందరీకరణ ప్రాజెక్ట్‌ను రూ.లక్షన్నర కోట్ల వ్యయంతో చేపట్టేందుకు సర్కారు ప్రణాళికలు రూపొందిస్తోంది. మూసీ శుద్ధికి రూ.4వేల కోట్లు ఇవ్వాలని కేంద్ర మంత్రిని సీఎం రేవంత్‌రెడ్డి బడ్జెట్‌కు ముందు కోరారు. అయినా ఉట్టిచేతులే చూపించారని సీఎం అన్నారు. గోదావరి జలాలను సిటీలోని ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌కు తరలించేందుకు రూ.6వేల కోట్లు ఇవ్వాలని కోరారు. మొత్తంగా రూ.10వేల కోట్లు అడిగితే పది పైసలు కూడా ఇవ్వలేదని కాంగ్రెస్ సర్కారు విమర్శిస్తోంది. బడ్జెట్‌లో మెట్రోరైలు విస్తరణ ప్రాజెక్ట్‌కు ఊసే లేకపోవడం గమనార్హం.

**ఇళ్లు లేని నిరుపేదలకు..**

నగరంలో జనాభా కోటి దాటింది. సొంత ఇల్లు అనేది కలగా మారుతోంది. ఈ నేపథ్యంలో కేంద్రం అర్బన్ హౌసింగ్ కోసం రూ.2.2 లక్షల కోట్లు కేటాయించి...3 కోట్ల ఇళ్లు నిర్మించడం వల్ల నగరంలోని ఇళ్లు లేని పేదలకు భరోసా దక్కినట్లైంది.

**నిరుద్యోగ యువతకు శిక్షణ..**

నిరుద్యోగులకు తాజా బడ్జెట్‌లో పెద్ద ఊరట కలిగింది. 20 లక్షల మంది యువతకు నైపుణ్య శిక్షణతోపాటు 500 కంపెనీల్లో ఇంటర్న్‌షిప్‌లు కల్పించేలా కేంద్రం పెద్ద ప్రాజెక్టుకు శ్రీకారం చుడుతోంది. ఉన్నత చదువుల కోసం వెళ్లే విద్యార్థులకు రూ.10 లక్షల వరకు తీసుకున్న విద్యా రుణాలకు 3 శాతం వరకు వడ్డీ రాయితీని కేంద్రం ప్రకటించింది.

**పారిశ్రామిక వాడల్లో సౌకర్యాలు..**

నగరానికి ఉపాధి, ఉద్యోగాల కోసం వివిధ రాష్ట్రాల నుంచి ఎంతో మంది వస్తుంటారు. పనిచేసే ప్రదేశంలో తాత్కాలిక షెడ్లలో నరకయాతన అనుభవిస్తున్నారు. పారిశ్రామిక ప్రాంతాల్లో కార్మికులకు అద్దె గృహాల నిర్మాణంతోపాటు..పీపీపీ విధానంలో డార్మిటరీల కల్పనకు బడ్జెట్‌లో ప్రతిపాదించడం నగరంలోని కార్మికులకు ఎంతో ప్రయోజనం.

**రాజధానిలో మరిన్ని ఎస్టీపీలు..**

మురుగు నీరు శుద్ధి చేసి ఆ జలాలను వినియోగించుకునేలా ప్రాజెక్టులు చేపట్టేందుకు తాజా బడ్జెట్‌లో ప్రతిపాదనలు చేశారు. ఇప్పటికే నగరంలో 740 మిలియన్ లీటర్ల మురుగును శుద్ధి చేస్తున్నారు. కొత్తగా 30 ఎస్టీపీలు రానున్నాయి. అమృత స్కీం కింద చేపట్టే ప్రాజెక్టులతో నగరంలో కొత్తగా మరిన్ని ఎస్టీపీలు అందుబాటులోకి రానున్నాయి.

**కొత్త వ్యాపారాలు..**

ప్రధాన మంత్రి ముద్ర యోజన రుణాలను రూ.20లక్షలకు పెంచడం ద్వారా నగరంలో వ్యాపారాలు చేయాలనుకుంటున్న ఎంతోమందికి ఆర్థికంగా భరోసా దక్కనుంది. పలువురు ఔత్సాహికులు ముందుకొచ్చి చిన్న చిన్న వ్యాపారాలతో ఉపాధి పొందడానికి ఇదో చక్కటి అవకాశంగా భావిస్తున్నారు.

# కదలని యంత్రాలు.. సాగని పనులు

గోదావరిఖని: ఉపరితల గనుల్లో యంత్రాలు కదలలేదు. భారీ యంత్రాలకు అయిదు రోజులుగా పనులు లేకుండా పోయాయి. వరుసగా కురుస్తున్న వర్షంతో బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలిగింది. రామగుండం ప్రాంతంలోని నాలుగు ఉపరితల గనుల్లో భారీ వర్షాలకు యంత్రాలు కదలని పరిస్థితి. బురదమయంగా ఉన్న రోడ్లపై క్వారీల్లోకి వెళ్లే పరిస్థితి లేదు. అందులో చేరిన వరద నీటిని మళ్లించే పనులు చేపడుతున్న అధికారులకు బొగ్గు ఉత్పత్తికి సంబంధించిన పనులు చేపట్టే అవకాశం లేకుండా పోయింది. రామగుండం ప్రాంతంలోని ఓసీపీ-1, 2, 3, 5 ఉపరితల గనుల్లో రోజుకు 50 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి వెలికి తీయాలి. వర్షాలతో నిల్వ బొగ్గును ఉత్పత్తి కింద చూపుతున్న అధికారులు వినియోగదారులకు దానినే రవాణా చేస్తున్నారు. అయిదు రోజుల్లో 2.46 లక్షల టన్నులకు గాను 1.23 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేపట్టారు. ఇందులో నిల్వ బొగ్గును సైతం రవాణా చేయడంతో ఉత్పత్తి కింద లెక్కల్లోకి తీసుకున్నారు. సింగరేణిలోనే అత్యధికంగా బొగ్గు ఉత్పత్తి చేపట్టే రామగుండం ప్రాంతంలో ఈనెల 18 నుంచి కురుస్తున్న వర్షాలతో ఉపరితల గనుల్లో పనులు నిలిచిపోయాయి. రామగుండం నుంచి ఎన్టీపీసీతో పాటు ఇతర విద్యుత్తు పరిశ్రమలకు బొగ్గు సరఫరా చేయాల్సి ఉంది. ప్రస్తుతం



ఎన్టీపీసీకి ఉపరితల గనుల వద్ద నిల్వ చేసిన బొగ్గును రవాణా చేసి విద్యుత్తు ఉత్పత్తికి అంతరాయం లేకుండా చేస్తున్నారు.

ఉత్పత్తి దిశగా చర్యలు

ప్రస్తుతం నిలిచిపోయిన పనులను తిరిగి పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టారు. క్వారీల్లో ఉన్న నీటిని మోటార్ల ద్వారా బయటకు తరలిస్తున్న అధికారులు బురదమయంగా మారిన రోడ్లకు మరమ్మతు చేస్తున్నారు. బురదతో నిండి ఉన్న మార్గాల వెంట డోజర్లతో మట్టిని తొలగించి భారీ యంత్రాలు నడిచే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. కొంత తెరిపి ఇవ్వడంతో మంగళవారం నుంచి బొగ్గు ఉత్పత్తి చేపట్టే విధంగా అధికారులు దృష్టి సారించారు.

# జీఐఎస్ సర్వేతో.. కాసుల గలగల

హైదరాబాద్: జీహెచ్ఎంసీ ఆస్తిపన్ను ఆదాయం భారీగా పెరగనుంది. ఇటీవల మొదలైన జీఐఎస్(జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్) సర్వేతో రాబడి రూ.1,500కోట్ల మేర పెరగనున్నట్లు రెవెన్యూ విభాగం అంచనా వేస్తోంది. మూడు భాగాలుగా ఈ అధ్యయనం జరగనుంది. మొదటి దశలోని ఉపగ్రహ చిత్రాల విశ్లేషణ ఇప్పటికే పూర్తయింది. రెండోదశ డ్రోన్ సర్వే పురోగతిలో ఉంది. మూడోదశలో డ్రోన్‌లు స్కానింగ్ చేసిన పటాలను ప్రత్యేక సర్వేయర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు సేకరిస్తారు. మూడు దశలు విజయవంతంగా ముగిస్తే.. ఆస్తిపన్నులో లోపాలు తొలగిపోయి వసూలయ్యే పన్ను విలువ పెరుగుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

సర్వేయర్లు సేకరించనున్న వివరాలు.. ఆస్తిపన్ను రసీదు, ఇంటి కొలతలు, భవనం ఫొటో, వినియోగం(నివాసం, నివాసేతర), ఎన్ని అంతస్తులు, యజమాని గుర్తింపు కార్డు,దృుత్తు, నల్లా బిల్లు, భవన నిర్మాణ అనుమతి వివరాలు ప్రజలు సహకరించాలి.. "నగరంలో 19లక్షల నిర్మాణాలు మాత్రమే ఆస్తిపన్ను పరిధిలో ఉన్నాయి. చాలా



భవనాలు నివాసేతర వినియోగంలో ఉంటూ.. నివాస కేటగిరీ పన్ను చెల్లిస్తున్నాయి. ఐదంతస్తుల భవనంలో రెండు, మూడు అంతస్తులకే పన్ను చెల్లిస్తోన్న యజమానులున్నారు. ఆస్తిపన్ను మదింపులో లోపాలున్నాయి. కాయిలాపడ్డ పరిశ్రమలు, కూల్చివేసిన భవనాలు, రూ.కోట్లలో పన్ను బకాయిపడ్డ నిర్మాణాలు అనేకం. జీఐఎస్ సర్వేతో ఆయా లోపాలన్నీ వెలుగులోకి వస్తాయి. తద్వారా పన్ను పునఃమదింపు జరిగి రాబడి పెరుగుతుంది. ప్రజలపై భారం పడుతుందనే అపోహ వద్దు. బడా నిర్మాణాలు ఎగ్గొడుతున్న పన్ను విలువే రాబడిలో 90శాతం ఉంటుందని అంచనా. ఇంటింటి సర్వే కోసం 400మంది సర్వేయర్లు పనిచేస్తున్నారు. ప్రజలంతా వారికి సహకరించాలి" అని జీహెచ్ఎంసీ రెవెన్యూ విభాగం నగరవాసులను కోరుతోంది.

# భలే చౌక శిక్షణ

హైదరాబాద్: ఉద్యోగ నియామక పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు కోచింగ్ కేంద్రాలు తగ్గింపు ధరలకే తమ కోర్సులు అందజేసేందుకు ముందుకొచ్చాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాల్లో గ్రూప్-2 పరీక్షలు వాయిదా పడటంతో పరిమిత కాలానికి ఆఫర్లు ప్రకటించాయి. ఆన్‌లైన్‌లో విక్రయాల మాదిరి తొలి అర గంట, గంట, ఒకరోజు పేరుతో ఆఫర్లు ఇస్తున్నాయి. గరిష్ఠంగా 90 శాతం వరకు తగ్గింపు ఇస్తున్నాయి. పరీక్షలు డిసెంబరులో ఉండటంతో అప్పటివరకు సన్నద్ధత కొనసాగించేందుకు అభ్యర్థులు సైతం వీటిపై ఆసక్తి కనబరుస్తున్నారు.

గ్రూప్-2 పరీక్షకు సంబంధించిన శిక్షణను చాలామంది అభ్యర్థులు ఇప్పటికే పూర్తిచేశారు. వీరు మళ్లీ వేలల్లో చెల్లించాలంటే ఆసక్తి చూపరు. ఇప్పుడు వందల్లోకి కావడంతో ఆయా కోర్సులపై ఆసక్తిచూపిస్తున్నారు.



ఈసారి ఆన్‌లైన్‌లో సన్నద్ధం కావడానికి అభ్యర్థులు సిద్ధమవుతున్నారు.

**గ్రూప్-1 మెయిన్స్‌కు డిమాండ్..**

ప్రస్తుతం గ్రూప్-1 మెయిన్స్ శిక్షణకు డిమాండ్ ఏర్పడింది. పదుల సంఖ్యలో సంస్థలు తమ కేంద్రాల్లో, ఆన్‌లైన్‌లో అభ్యర్థులకు శిక్షణకు ముందుకొచ్చాయి. పరీక్ష రాసేవారిలో నిరుద్యోగులతో పాటూ ఇప్పటికే ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. వీరిని దృష్టిలో పెట్టుకుని వేర్వేరు సమయాల్లో తరగతులు, సాధన, వారాంతపు పరీక్షలను నిర్వహిస్తున్నాయి.

# పనులు పూర్తయినా తప్పని నిరీక్షణ

గోదావరిఖని : పదేళ్ల కాలంగా ఎదురు చూస్తున్న బసంత్‌నగర్ రైల్వే పైవంతెన నిర్మాణాన్ని ఆరు నెలల క్రితం పూర్తి చేశారు. రైల్వే శాఖ అభ్యంతరాలు, అటవీ శాఖ అనుమతుల కోసం ఎన్నో ఏళ్లు నిరీక్షించాల్సి వచ్చింది. రాజీవ్‌రహదారి పనులు పూర్తయినా బసంత్‌నగర్ వద్ద రైల్వే పైవంతెనకు వివిధ రకాల అడ్డంకులు రావడంతో రోడ్డుకు రెండువైపులా వంతెన నిర్మాణం పనులు చేపట్టలేదు. దీంతో పాత రైల్వే పైవంతెనపై నుంచే ఇరువైపులా రాకపోకలు సాగించారు. ఇరుకైన వంతెన కారణంగా అనేకసార్లు ప్రమాదాలు జరిగాయి. మూలమలుపు ఎక్కువగా ఉండటంతో వాహనాలు అదుపు తప్పి కింద పడిపోయిన సందర్భాలున్నాయి. గతంలో




ఓ ఆర్టీసీ బస్సు వంతెన పైనుంచి అదుపు తప్పి కింద పడటంతో ఆరుగురు ప్రయాణికులు మృతిచెందారు. వాహనాల రాకపోకలకు రెండు వంతెనలు అవసరం ఉండటం.. మరోవైపు నిర్మాణానికి అడ్డంకులు ఎదురు కావడంతో చాలా కాలంగా పనులు చేపట్టలేదు. ఎట్టకేలకు రైల్వే శాఖ నుంచి అనుమతులు రావడంతో శరవేగంగా పనులు మొదలుపెట్టి గత ఏడాది డిసెంబరులో పూర్తి చేశారు. దీనిపై వాహనాల రాకపోకలను సైతం ప్రయోగాత్మకంగా పరిశీలించారు. ఎన్నికలు రావడంతో కోడ్ కారణంగా వాహనాల రాకపోకలను నిలిపివేశారు. ప్రస్తుతం సాధారణ ఎన్నికలు ముగిసి నెలలు కావస్తున్నా ఈ వంతెన పైనుంచి వాహనాలను అనుమతించడం లేదు. ఎన్నోఏళ్ల నిరీక్షణ తర్వాత పనులు పూర్తయ్యాయన్న సంతోషంలో ఉన్నామని.. రాకపోకలను ఎందుకు అనుమతించడం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## రేషన్ ఈ- కేవైసీకి మరో అవకాశం.. త్వరగా పూర్తి చేసుకోవాలని అధికారుల సూచన

భువనగిరి : ఆహారభద్రత కార్డుల ఈ- కేవైసీ నమోదుకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. ఫిబ్రవరి 29తో గడువు ముగిసినప్పటికీ రేషన్ దుకాణాల్లో ప్రభుత్వ సూచన మేరకు ప్రస్తుతం ఈ-కేవైసీ ప్రక్రియ కొనసాగుతోంది. మొత్తం లబ్ధిదారుల్లో 74 శాతం మాత్రమే ఇప్పటి వరకు నమోదు చేసుకున్నారు. మిగిలిన వారి కోసం మరో అవకాశం ఉండకపోవచ్చని, త్వరగా ఈ కేవైసీ పూర్తి చేసుకోవాలని సంబంధిత పౌరసరఫరాల శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో 1,740 గ్రామ పంచాయతీలకు గానూ 2,081 రేషన్ దుకాణాలున్నాయి. ఇందులో మొత్తం 10,07,214 రేషన్ కార్డులుండగా, 29,85,553 మంది రేషన్ లబ్ధిదారులున్నారు. ఇంకా వివిధ కారణాల వల్ల 7,96,023 మంది ఈ కేవైసీ చేయించుకోనట్లుగా అధికారవర్గాలు తెలుపుతున్నాయి.

సంక్షేమ పథకాలు అర్హుల లబ్ధికే..

సంక్షేమ పథకాలు అర్హులకే అందించడానికి ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే రేషన్ కార్డులకు ఈ- కేవైసీ తప్పనిసరి చేసింది. దీని కోసం శాఖాపరంగా అవగాహన కార్యక్రమాలు సైతం చేపట్టారు. ఈ విషయమై తమకు అందుబాటులో ఉన్న రేషన్ దుకాణాలకు వెళ్లి ఈ కేవైసీ చేసుకోవాలని పౌరసరఫరాల అధికారులు సూచించారు. పలు దఫాలుగా అవకాశం ఇచ్చినా ఇంకా మిగిలిపోయిన కారణంగా ఎక్కువ మందికి నష్టం కలిగే అవకాశం ఉందని భావించిన ప్రభుత్వం రేషన్ దుకాణాల్లో నమోదు చేసుకోవడానికి మరోమారు అవకాశం కల్పించింది. అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాలని అధికారులు కోరుతున్నారు.



ప్రధాన సమస్యలివే..వేలిముద్రలు పడక, సాంకేతిక సమస్యలతో కొంతమేర జాప్యం జరుగుతోంది. దీనికితోడు చిన్నారుల ఆధార్ నవీకరణ కాకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పలువురు వృద్ధుల వేలిముద్రలు పడటం లేదు. మీసేవా, ఆధార్ కేంద్రాలకు వెళ్లి నవీకరణ పూర్తి చేసుకున్నా ఈ కేవైసీ ప్రక్రియలో వేలిముద్రలు రావడంలేదు. వలస వెళ్లిన వారి కోసం అక్కడుండే రేషన్ షాపుల్లో ఈ కేవైసీ చేసుకునే వెసులుబాటు ఉన్నా కొందరు డీలర్లు తమ పరిధిలోని వారికే కేవైసీ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ కేవైసీ ఆవశ్యకత విషయమై రేషన్ డీలర్లకు, లబ్ధిదారులకు అధికారులు పలు రకాలుగా సూచనలు చేస్తూనే ఉన్నారు. అవకాశం ఉందికదా అని నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే రేషన్ దుకాణాలకు వెళ్లి ఈ కేవైసీ చేయించుకోవాలంటున్నారు.

## అక్రమాలపై కన్ను..!

నల్గొండ : కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు అమ్ముకోవడంతో పాటూ భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)కి సకాలంలో ఇవ్వాల్సిన సీఎంఆర్ బియ్యాన్ని ఇవ్వకుండా తాత్సారం చేస్తున్న మిల్లులపై అధికారులు కొరడా ఝుళిపించారు. సూర్యాపేట జిల్లా అధికార యంత్రాంగం, విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా మిల్లుల్లో అక్రమాలపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్న తిరుమలగిరి, సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, గరిడేపల్లి, తుంగతుర్తిలోని సుమారు 15 మిల్లులపై మంగళవారం ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఇందులో సీఎంఆర్ బియ్యంతో పాటూ పలు మిల్లుల్లోని రికార్డుల్లో తప్పులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

కొంత మంది మిల్లర్లు సిండికేట్‌గా ఏర్పడి ప్రభుత్వానికి ఇవ్వాల్సిన సుమారు రూ.300 కోట్ల మేర బియ్యం చెల్లింపుల్లో అక్రమాలు, అవకతవకలకు పాల్పడ్డారని కొంత మంది రాష్ట్ర ఉన్నతాధికారులకు, ప్రభుత్వ పెద్దలకు ఫిర్యాదులు చేయడంతో.. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేయాలని జిల్లా ఉన్నతాధికారులకు ఆదేశాలు అందినట్లు తెలిసింది. దీంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిన కలెక్టరు వెంకట్‌రావు..గతం నుంచి పలు ఆరోపణలు ఉన్న మిల్లులపై దాడులు నిర్వహిస్తున్నారు. పోలీసుల పర్యవేక్షణలో విజిలెన్స్, పౌరసరఫరాలు, జిల్లా అధికార యంత్రాంగం అందరూ సంయుక్తంగా ఇంత పెద్ద మొత్తంలో ఏకకాలంలో దాడులు చేయడం ఇటీవలి కాలంలో ఇదే ప్రథమం. రాష్ట్ర వ్యాప్తంగా సీఎంఆర్ బియ్యం చెల్లింపుల్లో గతం నుంచి సూర్యాపేట జిల్లా అట్టడుగు స్థాయిలోనే ఉంది. సీఎంఆర్ బియ్యం చెల్లింపుల్లో అక్రమాలపై 'మారని తీరు...మరాడించరు వారు' అన్న శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే.

అదుపులో మిల్లర్ల సంఘ నాయకుడు..!

ప్రభుత్వానికి ఇవ్వాల్సిన వందల రూ.కోట్ల విలువైన బియ్యం ఎగవేతతో పాటూ తాజా యాసంగి సీజన్‌లో తన, బినామీలకు చెందిన సుమారు నాలుగు మిల్లుల్లో ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని తీసుకోకుండా ప్రయత్నాలు చేసిన జిల్లాకు చెందిన మిల్లర్ల సంఘం కీలక నాయకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. నాలుగు మిల్లుల్లో కలిపి సదరు నేత సుమారు రూ.200 కోట్ల బియ్యం ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉందని సమాచారం. భారీగా బకాయిలతో పాటూ తాజా సీజన్‌లో అధికారులకు సహకరించకుండా ఉండటంతో జిల్లా అధికారులు సైతం రాష్ట్ర పెద్దలకు సమాచారం ఇవ్వడంతో హైదరాబాద్ కేంద్రంగా ఓ కీలక నాయకుడి ఆదేశంతో సదరు నేతను అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. ఇందులో అధికార యంత్రాంగంతో పాటూ విజిలెన్స్ అధికారులు పాల్గొన్నట్లు తెలిసింది. అయితే సదరు నేతతో అంటకాగిన అధికారులు, నేతలు ఎవరనే దానిపైనా ఆరా తీస్తున్నారు. ఒకట్రెండు రోజుల్లో ఈ అక్రమాలపై విజిలెన్స్ కేసులు నమోదు చేయనున్నట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది. సదరు నాయకుడితో పాటూ గరిడేపల్లి, నేరేడుచర్ల, తిరుమలగిరి, తుంగతుర్తి, సూర్యాపేట గ్రామీణ మండలాల్లో అక్రమాలకు పాల్పడిన మిల్లులపైనా తీవ్ర చర్యలకు అధికారులు సిఫార్సులు చేస్తున్నారు. నాలుగైదేళ్ల పాటు ఇక్కడ పనిచేసిన ఓ అధికారి వత్తాసుతోనే సదరు నాయకుడు రూ.కోట్ల విలువైన బియ్యాన్ని ప్రభుత్వానికి ఇవ్వకుండా బహిరంగ మార్కెట్లో విక్రయించారని గతంలోనే ఆరోపణలు రాగా...హైదరాబాద్ స్థాయిలో పైరవీ ద్వారా వీటన్నింటినీ బహిర్గతం కాకుండా చూశారు. గతంలో బ్లాక్‌లిస్టులో పెట్టి తిరిగి ధాన్యం కేటాయింపులు చేస్తున్న మిల్లుల్లోనూ రికార్డులు అధికారులు సమగ్రంగా తనిఖీ చేస్తున్నారు.

## గనుల వ్యర్థాలు.. ఆదాయ నిక్షేపాలు



తాండూరు: జిల్లాలోని నాపరాళ్ల వ్యర్థాలను సిమెంటు కర్మాగారాలకు విక్రయిస్తే గనుల శాఖకు రూ.కోట్ల కొద్ది ఆదాయం సమకూరే అవకాశం ఉంది. అయితే ఆ దిశగా అధికారులు దృష్టి సారించడం లేదు. ప్రస్తుతం ఇబ్బడిముబ్బడిగా కుప్పలు పేరుకుపోయాయి. దశాబ్దం క్రితమే ప్రతిపాదన నాపరాళ్ల వ్యర్థాలను సమీపంలోని సిమెంటు కర్మాగారాలకు విక్రయించి ఆదాయం పొందాలనే ప్రతిపాదన దశాబ్దం క్రితమే వచ్చింది. ఆ మేరకు గనుల శాఖ నాపరాళ్ల వ్యర్థాల విక్రయ విషయాన్ని ఉన్నతాధికారులకు పంపించారు. వీరు దస్త్రాన్ని ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపించారు. అయితే ఇప్పటికీ సదరు దస్త్రానికి మోక్షం లభించలేదు.

సిమెంటు కర్మాగారాల యజమానుల మెలిక: దశాబ్దం కిందట గనుల శాఖ అధికారులు సీసీఐ, ఇండియా సిమెంట్స్, పెన్నా కర్మాగారాల యజమానులతో గనుల శాఖలోని ఉన్నతాధికారులు వ్యర్థాల కొనుగోలు విషయంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వ్యర్థాలను వినియోగించి సిమెంటును ఉత్పత్తి చేయొచ్చని వివరించారు. వ్యర్థాలను సిమెంటు ఉత్పత్తికి వినియోగించడానికి తాము సిద్ధమే అని ఇండియా సిమెంట్స్ అంగీకారం తెలిపింది. అయితే తమకు వ్యర్థాలను ఉచితంగా ఇవ్వాలని పేర్కొంది. మిగిలిన కర్మాగారాలు కూడా అదే విషయాన్ని వెల్లడించాయి. దీనికి అధికారులు ససేమిరా అన్నారు. టన్ను నాపరాయికి చెల్లించే రాయల్టీలో నాణ్యతను బట్టి 30 నుంచి 50 శాతం చెల్లించాలని అధికారులు సూచించారు. పరిశీలిస్తామని కర్మాగారాల యజమానులన్నారు. వ్యర్థాలకు రాయల్టీని చెల్లించే ధరావత్తు నిర్ణయించాలని కోరుతూ ఉన్నతాధికారులకు దస్త్రాన్ని పంపించారు. అక్కడి నుంచి నిర్ణయం కోసం ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్లింది. తరువాత కదలిక లేదు.వచ్చే ఆదాయం రూ.19.50కోట్ల నుంచి రూ.32.50 కోట్లు: రాయల్టీలో 30 నుంచి 50 శాతం వసూలయ్యే విధంగా వ్యర్థాలను విక్రయించినా గనుల శాఖకు రూ.19.50 కోట్ల నుంచి రూ.32.50 కోట్లు సమకూరే అవకాశం ఉంది. ప్రస్తుతం టన్ను నాపరాయికి రాయల్టీ ఫీజు రూ.130గా ఉంది. అయితే పెండింగులో ఉన్న దస్త్రానికి మోక్షం లభిస్తేనే ఇది జరుగుతుంది. ఆ మేరకు గనుల శాఖ కృషి చేయాల్సిన అవసరం ఉంది.

50 లక్షల మెట్రిక్ టన్నుల పైమాటే..తాండూరు మండలం మల్కాపూంటు, కరణ్‌కోట, ఓగిపూరు, సంగెం కలాన్, బషీరాబాద్ మండలం నవల్గా, క్యాద్గిర, ఎక్మాయి గ్రామాల్లో వందల ఎకరాల్లో నాపరాయి గనులు ఉన్నాయి. ఇవే భూముల్లో 150కి పైబడి గనులు కొనసాగుతున్నాయి. యజమానులు కార్మికులతో నాపరాళ్లను పలకలుగా పైకి తీయించే సమయంలో, లోడింగ్ సమయంలో, యంత్రాలతో ప్రమాణాల మేరకు కత్తిరించినపుడు ముక్కలుగా మారుతున్నాయి. ట్రాక్టర్లు, టిప్పర్లలో నింపించిన వ్యర్థాలను గనుల గట్లు, ఖాళీ ప్రదేశాల్లో పోస్తూ వస్తున్నారు. ఇలా దాదాపు నాలుగు దశాబ్దాల నుంచి కుప్పలుగా పోసుకుంటూ వచ్చినవి 50 లక్షల మెట్రిక్ టన్నులకు పైగానే పేరుకు పోయాయి.వీటిని తొలగిస్తే భూమి చదునుగా మారుతుంది. మళ్లీ నాపరాళ్లను వెలికి తీసే గనులుగా మార్చవచ్చు. రాయల్టీల రూపంలో అదనంగా ఆదాయం పొందొచ్చు.

## రైల్వేస్టేషన్లలో మురుగు నీటి రీసైక్లింగ్..



హైదరాబాద్: ఎండలు మండిపోతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటాయి. నగరంలో నీటి కటకట ఏర్పడడంతో ఉద్యానాలు ఎండిపోతున్నాయి. దీనికంతటికీ కారణం నీరు తగినంత లేకపోవడమే నని సమాధానం వస్తుంది. కానీ దక్షిణమధ్య రైల్వే అలాంటి మాటకు తావులేదంటోంది. రైళ్లను కడిగిన నీటితో పాటు.. సాధారణ అవసరాలకు వినియోగించే నీటిని వృథా చేయకుండా.. శుద్ధిచేసి మళ్లీ వాడుతోంది. ఇప్పటికే సికింద్రాబాద్, కాచిగూడ, హైదరాబాద్ స్టేషన్లలో మురుగునీటి శుద్ధి ప్లాంట్లను ఏర్పాటు చేయగా.. తాజాగా చర్లపల్లి రైల్వే స్టేషన్లోనూ సిద్ధం చేస్తోంది.

సికింద్రాబాద్‌లో ప్రప్రథమం..

భారతీయ రైల్వేలోనే మొట్టమొదటి మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని సికింద్రాబాద్ రైల్వేస్టేషన్లో ఏర్పాటు చేశారు. ఇక్కడి ప్రయోగాలు, తద్వారా ఒనగూరిన ప్రయోజనాలు.. దేశంలోని ముఖ్యమైన రైల్వేస్టేషన్లలో కేంద్రాల ఏర్పాటుకు ఊతమిచ్చింది. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్లో రోజుకు 1.50 లక్షల లీటర్ల నీటిని ఇలా ఉత్పత్తి చేస్తున్నారు. కాచిగూడలో 1.50లక్షల లీటర్లు.. హైదరాబాద్ రైల్వేస్టేషన్లో 2 లక్షల లీటర్ల నీటిని ఈ మురుగునీటి శుద్ధి ప్లాంట్ల ద్వారా ఉత్పత్తి చేస్తున్నారు. ఇప్పుడు చర్లపల్లి రైల్వేస్టేషన్లో కూడా రోజుకు 2 లక్షల లీటర్లను ఉత్పత్తి చేసేలా మురుగునీటి శుద్ధి ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

శుద్ధి చేసిన జలాలతో..రైల్వేస్టేషన్లలో శుద్ధి చేసిన నీటితో ఉద్యానాల నిర్వహణ, మొక్కలకు నీళ్లు అందిస్తున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే రైళ్లను కడగడానికి, ప్లాట్‌ఫాంలు, రైల్వే ట్రాక్‌లను కడిగేందుకు వినియోగిస్తున్నారు. మళ్లీ అదే నీటిని ఒడిసి పట్టి మురుగునీటి శుద్ధి ప్లాంట్‌కు చేరేలా ఏర్పాట్లు చేశారు. మూడు రైల్వేస్టేషన్లలో నీటిశుద్ధి కేంద్రాల ద్వారా 5 లక్షల లీటర్ల నీటిని అందుబాటులోకి తెచ్చి.. వృథాకు అడ్డుకట్ట వేయడమే కాకుండా.. లక్షల లీటర్లను పొదుపు చేస్తున్నారు. ఇలా రోజుకు 5 లక్షల లీటర్లను నీటిని పొదుపు చేయడమంటే.. నెలకు కనీసం రూ.10 లక్షలకు పైగా పొదుపు చేసినట్టవుతుందని అక్కడి ప్లాంట్ల నిర్వాహకులు చెప్పారు.

సిటీ డిపోల్లో నీటి కటకట

బస్సులు కడిగేందుకు నీళ్ల కరవు

తుడుస్తూ సరిపెడుతున్న వైనం

నగరంలో నీటి కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. భూగర్భ జలాలు అడుగంటడంతో బోర్లు ఎండిపోయాయి. దీంతో నీటితో కడిగే దగ్గర తడి వస్త్రంతో తుడుస్తున్నారు. ఇందుకు నగరంలో తిరిగే బస్సులు సైతం అతీతం కాదు. ప్రతి డిపోలో బస్సులను నీటితో శుభ్రం చేసే వ్యవస్థలున్నాయి. కానీ నీటికొరత వల్ల అవి పని చేయడంలేదు. దీంతో బస్సులు దుమ్ముకొట్టుకు పోవడంతో సిటీ బస్సుల్లో ప్రయాణించే మొదటి ప్రయాణికుడు సీటును తుడుచుకుని కూర్చోవాల్సి వస్తోంది.

తుడుస్తున్నా తొలగని దుమ్ము.. డిపోలకు చేరిన బస్సులను మరుసటి రోజు శుభ్రంగా కడిగేవారు. వారానికి ఒకసారి బస్సును మొత్తం కడిగి తుడుస్తారు. నీరు పుష్కలంగా ఉన్నప్పుడే బస్సుల శుభ్రత అంతంత మాత్రంగా ఉండేది. ప్రస్తుతం నీరు లేకపోవడంతో బస్సు లోపలి భాగంలో తుడుస్తున్నారు. ఇది సైతం వారం పది రోజులకోసారి చేస్తుండడంతో సీట్లన్నీ దుమ్ముకొట్టుకుపోతున్నాయి. నగర శివారు డిపోల్లో బోర్లు పని చేస్తుండడంతో షెడ్యూల్ ప్రకారం తుడుస్తున్నామని చెబుతున్నారు. కొన్ని డిపోల్లో ట్యాంకర్ల ద్వారా నీళ్లు తెస్తున్నప్పటికీ వారానికోసారి బస్సు బయట శుభ్రం చేసి వదిలేస్తున్నారు. లోపల వైపు తుడవడంతో ఆ దుమ్ము బస్సు సీట్లపై పడి ప్రయాణికులకు ఇబ్బందిగా మారుతున్నాయి.

## గౌరవ వేతనం జాడేది?

కరీంనగర్ : నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఏటా అంబేడ్కర్ స్టేడియం వేదికగా ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను అట్టహాసంగా నిర్వహిస్తుంటారు. నగరంతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి తల్లిదండ్రులు పిల్లలను ఇక్కడకు పంపిస్తుంటారు. గతేడాది మే, జూన్ నెలలో నిర్వహించిన శిక్షణ శిబిరాల్లో సుమారు 2500 మంది చిన్నారులు శిక్షణ పొందారు. పిల్లలకు శిక్షణ ఇచ్చేందుకు సుమారు 70 మంది కోచ్‌లను క్రీడా శాఖ ఎంపిక చేసింది. శిక్షణ కాలంలో కోచ్‌లకు గౌరవ వేతనంగా కొంత మొత్తాన్ని నగరపాలక సంస్థ ఇస్తోంది. గత వేసవి క్రీడా శిబిరంలో కోచ్‌లకు గౌరవ వేతనం ఇప్పటికీ అందలేదు.పట్టించుకునే వారు కరవు..

కరీంనగర్ బల్దియా ఆధ్వర్యంలో 2023 మే 5 నుంచి జూన్ 7 వరకు 28 అంశాల్లో శిక్షణ ఇచ్చారు. అనంతరం కోచ్‌లకు గౌరవ వేతనం ఇవ్వడం ఆనవాయితీ. వేసవి సెలవుల్లో అందరూ విహారయాత్రలకు వెళ్తుంటే 70 మంది కోచ్‌లు మాత్రం విద్యారులకు క్రీడా నైపుణ్యాలను అందించారు. శిబిరం ముగిసిన తర్వాత వారిని పట్టించుకునే వారే కరవయ్యారు. మళ్లీ వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో ఇప్పటికైనా గౌరవ వేతనం ఇవ్వాలని కోచ్‌లు కోరుకుంటున్నారు. తామందరం ప్రైవేటు పాఠశాలల్లో పీఈటీలుగా, క్రీడలకు



కోచ్‌లుగా చాలీచాలని జీతాలతో పని చేస్తున్నామని మొర పెట్టుకున్నా అధికారులు ఆలకించలేదని కోచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మేయర్, డీవైఎస్‌వో, జిల్లా ఒలింపిక్ సంఘం బాధ్యులకు విన్నవించుకున్నా లాభం లేదని వాపోతున్నారు. 2018, 2019లో నిర్వహించిన శిబిరాల్లో పాల్గొన్న కోచ్‌లకు ఆరు నెలలు గడిచిన తర్వాత గౌరవ వేతనం ఇచ్చారు. తర్వాత కరోనా కారణంగా శిబిరాలు నిర్వహించలేదు. గతేడాది 2022లో నిర్వహించగా.. ఇప్పటికీ ఇవ్వలేదు.

## బస్తాలు రాక.. లక్ష్యం నెరవేరక..!

మిర్యాలగూడ : కస్టమ్ మిల్లింగ్ బియ్యం తిరిగి ఇచ్చేందుకు ఉమ్మడి జిల్లాలోని పలు రైస్‌మిల్లులకు బస్తాల సమస్య నెలకొంది. ఖరీఫ్ ధాన్యంతో పౌరసరఫరాల శాఖ సరఫరా చేసిన బస్తాలకు కాప్రా పురుగు పట్టడంతో (సన్నని తెల్లపురుగు).. ఈ బస్తాల్లో కస్టమ్ మిల్లింగ్ బియ్యాన్ని భారత ఆహార సంస్థకు లెవీ పెట్టేందుకు మిల్లర్లు ముందుకు రావటం లేదు. పురుగు వచ్చిన బస్తాల్లో భారత ఆహార సంస్థకు బియ్యాన్ని మిల్లర్లు పంపితే వారు వెంటనే తిరస్కరిస్తున్నారు.

పంపిణీ విధానం ఇలా..పౌరసరఫరాల శాఖ ఐకేపీ కేంద్రాల్లో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని 54 శాతం కొత్త బస్తాలు, 46 శాతం పాత బస్తాల్లో మిల్లులకు ధాన్యం లారీల్లో లోడు చేసి పంపుతున్నారు. ధాన్యం మరపట్టిన తరువాత లెవీగా భారత ఆహార సంస్థకు కొత్త బస్తాల్లో నింపి అందించాలి. కొత్త బస్తాలపై ఏసీకే నంబర్లు ముద్రించి మిల్లర్లు లెవీ పెట్టాల్సి ఉంది. గత ఖరీఫ్ ధాన్యం లెవీ పెట్టే విషయంలో జాప్యం అవుతుండగా ప్రస్తుతం ఈ బస్తాల్లో పురుగులు రావటంతో మిల్లర్లు సరఫరా చేయలేకపోతున్నారు. తమకు కొత్తగా బస్తాలు ఇవ్వాలంటూ జిల్లా పౌరసరఫరాల శాఖకు, కలెక్టర్‌కు వినతి పత్రాలు అందిస్తున్నారు. భారత ఆహార సంస్థ నుంచి లెవీకి అనుమతి వచ్చే విషయంలో జరుగుతున్న జాప్యంతో తమ వద్ద నిల్వ ఉంచిన



ధాన్యం మిల్లింగ్‌కు కూడా పనికిరాకుండా పోతుందని మిల్లర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనుమతి వచ్చిన సమయంలో బస్తాలు ఖాళీ చేసి ధాన్యం మిల్లింగ్ చేసి బియ్యం చేస్తున్నారు.

గతంలో కోటా ఇవ్వని వారికి కొత్త బస్తాలు..

– వెంకటేశ్వర్లు, జిల్లా పౌరసరఫరాల అధికారి, నల్గొండ

ఖరీఫ్ ఐకేపీ ధాన్యం మిల్లులకు పంపిణీ చేసే సమయంలో 54 శాతం కొత్త బస్తాలు ఇవ్వని వారికి మాత్రమే కొత్త బస్తాలు ఇచ్చేందుకు జిల్లా కలెక్టర్ అనుమతించారు. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ డీఎం పరిశీలించి కొత్త బస్తాలు ఇస్తున్నారు. అన్ని మిల్లులకు గతంలో పంపిన కొత్త బస్తాలను శుభ్రం చేయించి ఎఫ్‌సీఐకి లెవీ పెట్టాలి.

## నిత్యం రక్తసిక్తం..!

సూర్యాపేట : జాతీయ, ప్రధాన రహదారులు నిత్యం రక్తమోడుతున్నాయి. వాహనాల అతివేగం, చోదకుల నిర్లక్ష్యం అమాయకుల ప్రాణాలను బలిగొంటున్నాయి. ఒక్కరు చేసిన పాపానికి ఎందరో తనువు చాలిస్తున్నారు. తల్లిదండ్రులకు ఆసరా అవుతారనుకున్న కుమారులు దూరమై పుట్టెడు శోకాన్ని మిగులుస్తున్నారు. సూర్యాపేట జిల్లాలో రోజూ ఎక్కడో చోట రహదారి ప్రమాదం జరుగుతూనే ఉంది. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా జనవరి నుంచి ఏప్రిల్ 11 వరకు 102 రోజుల వ్యవధిలోనే 91 మంది మృత్యువాత పడినట్లు పోలీసుల గణాంకాలు వెల్లడిస్తున్నాయి. సూర్యాపేట పురపాలిక పరిధిలో ఈ నెల 4 నుంచి 11 వరకు తొమ్మిది రోజుల వ్యవధిలో జరిగిన వేర్వేరుగా రోడ్డు ప్రమాదాల్లో 13 మంది దుర్మరణం చెందడం విస్మయం కలిగిస్తోంది. ప్రధానంగా వాహనదారులు నిబంధనలు పాటించకపోవడం, అతివేగం వల్ల జరిగిన ప్రమాదాలే ఎక్కువ.

ఈ నెలలో జరిగిన దుర్ఘటనలు ఇవీ..

ఈ నెల 3న కేతేపల్లి మండలం ఇనుపాముల గ్రామం బస్టాండ్ సమీపంలో 65వ నంబరు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆత్మకూర్(ఎస్) మండలం ఇస్తాళాపురం గ్రామానికి చెందిన మహిళ దుర్మరణం.

4న సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మానసనగర్ సమీపంలో కారు, ఆటో, లారీ ఢీకొన్న ఘటనలో ఆరుగురు మృత్యువాత.

5న సూర్యాపేట మండలం రాయినిగూడెం సమీపంలో జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

7న చిలుకూరు మండలంలోని కవిత జూనియర్ కళాశాల సమీపంలో



వాహనాన్ని లారీ ఢీ కొట్టిన ఘటనలో వ్యక్తి మరణం.

8న సూర్యాపేట మండలం రాజునాయక్‌తండా సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో అర్వపల్లి మండలం కొమ్మాల గ్రామానికి చెందిన యువకుడి దుర్మరణం.

9న సూర్యాపేట నుంచి స్వగ్రామం పిల్లలమర్రి గ్రామం వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో యువకుడి మృతి.

9న ఆత్మకూర్ మండలం పాతర్లపహాడ్ గ్రామానికి చెందిన బాలుడు ట్రాక్టర్ నడుపుతూ అదుపుతప్పి మృతి.

11న సూర్యాపేట మండలం రాయినిగూడెం సమీపంలో జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు దుర్మరణం.

11న సూర్యాపేట పట్టణంలోని జాతీయ రహదారి వంతెనపైన డీసీఎంను వెనుక నుంచి కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురు యువకులు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు.

కఠిన చర్యలు

–రాహుల్ హెగ్డే, ఎస్పీ, సూర్యాపేట

వాహనదారులు నిబంధనలు పాటించాలి. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవల రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో వాహన తనిఖీలను విస్తృతం చేశాం. పరిమితికి మించి ప్రయాణికులను తరలించడం, ఇష్టారీతిన రాకపోకలు సాగించడం మార్చుకోవాలి.




# గత ప్రభుత్వంలో అక్రమాలు బయటకొస్తున్నాయి..

అమరావతి: జగన్ ప్రభుత్వ హయాంలోని మంత్రులు, ఎమ్మెల్యేలు చేసిన భూ దందాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని, మదనపల్లిలో రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా బాధితుల ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారని తెలుగుదేశం ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన అమరావతి, అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. అక్రమాలు బయటపడతాయని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైల్స్ దగ్ధం చేశారని విమర్శించారు. ఘటనలో గత ప్రభుత్వ పెద్దలు ఉన్నట్లు తేలిందని.. పెద్దిరెడ్డి ముఠా పేదల భూములు కొట్టేసిందని, సిగ్గులేకుండా జగన్ ఢిల్లీలో ధర్నా చేశారని సోమిరెడ్డి దుయ్యబట్టారు. జగన్ ప్రభుత్వంలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం చేశారని, నెల్లూరు కోర్టులో ఓ మంత్రి ఫైల్స్ దొంగతనాలు చేశారని... ఇంకో మంత్రి సబ్ కలెక్టర్ కార్యాలయంలో పత్రాలు తగలబెట్టారని సోమిరెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. ఫైల్స్ దగ్ధం ఘటనతో మిథున్ రెడ్డి తమకు సంబంధం లేదని అంటున్నారని, మరి ఎవరికి సంబంధం ఉందో చెప్పాలని డిమాండ్ చేశారు. మొన్నటిదాకా వాళ్లే కదా అధికారంలో ఉందని.. బీజేపీలో చేరాలని ప్రయత్నం చేశారని.. అది కాస్త బెడిసికొట్టిందన్నారు.

**ఢిల్లీ ధర్నాలో ఇలా...** కాగా.. “ఏపీలో హింసాకాండ” అంటూ ఇటీవల ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ ధర్నా నిర్వహించిన విషయం తెలిసిందే. రాష్ట్రపతి పాలన విధించాలంటూ పార్టీ నేతలతో కలిసి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. ఏపీ సర్కార్‌పై విరుచుకుపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో హింసాకాండ చెలరేగిపోతోందని.. తాము అధికారంలో ఉన్నప్పుడు ప్రతీకార చర్యలను ప్రోత్సహించలేదని చెప్పుకొచ్చారు. ఇప్పుడు దాడులు, దౌర్జన్యాలతో భయానక పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఏపీలో లోకేశ్ రెడ్ బుక్ పాలన సాగుతోందంటూ మాజీ ముఖ్యమంత్రి జగన్ దుయ్యబట్టారు. ఢిల్లీలో చేపట్టిన ధర్నాలో జగన్ పదేపదే లోకేష్ రెడ్ బుక్ అంశాన్ని తెరపైకి తీసుకొచ్చారు. అయితే వైసీపీ అధినేత వ్యాఖ్యలపై టీడీపీ నేతలు కూడా గట్టిగానే కౌంటర్ ఇచ్చారు. జగన్‌కు రెడ్ బుక్ అంటే భయంపట్టుకుందని... ఢిల్లీ వెళ్ళి అక్కడ కూడా రెడ్ బుక్ అని మాట్లాడుతున్నారని హోంమంత్రి అనిత వ్యాఖ్యలు చేశారు. అధికారం కోసం... తప్పుడు పనుల నుంచి తప్పించుకోవడానికి వైసీపీ నేతలు బీజేపీ వైపు చూస్తున్నారని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. చేసిన పాపాలకు శిక్ష తప్పదని, ప్రజలు ఇటువంటి దుర్మార్గుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అసెంబ్లీ సమావేశాలను ఎగ్గొట్టేందుకు జగన్ ఢిల్లీ పారిపోయారని ఎద్దేవా చేశారు. శ్వేత పత్రాలపై మాట్లాడే దమ్ము, ధైర్యం వైసీపీ ఎమ్మెల్యేలకు లేదన్నారు. వైసీపీకి11 మంది ఎమ్మెల్యేలు ఉంటే ఏమైంది... నిజాయితీగా మాట్లాడడానికి ఒక్కరు చాలరా? అని సోమిరెడ్డి ప్రశ్నించారు. కాగా మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో రికార్డులు దగ్ధమైన నేపథ్యంలో భూ బాధితులు రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియాను కలిసి ఫిర్యాదు చేసేందుకు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. బాధితుల నుంచి సిసోడియా ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. తమ భూములకు సంబంధించిన రికార్డులు తారుమారు చేసి భూ కబ్జా చేయడం జరిగిందని, తమకు న్యాయం జరుగుతుందనే ఆశతో వచ్చామని బాధితులు ఏబీఎన్‌కు తెలిపారు. తమ భూమిని వైసీపీ నేతలు ఆక్రమించి ఇల్లు కట్టుకున్నారని ఓ బాధితుడు తెలిపారు. ఇలా చాలా మంది బాధితులు తమ సమస్యలను ఏబీఎన్‌కు తెలిపారు. ఇకనైనా తమ భూములు ఇప్పించి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు. గత ప్రభుత్వంలో కలెక్టర్, అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని బాధితులు వాపోయారు.


# అప్పులపై బాబు తప్పుదోవ పట్టిస్తున్నారు.. శ్వేతపత్రాలపై జగన్ స్పందన



తాడేపల్లి: రాష్ట్ర అప్పులపై సీఎం చంద్రబాబు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ ఆరోపించారు. శుక్రవారం తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు పాలనలో రాష్ట్రం తిరోమనంలో వెళ్తోందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 52 రోజుల్లో రాష్ట్రంలో అక్రమాలు, ఆకృత్యాలు పెరిగిపోయాయని ఆరోపణలు గుప్పించారు. “52 రోజులుగా దాడులు, అత్యాచారాలు, ఆస్తుల ధ్వంసం కొనసాగుతోంది. ప్రశ్నించే వాళ్లను అణచివేస్తున్నారు. వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. విధ్వంస పాలన సాగుతుంటే పోలీసులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారు. బడ్జెట్ కూడా పెట్టలేని స్థితిలో చంద్రబాబు ప్రభుత్వం ఉంది. పూర్తి స్థాయి బడ్జెట్ పెడితే బాబు హామీలకు లెక్కలు చూపాల్సి వస్తుంది. అందుకే బడ్జెట్ ప్రవేశపెట్టడానికి వెనకడుగేస్తున్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అంధకారంలోకి వెళ్లిందని అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. బాబు పాలనలోనే రాష్ట్రం ఆర్థికంగా దిగజారింది” అని జగన్ అన్నారు. ఎన్నికల సమయంలో 14 లక్షల కోట్ల అప్పులు ఉన్నాయని చెబుతూ.. సూపర్ సిక్స్ హామీలు జగన్ విమర్శించారు. “ఇప్పుడు అధికారం వచ్చాక అది చూపించడానికి ఇబ్బందులు పడుతున్నారు. గవర్నర్ ప్రసంగంలో రూ.10 లక్షల కోట్ల అప్పు అయ్యిందని చూపించారు. శ్వేత పత్రాలతో మభ్య పెట్టే యత్నం చేస్తున్నారు. ఆర్బీఐ, కాగ్, రాష్ట్ర బడ్జెట్ లెక్కల ప్రకారం 2024 జూన్ వరకు కూటమి సర్కార్ గద్దెనెక్కేవరకు రూ.5 లక్షల 18 వేల కోట్ల అప్పు మాత్రమే అయింది. చంద్రబాబు హయాంలో 21.63 శాతం దాకా అప్పు చేశారు. వైసీపీ హయాంలో 12.9 శాతం అప్పు చేశాం. కేంద్ర ఆర్థిక సర్వే మా ప్రభుత్వ పని తీరును మెచ్చుకుంది. బడ్జెట్‌లోనూ ఈ లెక్కలన్నీ చెప్పాల్సి వస్తుందనే పూర్తిస్థాయి బడ్జెట్ పెట్టడం లేదు. 14 లక్షల కోట్ల అప్పు ఉందని చెప్పడం సరికాదు” అని జగన్ అన్నారు.

**చంద్రబాబు ఏమన్నారంటే..** 2019-24మధ్య రాష్ట్రంలో భారీగా జరిగిన ఆర్థిక నిర్వహణ లోపాలపై శ్వేతపత్రాన్ని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు నేడు సభ ముందు ఉంచారు. అయిదేళ్ల పాటు పట్టిసీమను ఆపరేట్ చేయలేదని వెల్లడించారు. గోదావరి ఉన్నంత వరకూ ఈ ప్రాంతానికి నీటి ఎద్దడి రాకూడదన్నారు. అయితే ఆ పరిస్థితి కూడా తెచ్చిన వ్యక్తి నాటి పాలకుడు అని పేర్కొన్నారు. పోలవరం 15364 కోట్లు ఖర్చు చేశామని.. అదే టీడీపీ అధికారంలో కొనసాగి ఉంటే ఈ పాటికే ప్రాజెక్టు ఆపరేషన్ లో ఉండేదన్నారు. కేంద్రం వేసిన ఎక్స్‌ఫర్ట్ కమిటీ ఇచ్చిన రిపోర్టు ఆధారంగా ప్యారలల్‌గా కొత్త దయాఫ్రం వాల్ నిర్మించాలని అత్యవసర క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకున్నామన్నారు. దీంతో రూ. 990 కోట్లు దీనికోసం ఖర్చే చేయాల్సి వస్తోందని చంద్రబాబు తెలిపారు. న్యూ ఎపిక్ సెంటర్ గ్రోత్ అమరావతి... ఈ ప్రాజెక్టును చూస్తే కొత్తనగరాలు ఆవశ్యకత ఎంతో ఉందని చంద్రబాబు తెలిపారు. అమరావతి ఇదే స్పీడ్‌లో ఆర్టీఫిషియల్ ఇంటిలలిజెన్స్ సిటీ గా తయారై ఉండేదని.. కానీ దాన్ని దుర్మార్గులు దెబ్బతీసేలా వ్యవహరించారన్నారు. ఒక్క వివాదం లేకుండా రైతులు ల్యాండ్ ఇచ్చారని పేర్కొన్నారు. గతంలో హైదరాబాద్ అంటే పాకిస్థాన్ హైదరాబాదా?.. ఇండియా హైదరాబాదా? అని అడిగేవారని చంద్రబాబు అన్నారు. ఇప్పుడు హైదరాబాద్ అంటే ఇండియాలోని హైదరాబాద్ మాత్రమే అని అందరూ గుర్తించారన్నారు. 7 లక్షల మంది ఉద్యోగులు అమరావతిలో ఉండేవారని... 3 నుంచి నాలుగు లక్షల కోట్ల ఆస్తి అమరావతితో వచ్చేదని చంద్రబాబు పేర్కొన్నారు.

# ఢిల్లీలో జగన్ చేసింది ధర్నా కాదు.. డ్రామా..: భాను ప్రకాష్ రెడ్డి





తిరుపతి: బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భాను ప్రకాష్ రెడ్డి వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన తిరుపతిలో మీడియాతో మాట్లాడుతూ.. జగన్ ఢిల్లీకి వెళ్లి ధర్నా చేసారని.. అది ధర్నాలా లేదని.. డ్రామాలు ఆడేందుకు వెళ్లినట్టు ఉందని ఎద్దేవా చేశారు. వాళ్లు.. వాళ్లు కొట్టుకుని, చంపుకొని కూటమిపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎవరు ఎక్కడ చనిపోయారో పేర్లతో పాటు 24 గంటల్లో చెప్పాలని డిమాండ్ చేశారు. ఏపీ ప్రజలు ఇచ్చిన దెబ్బకు జగన్‌కు మైండ్ పోయిందని అన్నారు. రాష్ట్రంలో విద్వాంస పాలన చేశారని, ఏపీని సర్వ నాశనం చేశారని, శాంతి భద్రతలు లేని రాష్ట్రంగా మార్చేసారని భాను ప్రకాష్ రెడ్డి దుయ్యబట్టారు. జగన్మోహన్ రెడ్డి ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతుంటే.. దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందని, జగన్ పాలనపై నమ్మకం లేకనే ప్రజలు ఇంటికి పంపారని భాను ప్రకాష్ రెడ్డి అన్నారు. లిక్కర్ గోల్ మాల్ రూ. 99 వేల కోట్ల నగదు జరిగిందని, రూ. 620 కోట్ల డిజిటల్ మార్పు జరిగిందన్నారు. ఇప్పటికే వాసుదేవరెడ్డిపై చర్యలు ప్రారంభమయ్యాయన్నారు. “ఢిల్లీకి వెళ్తే ఎవరు నిన్ను కాపాడారు. వికసించే భారత్‌ను ప్రజల కోసం చేయాలని అనుకుంటున్నాము.. హెలికాప్టర్‌లో తిరిగే ఏకైక ముఖ్యమంత్రి ఆయన ఒక్కడే... ప్రజా దానాన్ని దోచుకున్న ఆలీబాబా వైసీపీ దొంగ అని అంటున్నారు... ఏపీని గంజాయి ప్రదేశ్‌గా మార్చింది నువ్వే.. పట్టుబడిన దానిలో ... విక్రయాల్లో నెంబర్ 1గా మార్చారు... నీ మాటలు నమ్మే పరిస్థితి లేదు.. జీవితాంతం జగన్ కళ్లు మూసుకుని ఉండాల్సిందే... సీమాంధ్రను స్వర్ణాంధ్ర చేయాలని అనుకుంటున్నాము.. నిన్ను శత్రువుగా చూడలేదు.. కేంద్రం ఏపీని ఆదుకుంటుంది. రికార్డులు కాల్చితే తప్పించుకోలేరు.. త్వరలో ఆధారాలతో బయట పెడతాం” అని భాను ప్రకాష్ రెడ్డి వ్యాఖ్యానించారు. జగన్ సీఎంగా ఉన్న ఐదేళ్లలో ప్రజలపై జరిగిన దాడులను లోకమంతా చూసిందని భానుప్రకాశ్ రెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను ఆందోళన ప్రదేశ్‌గా మార్చిన ఘనత జగన్‌కే దక్కిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతే రాష్ట్రంలో శాంతి వాతావరణం నెలకొందని తెలిపారు. కక్ష సాధింపులు కాదని.. అభివృద్ధి ఆంధ్రప్రదేశ్‌వైపు అడుగులు వేస్తుందని ఆయన అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఏపీలో జరిగిన అరాచకాలు దేశవ్యాప్తంగా చర్చగా మారాయని భానుప్రకాశ్ రెడ్డి తెలిపారు. కానీ ఇప్పుడు జగన్ మసిపూసి మారేడుకాయ చందంగా కూటమి ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. విధ్వంసం సృష్టించిన ఏ నాయకులను వదిలిపెట్టమని హెచ్చరించారు. చట్ట వ్యతిరేకంగా వ్యవహరించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని భానుప్రకాశ్ రెడ్డి స్పష్టం చేశారు.




రాయచోటి: అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో దస్త్రాల దహనం కేసులో విచారణ కొనసాగుతోందని రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోదియా తెలిపారు. మదనపల్లె నుంచి విజయవాడ వెళ్తూ అన్నమయ్య జిల్లా కలెక్టరేట్‌ను సందర్శించిన ఆయన.. అధికారులతో సమావేశమై రెవెన్యూశాఖ రికార్డులపై పలు సూచనలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. మదనపల్లె ఘటనపై 4 బృందాలు విచారణ చేస్తున్నాయని తెలిపారు. “వైకాపా నాయకుడు మాధవరెడ్డి ఇప్పటికే పరారయ్యారు. ఏడుగురిని విచారిస్తున్నాం. ఫోరెన్సిక్ నివేదిక రాగానే అన్ని నిజాలు తెలుస్తాయి. కార్యాలయంలో పనిచేసే సిబ్బందిపై అనుమానం ఉంది. త్వరలోనే శాఖపరమైన చర్యలు తీసుకుంటాం. కొందరు ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు పడుతుంది. మరికొందరిని అరెస్ట్ చేసే అవకాశముంది. మంటల్లో దగ్ధమైన రికార్డుల రికవరీకి ప్రయత్నం చేయొచ్చు. కలెక్టరేట్, తహసీల్దార్ కార్యాలయాల్లో లావాదేవీల రికార్డులను పరిశీలించాం. 20 ఏళ్ల తర్వాత డీ పట్టాలు ఫ్రీహోల్డ్ అవుతాయనే ఘటన జరిగినట్లు అనుమానిస్తున్నాం.

అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో 21.16లక్షల ఎకరాలు ఫ్రీ హోల్డ్ అయ్యాయి. అందులో 4,400 ఎకరాలకు రిజిస్ట్రేషన్ జరిగింది. ఫ్రీహోల్డ్‌పై ఆయా జిల్లాల కలెక్టర్లు విచారణ చేపట్టారు”అని సిసోదియా తెలిపారు.

# గోదావరి వరద బాధితుల్ని ఆదుకుంటాం: అసెంబ్లీలో చంద్రబాబు ప్రకటన



అమరావతి: గోదావరి వరద బాధితుల్ని ఆదుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. శుక్రవారం శాసనసభలో ఆయన మాట్లాడుతూ.. తూర్పు, పశ్చిమగోదావరి, కోనసీమ, కాకినాడ, ఏలూరు జిల్లాలు వరద ప్రభావానికి గురయ్యాయని తెలిపారు.

“4,317 ఎకరాల్లో వరి పంట దెబ్బతింది. 1.06 లక్షల ఎకరాల్లో వరి నాట్లు ముంపునకు గురయ్యాయి. మొక్కజొన్న, పత్తి లాంటి పంటలు కూడా దెబ్బతిన్నాయి. అల్లూరి జిల్లాలోనూ కొన్ని చోట్ల వరద ప్రభావం ఉంది. ఇళ్లు నీట మునిగిన బాధితుల కోసం ప్రభుత్వం సహాయక శిబిరాలు ఏర్పాటు చేసింది. శిబిరాల్లో ఉన్న వారికి రూ.3వేల చొప్పున ఆర్థిక సాయం, 25 కేజీల బియ్యం, లీటర్ పామాయిల్, కందిపప్పు, బంగాళదుంపలు, ఉల్లిపాయలు కేజీ చొప్పున అందిస్తాం. వ్యవసాయశాఖ, హోంశాఖ మంత్రులు క్షేత్రస్థాయికి వెళ్లి వరదబాధితుల్ని పరామర్శించాలని ఆదేశించా. దిల్లీలో నీతిఆయోగ్ సమావేశం కారణంగా బాధితుల్ని పరామర్శించేందుకు వెళ్లలేకపోతున్నా. పంట నష్టాన్ని ప్రాథమికంగా అంచనా వేయాలని మంత్రులు, అధికారులకు ఆదేశాలిచ్చాం” అని సీఎం తెలిపారు.

# అసెంబ్లీ వేదికగా వలంటీర్ వ్యవస్థపై మంత్రి డోలా కీలక ప్రకటన




అమరావతి : వైసీపీ హయాంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీసుకొచ్చిన వలంటీర్ వ్యవస్థపై కూటమి ప్రభుత్వంలో కొనసాగుతుందా..? లేదా..? అనేది మిలియన్ డాలర్ ప్రశ్నగా మిగిలిపోయింది. ఓ వైపు ఈ వ్యవస్థ ఉంటుందో.. లేదో అని వలంటీర్లు ఆందోళన చెందుతుంటే, మరోవైపు ఈ వ్యవస్థను కొనసాగించి తీరాలనే డిమాండ్ ప్రజా సంఘాలు, ప్రజలు, ఆఖరికి వైసీపీ నుంచి కూడా గట్టిగానే పట్టుబడుతోంది. ఈ పరిస్థితుల్లో ఇలా నెలకొన్న ఎన్నో ప్రశ్నలకు, ఇన్నాళ్లు నెలకొన్న సందిగ్ధతకు కూటమి ప్రభుత్వం తెరదించింది. అసెంబ్లీ వేదికగా వలంటీర్ వ్యవస్థపై సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి స్పందిస్తూ ఫుల్ క్లారిటీ ఇచ్చేశారు.

**త్వరలోనే శుభవార్త! :** అసెంబ్లీ సమావేశాల్లో శాసన మండలిలో మాట్లాడిన మంత్రి డోలా.. ఏపీలో వలంటీర్ వ్యవస్థ కొనసాగుతుందని తేల్చి చెప్పేశారు. అలాగే.. గౌరవ వేతనంపై కూడా ప్రతిపాదనలు వస్తున్నాయన్న విషయాన్ని గుర్తు చేశారు. త్వరలోనే పూర్తి స్థాయిలో విధివిధానాల రూపకల్పన చేస్తామని డోలా ఫుల్ క్లారిటీ ఇచ్చేశారు. వాస్తవానికి వలంటీర్ వ్యవస్థ గురించి ప్రస్తావన వచ్చిన ప్రతిసారీ సోషల్ మీడియా వేదికగా, మీడియా ముందుకు వచ్చి మంత్రి సమాధానం ఇస్తూనే వస్తున్నారు. అయినప్పటికీ ఇవాళ శాసనమండలిలో ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు బదులిస్తూ డోలా ఫుల్ క్లారిటీ ఇచ్చారు. దీంతో 2 లక్షల మంది వలంటీర్లలో నెలకొన్న ఆందోళనకు ఫుల్ స్టాప్ పడినట్లయ్యింది. మంత్రి మాటలు చూస్తుంటే.. త్వరలోని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వలంటీర్లకు శుభవార్త వస్తుందని స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు. సో.. వలంటీర్లు ప్రశాంతంగా ఊపిరి పీల్చుకోవచ్చన్న మాట.

**తొలగించే ప్రసక్తే లేదు..! :** కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వలంటీర్ వ్యవస్థపై ఒకరిద్దరు నేతలు ఏదేదో మాట్లాడేసే సరికి.. అసలు ఏం జరుగుతోంది..? ఈ వ్యవస్థ ఉంటుందా..? లేదా..? పూర్తిగా తొలగించేస్తారా..? అని రాష్ట్ర వ్యాప్తంగా చర్చ జరిగిన పరిస్థితి. ఎన్నికల ముందు ఎన్డీఏ కూటమి మాత్రం.. ఎట్టి పరిస్థితుల్లోనూ వలంటీర్ వ్యవస్థను తొలగించే ప్రసక్తే లేదని చెప్పిన విషయాన్ని వలంటీర్లు, సామాన్య ప్రజలు సైతం పదే పదే గుర్తు చేశారు. అంతేకాదు.. ఉగాది పర్వదినాన స్వయంగా టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు వలంటీర్లకు గౌరవ వేతనంగా 10 వేల రూపాయిలు ఇస్తామన్న విషయాన్ని కూడా గుర్తు చేస్తున్న పరిస్థితి. ఈ మొత్తం వ్యవహారంపై సంబంధిత మంత్రి స్పందిస్తూ ఇప్పటి వరకూ ఈ వ్యవస్థపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని.. కేబినెట్‌లో చర్చించి ఓ నిర్ణయానికి వస్తామని అప్పట్లో మంత్రి డోలా చెప్పారు కూడా. ఇప్పుడిక అసెంబ్లీ వేదికగానే మంత్రి క్లారిటీ ఇవ్వడంతో వలంటీర్లు ఊపిరిపీల్చుకున్నట్లు అయ్యింది.

# ఇండియా కూటమిలోకి జగన్..?




వైసీపీ అధినేత జగన్.. ఇండియా కూటమి వైపు మొగ్గు చూపుతున్నారా? త్వరలోనే ఆ కూటమిలో చేరనున్నారా? కాంగ్రెస్ పార్టీపై పీకల్లోతు పగతో రగిలిపోయిన జగన్.. ఇప్పుడు అదే కాంగ్రెస్ నాయకత్వం వహిస్తున్న టీమ్‌తో జత కట్టేందుకు సిద్ధమయ్యారా? అంటే జరుగుతున్న పరిణామాలు అవుననే సమాధానం చెబుతున్నాయి. ఢిల్లీలో జగన్ చేసిన ధర్నాలో చోటు చేసుకున్న పరిణామాలు.. ఆయన ఇండియా కూటమి వైపు మొగ్గు చూపుతున్నారనే సంకేతాలను ఇస్తోంది. పైగా, తాను కాంగ్రెస్‌ను క్షమించానంటూ గతంలో జగన్ కామెంట్స్ చేయడం.. ఇప్పుడు అదే జగన్ వద్దకు ఇండియా కూటమి నేతలు వచ్చి ఆయన ధర్నాకు మద్ధతు తెలుపడం చూస్తుంటే ఇండియా కూటమిలో జగన్ చేరడం దాదాపు ఖాయం అని భావిస్తున్నారు రాజకీయ విశ్లేషకులు. మరి నిజంగానే జగన్ ఇండియా కూటమి వైపు చూస్తున్నారా? అసలేం జరిగింది? ఏం జరగబోతోంది? ప్రత్యేక కథనం మీకోసం.. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు మరింత రసవత్తరంగా మారుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాభం తరువాత జగన్‌కు బీజేపీ ముఖం చాటేసింది. అండగా ఉంటారని భావించిన పెద్దలెవరూ పట్టించుకోకుండా ఛీ పొమ్మనడంతో దిక్కులేని స్థితిలో ఉన్నారు. వైసీపీ, బీజేపీ మధ్య ఇంతకాలం అంతర్గత స్నేహం కొనసాగినట్లు ప్రచారం జరిగినా.. ఇప్పుడు బహిరంగంగానే ఆ పార్టీని, ఆ పార్టీ నేతలను దూరం పెట్టేసింది బీజేపీ. వాస్తవానికి ఎన్నికల ముందు నాటికి వైసీపీ, బీజేపీ మధ్య రహస్య స్నేహం నడిచింది. కానీ, ఎన్నికల ముందు టీడీపీ, జనసేనతో జతకట్టడంతో వైసీపీని పక్కనపెట్టేసింది బీజేపీ. అయితే, ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయినప్పటికీ.. రాజ్యసభ సభ్యులు ఆ పార్టీకే ఎక్కువగా ఉండటం, నలుగురు లోక్‌సభ ఎంపీలు సైతం ఉండటంతో కేంద్రానికి తానే దిక్కు అన్నట్లుగా ఫీల్ అయిపోయారు జగన్. తన అవసరం ఉంటుందని, కేంద్రంలోని పెద్దలు తనకు అండగా ఉంటారని కలలు కంటూ వచ్చారాయన. కానీ, ఇప్పుడు సీన్ రివర్స్ అవడంతో తన పరిస్థితి ఏంటా? అని ఆలోచనలో పడ్డారు జగన్. ఇక లాభం లేదనుకుని.. తనకంటూ సపోర్ట్ ఉండాలని భావించి.. దోస్తీ కోసం దిక్కులు చూస్తున్నారట జగన్. ఇందుకు నిదర్శనమే ఇటీవల జగన్ ఢిల్లీ ధర్నా.

**ధర్నా అట్టర్ ఫ్లాప్..** ఏపీలో అరాచకం రాజ్యమేలుతోందని, కక్ష పూరిత రాజకీయాలతో హత్యలు జరుగుతున్నాయంటూ పెడబొబ్బలు పెట్టుకుంటూ దేశ రాజధాని ఢిల్లీలో ధర్నా చేశారు వైసీపీ అధినేత జగన్. ఏపీలో అంత జరుగుతుంది.. ఇంత జరుగుతుందంటూ బూమరాంగ్ చేయబోయారు. కానీ, అక్కడ ఆయన్నెవరూ పట్టించుకున్న పరిస్థితి లేదు. ఆ ధర్నాలో పట్టుమని 100 మంది కూడా లేని పరిస్థితి ఉంది. ఆ వంద మందిలోనూ పోలీసులు, మీడియా ప్రతినిథులు ఎక్కువగా ఉండటం విశేషం. దీన్ని బట్టి వైసీపీ ధర్నా పరిస్థితి ఏంటో ఈజీగా చెప్పేయొచ్చు.

**ఇండియా కూటమి నేతల మద్ధతు..** జగన్ ధర్నాను కేంద్ర ప్రభుత్వంలోని పెద్దలెవరూ పట్టించుకోలేదు కానీ.. ఇండియా కూటమి మాత్రం అండగా నిలిచింది. కూటమిలోని పలు పార్టీల నేతలు ఆ ధర్నా స్థలి వద్దకు వచ్చి సంఘీభావం తెలిపారు. జగన్‌కు మద్ధతుగా తమవంతు కొన్ని ప్రకటను చేసి వెళ్లారు. సమాజ్‌వాది పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, శివసేన నేత సంజయ్ రౌత్ వంటి వారు జగన్‌కు మద్ధతుగా ప్రకటనలు ఇచ్చారు. ఇప్పుడిదే.. రాజకీయంగా పెద్ద చర్చనీయాంశమైంది. ఇంతకాలం ఎన్డీయేకు మద్ధతు ఇస్తూ వచ్చిన జగన్‌కు ఇప్పుడు ఇండియా కూటమి నేతలు మద్ధతు ఇవ్వడంపై కొత్త సందేహాలు పుట్టుకొచ్చాయి. జగన్ ఇండియా కూటమిలో చేరబోతున్నారా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. జగన్ సైతం ఈ వార్తలను ఖండించడంలేదు. దీంతో ఆయన ఇండియా కూటమిలో చేరుతారనే ప్రచారం మరింత జోరందుకుంది.

**కనీసం పట్టించుకోని కేంద్ర పెద్దలు..** ఢిల్లీలో ధర్నా అంటూ వెళ్లిన వైఎస్ జగన్‌ను కేంద్ర ప్రభుత్వంలోని పెద్దలెవరూ పట్టించుకోలేదు. ధర్నా అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షాను కలుస్తామని.. ఏపీలో జరుగుతున్న పరిణామాలను వారికి వివరిస్తామని చెప్పారు జగన్. వారి అపాయింట్‌మెంట్ కూడా కోరామని ప్రకటించారు. ఇందుకోసం రెండురోజులైనా ఎదురు చూస్తానని చెప్పారు. కానీ, జగన్‌కు అక్కడా పరాభవమే ఎదురైంది. ఏ ఒక్కరూ ఆయనకు అపాయింట్‌మెంట్ ఇవ్వలేదు. రెండు రోజులు హస్తినలో ఎదురు చూసినా.. ఫలితం లేకుండా పోయింది. దీంతో ఇక లాభం లేదనుకుని గమ్మున ఢిల్లీన నుంచి తాడేపల్లి ప్యాలెస్‌కు రిటర్న్ అయ్యారు జగన్.

**దోస్తీ కోసం తహతహ..** రాష్ట్రంలో అధికారం కోల్పోవడం.. కేంద్రంలో పెద్దలు ముఖం చాటేయడంతో.. దిక్కుతోచని స్థితిలో జగన్ ఉన్నారు. తన ప్రభుత్వ హయాంలో చేసిన అరాచకాలను తలుచుకుంటూ.. ఇప్పుడు తన పరిస్థితి ఏంటా? అని జగన్‌లో ఆందోళన మొదలైందట. అందుకే.. తనకు సపోర్ట్ అవసరం అని జగన్ భావిస్తున్నారట. ఈ క్రమంలోనే.. ఇండియా కూటమి వైపు చూస్తున్నారట. తాను చేసిన తప్పులకు శిక్ష పడితే.. అండగా నిలిచేందుకు ఎవరో ఒకరు కావాలని భావిస్తున్నారట. అందుకే జగన్ ఇండియా కూటమి వైపు చూస్తున్నారట. ఇప్పటికే తన ధర్నాకు ఇండియా కూటమి నేతలు మద్ధతు తెలుపడంతో.. ఈ కొత్త దోస్తీకి మార్గం సుగమం అయ్యిందనే ప్రచారం జరుగుతోంది. మరి నిజంగానే జగన్ ఇండియా కూటమిలో జాయిన్ అవుతారా? లేదా? అనేది తెలియాలంటే ఎదురు చూడాల్సిందే.

# మీ హీరోలాగా ఆడవాళ్లని బూతులు తిట్టడమే వచ్చు: అనసూయ

రౌడీ బాయ్ విజయ్ దేవరకొండ, యాంకర్ అనసూయ భరద్వాజ్ మధ్య విభేదాలు ఉన్నాయనే సంగతి తెలుగు సినీ అభిమానులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. 'అర్జున్ రెడ్డి' ప్రీ రిలీజ్ ఈవెంట్ జరిగినప్పుడు మొదలైన రచ్చ, ఇంకా ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే దీనిపై ఇద్దరూ పలు సందర్భాల్లోస్పందించారు. తాజాగా 'సింబా' ట్రైలర్ లాంచ్ కార్యక్రమంలో మరోసారి VDతో విభేదాలపై అనసూయ నోరు విప్పింది. మీడియా ఇంటరాక్షన్‌లో విజయ్ తో గొడవ సద్దుమణిగిందా అని అడిగినప్పుడు, ఆ విషయానికి తాను ఇంపార్టెన్స్ ఇవ్వాలని అనుకోవడం లేదని చెప్పింది. అనసూయతో వివాదం గురించి 'ఖుషి' ఈవెంట్ లో విజయ్ దేవరకొండను అడగ్గా.. "గొడవ పడేవాళ్ళను అడగాలి. ఎందుకు గొడవ పడుతున్నారో. ఏం నడుస్తుందో ఎందుకు నడుస్తుందో మనకు అసలు ఏం తెల్వదు" అని బదులిచ్చారు. ఈ విషయం మీద తాజాగా అనసూయ స్పందిస్తూ.. "ఎలాగైతే ఇప్పుడు ఈ సినిమా ద్వారా ఒక మెసేజ్ ఇద్దామని అనుకున్నానో, అప్పుడు ఒక మెసేజ్ ఇద్దాం అనుకున్నాను. అలా మాట్లాడటం స్టేజ్ మ్యానర్స్ కాదు అనే టాపిక్ అంతే. ఒకచోట మనకు ఫోకస్ లైమ్ లైట్ లో ఉన్నప్పుడు మనం పద్ధతిగా ఉండాలి. అది ఒక్కొక్కరికి ఒకలా ఉంటుంది. కొన్ని మితిమీరినవి అందరికీ తెలుస్తాయి" అని చెప్పింది. అంతేకాదు



ఆ టైములో అది మీ అందరికీ ఎందుకు తప్పనిపించలేదని రివర్స్ లో మీడియాని ప్రశ్నించింది. మీడియా మాట్లాడలేదు కాబట్టే తాను మాట్లాడాల్సి వచ్చిందని అనసూయ పేర్కొంది. అవతలి వ్యక్తిని అడగకపోవడం మీదే తప్పని, ఉల్టా చోర్ అంటూ ఒక హిందీ నానుడితో కౌంటర్ వేసింది. "మీరు అదే విషయం గురించి అతన్ని (విజయ్ దేవరకొండ) అడిగినప్పుడు 'ఆమెను అడగండి' అని సమాధానం వచ్చింది. కానీ నేను అలా అగౌరవంగా మాట్లాడలేను. నేను ఎవరినీ ద్వేషించడం లేదు. అది నాకు కరెక్ట్ కాదనిపించింది. అంటే అక్కడితో అయిపోయింది. మనం ప్రతీ దాన్నుంచి ఏదొకటి నేర్చుకోవాలి. నేనొక రకంగా చెప్పాల్సింది ఇంకొక రకంగా చెప్పాను. నేనూ చాలా నేర్చుకున్నాను. ఒకప్పుడు నేను అన్నిటికీ గయ్యి గయ్యి మని రియాక్ట్ అవుతుండేదాన్ని. కానీ ఇప్పుడలా కాదు. నా అనుభవం నుండి ఇలాంటివి నేర్చుకున్నాను. నాకు వ్యక్తిగతంగా ఎవరి మీద ద్వేషం లేదు" అని అనసూయ తెలిపింది. 'సింబా' ఈవెంట్ లో అనసూయ కామెంట్స్ పై సోషల్ మీడియాలో నిన్నంతా చర్చ జరిగింది. కొందరు నెటిజన్లు మళ్లీ ఆమెను టార్గెట్ చేస్తూ ట్రోల్ చేసారు. ఈ నేపథ్యంలో అనసూయ ఎక్స్ లో ఘాటుగా స్పందించింది. "మరీ ఇంత చేతకానివాళ్లలా ఉంటే ఎలాగండీ.. నిజంగా మీకు కాలుతుందంటే నా మీద కాదు.. అస్తమానం నేను ఏం పని చేసినా ఆ టాపిక్ లాగే వాళ్ళని అనండి దమ్ముంటే.. కానీ మీరు అలా చేయరు కదా.. ఎందుకు మీరు అది చేతకాదు. మీ హీరోలాగా ఆడవాళ్ళని ఉద్దేశించి బూతులు తిట్టటం మాత్రమే వచ్చు కదా పాపం.. నేను ఇప్పటికీ మీరందరూ త్వరగా కోలుకోవాలని, నిజమైన ఉద్యోగం పొందాలని ప్రార్థిస్తున్నాను" అని అనసూయ సెటైరికల్ పోస్ట్ పెట్టారు. ఇక్కడ ఆమె ఎవరి పేరునీ మెన్షన్ చేయనప్పటికీ, విజయ్ దేవరకొండ ఫ్యాన్స్ గురించే ఈ పోస్ట్ పెట్టినట్లు అర్థమవుతోంది. ఇది ప్రస్తుతం నెట్టింట వైరల్ గా మారింది.

# గుంటూరు రాజీ భలే బిజీబిజీ

ఫెమినా మిస్ ఇండియా 2018 పోటీలలో హర్యానా నుంచి ప్రాతినిధ్యం వహించిన మీనాక్షి చౌదరి కిరీటాన్ని సొంతం చేసుకుంది. అదే ఏడాది మిస్ గ్రాండ్ ఇంటర్నేషనల్ 2018 లో ఇండియా కి ప్రాతినిధ్యం వహించిన ఈ అమ్మడు రన్నపర్ గా నిలిచింది. మిస్ ఇండియా కిరీటం గెలుచుకున్న తర్వాత మీనాక్షి చౌదరి కి బాలీవుడ్ లో ఎంట్రీ ఇచ్చింది. 2021 లో ఇచట వాహనాలు నిలుపరాదు సినిమాతో టాలీవుడ్ లో అడుగు పెట్టింది. మొదటి సినిమాతో నిరాశ పరిచిన కూడా ప్రముఖుల దృష్టిలో పడటంలో సఫలం అయింది. ముఖ్యంగా స్టార్ దర్శకుడు త్రివిక్రమ్ ఈమెకి ఆఫర్ ఇస్తానంటూ గతంలో ప్రకటించాడు. అన్నట్లుగానే గుంటూరు కారం సినిమాలో రాజీ పాత్రను ఇచ్చాడు. గుంటూరు కారం సినిమాలో ప్రాముఖ్యత



లేని పాత్ర అంటూ కొందరు విమర్శించినా కూడా దాని వల్ల వచ్చిన పాపులారిటీ కారణంగా వరుసగా సినిమాలకు కమిట్ అవుతోంది. ఇప్పటికే ఈ అమ్మడు తెలుగు లో మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న విశ్వంభర సినిమాలో కీలక పాత్రలో నటిస్తున్న విషయం తెల్సిందే. చిరు మూవీ కాకుండా విశ్వక్‌సేన్ హీరోగా రూపొందుతున్న మెకానిక్ రాకీ, వరుణ్ తేజ్ హీరోగా నటిస్తున్న మట్కా సినిమాలను చేస్తుంది. అన్నింటి కంటే ముఖ్యంగా తమిళ సూపర్ స్టార్ విజయ్ హీరోగా నటిస్తున్న గోట్ సినిమాలో ఈ అమ్మడు హీరోయిన్ గా నటిస్తోంది. ఇవి కాకుండా మరికొన్ని చర్చల దశలో ఉన్నాయి. రాబోయే రెండేళ్ల కాలంలో మీనాక్షి చౌదరి నటించిన పది సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయంటూ సినీ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు కారం నిరాశ పరిచిన గుంటూరు రాజీ మాత్రం భలే బిజీ బిజీ అని ఆమె సన్నిహితులు మాట్లాడుకుంటున్నారు.




# 'డబుల్ ఇస్మార్ట్' కి అక్కడ సవాల్ తప్పదా?



డ్యాషింగ్ డైరెక్టర్ పురిజగన్నాథ్ పాన్ ఇండియా సినిమా కల ఇంకా నెరవేరని సంగతి తెలిసిందే. తొలి ప్రయత్నం'లైగర్' భారీ అంచనాల మధ్య చేసినా అది దారుణమైన ఫలితాన్ని చూసింది. ఆ సినిమా కంటే హిందీలో'ఇస్మార్ట్ శంకర్' బెటర్ టాక్ తో నడిచింది. దీంతో ఆ సినిమాకి సీక్వెల్ గా తెరకెక్కిస్తోన్న'డబుల్ ఇస్మార్ట్' ని కూడా నార్త్ రీజియన్ లో భారీ ఎత్తున రిలీజ్ ప్లాన్ చేస్తున్నారు. దీనిలో భాగంగా బాలీవుడ్ నుంచి సంజయ్ దత్ ని సైతం రంగంలోకి దించి విలన్ బాధ్యతలు అప్పగించాడు.

అతడి ఎంట్రీ సినిమాకి అమాంతం మంచి హైప్ తీసుకొచ్చింది. రామ్ ఎనర్జీకీ దత్ తోడైతే బాక్సాఫీస్ వద్ద రచ్చ తప్పదనే అంచనాల్లో యూనిట్ కనిపిస్తోంది. ఇక సినిమా ఎట్టకేలకు అన్ని పనులు పూర్తిచేసుకుని ఆగస్టు 15న రిలీజ్ చేస్తున్న సంగతి తెలిసిందే. సినిమాకి టాక్ బాగుంటే తిరుగుండదు. ఆ రోజు తెలుగు నుంచి పెద్దగా రిలీజ్ లేవు. ఉన్న సినిమాలు కూడా పెద్దగా పోటీలో లేనివే. అయితే తంగలాన్ మాత్రం కాస్త పోటీనివ్వొచ్చు. కానీ అది డబ్బింగ్ సినిమా కాబట్టి తెలుగు సినిమా తర్వాతే సెకెండ్ ఆప్షన్ గా ఉంటుంది. అయితే బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద మాత్రం డబుల్ ఇస్మార్ట్ కి సవాల్ తప్పేలా లేదు. ఈ సినిమాతో పాటు పోటీగా మరో మూడు భారీ బడ్జెట్ సినిమాలు రిలీజ్ అవుతున్నాయి. వరుసగా పబ్లిక్ హాలీడేలు రావడంతో డేట్ ని ముందే లాక్ చేసుకున్నాయి. శ్రద్ధాకపూర్, రాజ్ కుమార్ రావు నటించిన'స్త్రీ-2' రిలీజ్ అవుతుంది. ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. ఇప్పటికే రిలీజ్ అయిన ప్రచార చిత్రాలకు మంచి హైప్ వచ్చింది. పైగా హిట్ సినిమాకి సీక్వెల్ కావడంతో మరింత అంచనాలతో రిలీజ్ అవుతుంది. అలాగే అక్షయ్ కుమార్, తాప్సీ నటిస్తోన్న'ఖేల్ ఖేల్ మే' కూడా అదే రోజు రిలీజ్ అవుతుంది. అక్షయ్ వరుస వైఫల్యాలు ఈ సినిమాపై ప్రభావం చూపే అవకాశం ఉన్నా తొలి షో అనంతరం టాక్ పాజిటివ్ గా వస్తే సీన్ మారిపోతుంది. అలాగే జాన్ అబ్రహం నటిస్తోన్న'వేదా' కూడా రిలీజ్ అవుతుంది. ఇప్పటివరకూ ఈ సినిమాపై ఎలాంటి బజ్ క్రియేట్ అవ్వలేదు. రిలీజ్ దగ్గర పడుతోన్న నేపథ్యంలో ఈ రెండు సినిమాల్ని ప్రత్యేకంగా ప్రమోషన్ ప్లాన్ చేస్తున్నారు. మరి వీటన్నింటి మధ్యలో డబుల్ ఇస్మార్ట్ ఎలాంటి హిట్ సాధిస్తుందన్నది చూడాలి.

# రాబోయే టాప్ 10 మూవీస్.. ఎన్టీఆర్, బన్నీ డామినేషన్!



ప్రతి ఏడాది లాగే.. ఈసారి కూడా ఐఎండీబీ (ఇంటర్నెట్ మూవీ డేటాబేస్) పాపులర్ ఇండియన్ సినిమాస్, మోస్ట్ అవైటెడ్ మూవీస్ జాబితాలను రీసెంట్ గా రిలీజ్ చేసింది. ప్రపంచవ్యాప్తంగా ఐఎండీబీకి ఉన్న మిలియన్లకు పైగా నెలవారీ విజిటర్స్ రియల్ పేజ్ వ్యూస్ ఆధారంగా జాబితాలను రూపొందించింది. ప్రస్తుతం ఈ రెండు లిస్టులు.. సోషల్ మీడియాలో ఫుల్ వైరల్ అవుతున్నాయి. అయితే 2024 సెకండాఫ్ లో భారీ చిత్రాలు ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. ఇదే సమయంలో మోస్ట్ అవైటెడ్ మూవీస్ లిస్ట్ ను ఐఎండీబీ విడుదల చేయడం గమనార్హం.

ఆ జాబితాలో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుష్ప-2 మూవీ తొలి స్థానాన్ని కైవసం చేసుకుంది. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా డిసెంబర్ 6వ తేదీన ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ కానుంది. ఇక పుష్ప-2 టాప్ లో ఉండడంతో ఫ్యాన్స్ పండగ చేసుకుంటున్నారు. మోస్ట్ అవైటెడ్ మూవీస్ లిస్ట్ లో రెండో స్థానంలో ఉన్న దేవర మూవీ సెప్టెంబర్ 27వ తేదీన విడుదల కానుంది. జూనియర్ ఎన్టీఆర్, జాన్వీ కపూర్ హీరోహీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమాకు కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న దేవరపై మంచి అంచనాలు నెలకొన్నాయి. త్వరలోనే సెకెండ్ సింగిల్ ను రిలీజ్ చేయనున్నారు మేకర్స్. మరి టాప్ 10లో ఉన్న మిగతా సినిమాలు ఏంటంటే? 1. పుష్ప: ది రూల్ 2. దేవర- పార్ట్ 1 3. వెల్ కమ్ టు ది జంగిల్ 4. ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ 5. కంగువ 6. సింగం ఎగైన్ 7. భూల్ భులయ్యా 3 8. తంగలాన్ 9. ఔరో మే కహా దమ్ థా 10. స్త్రీ 2 అక్షయ్ కుమార్, దిశా పటానీ లీడ్ రోల్స్ లో నటిస్తున్న వెల్‌కమ్ టు ది జంగిల్ మూవీ 2024 డిసెంబర్ 20వ తేదీన రిలీజ్ కానుంది. విజయ్ దళపతి ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ సినిమా సెప్టెంబర్ 5న విడుదల కానుంది. సూర్య కంగువ అక్టోబర్ 10వ తేదీన థియేటర్లలో సందడి చేయనుంది. సింగం ఎగైన్ చిత్రం నవంబర్ 1వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుంది. భూల్ భులయ్యా 3 దీపావళి కానుకగా అక్టోబర్ 31న, విక్రమ్ తంగలాన్ ఆగస్టు 15న, ఆరోన్ మే కహన్ దమ్ థా ఆగస్టు 2న, స్త్రీ 2 ఆగస్టు 15న రిలీజ్ కానున్నాయి. మరి ఈ ఐఎండీబీ రిలీజ్ చేసిన టాప్ 10 మోస్ట్ అవైటెడ్ మూవీస్ ఎలాంటి హిట్ అవుతాయో చూడాలి.

# ఆ విషయంలోనూ తమన్నా తగ్గేదేలే!

మిల్కీబ్యూటీ తమన్నా సెకెండ్ ఇన్నింగ్స్ లోనూ దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. హీరోయిన్ అవకాశాలతో పాటు, వచ్చిన ఏ చిన్న ఛాన్స్ కూడా వదులుకోవడం లేదు. అవసరం మేర గెస్ట్ అప్పి రియన్స్ ఇస్తుంది. ఐటం పాటల్లో సత్తా చాటుతుంది. భాషతో సంబంధం లేకుండా ఎక్కడ ఛాన్స్ ఉంటే? అక్కడ తమన్నా ఉంటుందని నిరూపిస్తుంది. మరోవైపు ఫిట్ నెస్ విషయంలోనే అమ్మడు అంతే కేరింగ్ తీసుకుంటుంది. నిత్యం వర్కౌట్లు, యోగా లాంటివి క్రమం తప్పకుండా చేస్తుంది. మిల్కీలో ఆమెరుపుకు అసలు కారణం అదేనన్న సంగతి తెలిసిందే. అలాగే అమ్మడు మంచి ఫుడీ అని కూడా తాజాగా రివీల్ చేసింది. గుల్బర్ బ్లాగ్స్ అనే ఇన్ స్టా పేజీని నెటి జనులతో పంచుకుంది. ఇందులో ఫుడ్ ఐటమ్ లు వెంట వెంటనే ఛేంజ్ అవుతుంటాయి. మోమున్, ఐస్ క్రీమ్స్, బర్గర్స్, చాక్లెట్స్, హాట డాగ్



ఇలా అన్నిరకాల పదార్థాలు ఉంటాయి. మీ మైండ్ లో ఏం రన్ అవుతుందని ఎవరైనా అడిగితే? నేను ఇదే చెబుతానని ఫుడ్ పై తనకున్న ఆసక్తిని చెప్పకనే చెప్పింది. ఇది పూర్తిగా నిజమని కచ్చితంగా చెప్పింది. అలాగే ఫుడ్ విషయంలో ఏ మాత్రం రాజీపడనంది.

ఫిట్ నెస్ కోసం ఇష్టమైన ఆహారం వదులుకోను. కడుపునిండా లాంగిచేస్తా. కానీ అందుకు తగ్గట్టు వ్యాయామం చేస్తా. క్యాలరీలు కరిగిస్తా. శాఖాహారం ఎక్కువగా తీసుకుంటానని, ఎక్కువగా మంచి నీళ్లు తాగుతానని తెలిపింది. ఇక తమన్నా సినిమాల విషయానికి వస్తే ఇటీవలే బాక్ సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సినిమా తమిళ్ లో బాగానే ఆడింది. ఇందులో అమ్మడు ఇద్దరు పిల్లల తల్లిగా నటించింది. ఇంతవరకూ మామ్ పాత్రను తమన్నా పోషించలేదు. తొలిసారి ఆతరహా పాత్రలోనూ కనిపించి ముచ్చట తీర్చుకుంది. ప్రస్తుతం వేద, స్త్రీ-2, ఒదెల రైల్వేస్టేషన్-2 చిత్రాల్లో నటిస్తోంది. ఇవిగాక కొత్త ప్రాజెక్ట్ లు క్యూలో పెట్టింది.

# అంజలి ఇంటిమేట్ సీన్స్.. సెట్స్ లో అలా జరిగిందా?

హీరోయిన్ అంజలి.. ఓ వైపు సినిమాలు.. మరోవైపు వెబ్ సిరీసుల్లో నటిస్తూ బిజీ బిజీగా గడుపుతోంది. వరుస ప్రాజెక్టులతో ప్రేక్షకులను అలరిస్తూ దూసుకుపోతోంది. తనదైన శైలిలో మెప్పిస్తోంది. ఇటీవల మాస్ కా దాస్ విశ్వక్ సేన్ గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి మూవీలో కీలక పాత్ర పోషించింది. తన యాక్టింగ్ తో విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు అందుకుంది. రీసెంట్ గా బహిష్కరణ వెబ్ సిరీస్ తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది అంజలి. ఆ వెబ్ సిరీస్ లో వేశ్య పాత్రలో కనిపించి ఆకట్టుకుంది. కొన్ని ఇంటిమేట్ సీన్స్ లో కూడా నటించింది. ఇప్పుడు ఆ సీన్స్ పై రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో స్పందించింది. ఇంటిమేట్ సీన్స్ చేసేటప్పుడు.. మేకర్స్ చాలా జాగ్రత్త పడ్డారని తెలిపింది. సెట్స్ లో ఉన్న అందరికీ బయటకు పంపి షూట్ చేశారని చెప్పింది. ఆ సీన్స్ షూట్ చేసే సమయంలో కాస్త కన్ఫ్యూజ్ అయ్యానని పేర్కొంది. ఇప్పటి వరకు ఇలాంటి సీన్స్ ఎప్పుడూ చేయలేదని వెల్లడించింది. గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి మూవీ కోసం కూడా మాట్లాడింది అంజలి. సినిమాలో తాను చేసిన పాత్రకు



అనుకున్నదాని కంటే ఎక్కువ రెస్పాన్స్ వచ్చిందని తెలిపింది. తాను చేసే రోల్ కు ఎంతవరకు న్యాయం చేయాలనేది తన చేతిలోనే ఉంటుందని పేర్కొంది. ప్రతి మూవీకి కూడా స్పెషల్ గా హెూం వర్క్ చేస్తానని చెప్పింది. రోల్స్ కోసం కష్టపడతానని తెలిపింది. తాను చేసిన పలు చిత్రాల్లో పాత్రలు డిమాండ్ చేసినందుకు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకున్నట్లు వెల్లడించింది. గతంలో తాను నటించిన నవరస సిరీస్ షూటింగ్ సమయంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు చెప్పింది అంజలి. కాస్ట్యూమ్స్ వల్ల అనేక గంటల పాటు వాష్ రూమ్ కు కూడా వెళ్లలేదని గుర్తు చేసుకుంది. తనకు సంబంధించి వచ్చే తప్పుడు వార్తలను చూసి వెంటనే మర్చిపోతానని తెలిపింది. వాటిని చదివినప్పుడు మాత్రం కాస్త బాధపడతానని చెప్పింది. టైమ్ వచ్చినప్పుడు పెళ్లి చేసుకుంటానని క్లారిటీ ఇచ్చింది అంజలి. ఇక త్వరలో అంజలి.. గేమ్ ఛేంజర్ మూవీతో ప్రేక్షకుల ముందుకు రానుంది. రామ్ చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఆ సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. డిసెంబర్ లో రిలీజ్ అవుతుంది. సినిమాలో రామ్ చరణ్ కు సతీమణిగా అంజలి కనిపించనుందని టాక్ నడుస్తోంది. ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్ లో అంజలి పాత్ర కీలకమని తెలుస్తోంది. మరి ఈ మూవీతో అంజలి ఎలాంటి హిట్ అందుకుంటుందో చూడాలి.





# ప్రజలే బీఆర్ఎస్‌ను చీల్చిచెండాడారు...

నల్గొండ : భవిష్యత్తులో బడ్జెట్‌ను చీల్చి చెండాడుతామంటూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ... కేసీఆర్‌ను ప్రజలు చీల్చి చండాడితేనే ఎంపీ ఎన్నికల్లో ఒక్క సీటు గెలవక ఏడు సీట్లలో డిపాజిట్ కోల్పోయారని వ్యాఖ్యలు చేశారు. "నీ స్థానంలో ఎవరున్నా రాజకీయాలు బంద్ చేసుకొని శాశ్వతంగా రాజకీయాలు విరమించుకోవాలి. ఎనిమిది నెలలు ఇంట్లో ఉండి మధ్యలో రెండుసార్లు అసెంబ్లీ నడిచినా రాలేదు" అంటూ కేసీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. దేశ చరిత్రలో తెలంగాణ రాష్ట్రానికి వ్యవసాయ రంగానికి 72 వేల కోట్లు కాంగ్రెస్ కేటాయించిందని చెప్పుకొచ్చారు. "నువ్వు ఏనాడైనా పెట్టావా కేసీఆర్" అంటూ ప్రశ్నించారు. తెలంగాణకు అన్యాయం చేసేలా కేంద్రం ఘోరంగా బడ్జెట్ పెడితే ఎందుకు కేసీఆర్ మాట్లాడలేదని నిలదీశారు. బీజేపీలోకి బీఆర్ఎస్ విలీనానికి చర్చలు జరుగుతున్నాయంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. అటువైపు అడుగులు పడుతున్నాయనడానికి ఇదే నిదర్శనమన్నారు. రేపు లోకల్ బాడీ ఎన్నికల వరకు బీఆర్ఎస్ ఉంటే అడ్రస్ లేకుండా చేస్తామన్నారు. బ్రాహ్మణ వెల్లంలో పది రోజుల్లో ట్రయల్ రన్ ఉంటుందని, డిసెంబర్‌లోపు కాల్వల నిర్మాణం పూర్తి అవుతుందని తెలిపారు. ఎస్ఎల్బీసీ సొరంగం తవ్వేందుకు అమెరికా నుంచి మిషన్ బేరింగ్ వచ్చే నెల 10న వస్తుందన్నారు. త్వరలోనే సొరంగ నిర్మాణం పూర్తి చేసి 4 లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. కాగా.. తెలంగాణ అసెంబ్లీలో రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై కేసీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించిన విషయం తెలిసిందే... సభలో బడ్జెట్ ప్రసంగం ముగింపు రెండు నిమిషాల ముందే బయటకు వచ్చిన కేసీఆర్ అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ప్రతిపక్ష నేతగా తొలిసారి మాట్లాడారు. దాదాపు పదేళ్ల తర్వాత కేసీఆర్ అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. బడ్జెట్లో రాష్ట్ర ప్రభుత్వం రైతులను, వృత్తి కార్మికులను వంచించిందని విమర్శించారు. బడ్జెట్ అంతా ట్రాష్. గ్యాస్ అని.. ఈస్ట్‌మన్ కలర్ మాదిరిగా చెప్పారని దుయ్యబట్టారు. ఓ కథ చెప్పినట్లు ఉందంటూ ఎద్దేవా చేశారు. బడ్జెట్‌లో పారిశ్రామిక పాలసీ లేదని.. ఐటీ పాలసీ లేదని అన్నారు. పేదలకు సంబంధించి ఈ సర్కారుకు ఓ పాలసీ అంటూ లేదన్నారు. ఇది పేదల, రైతు బడ్జెట్ కాదన్నారు. ఎవరి బడ్జెట్ అనేది విశ్లేషణలో తెలుస్తుందని.. భవిష్యత్తులో దీన్ని చీల్చి చెండాడతామంటూ మాజీ ముఖ్యమంత్రి వ్యాఖ్యలు చేశారు. మరోవైపు బడ్జెట్‌పై కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా గట్టి కౌంటర్ ఇచ్చారు. కేంద్ర బడ్జెట్‌పై స్పందించని కేసీఆర్.. రాష్ట్ర బడ్జెట్ మీద మాట్లాడటం విడ్డూరంగా ఉందని మంత్రి సీతక్క విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌పై మాట్లాడని కేసీఆర్.. రాష్ట్ర బడ్జెట్‌ను విమర్శించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఇది ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని మంత్రి అన్నారు. "ఎన్నడూ లేని విధంగా ఈ రోజు కేసీఆర్ మీడియా పాయింట్‌కి వచ్చారు. తొందర్లోనే కోర్టు బోన్‌లోకి వస్తారు. కేసీఆర్ ఊహల్లో బతికారు. ఇంకా నేనే రాజు అనుకుంటున్నారు. మీరు పెట్టిన బడ్జెట్ ఎవరికి ఉపయోగపడలేదు" అంటూ ఎమ్మెల్యే వంశీ కృష్ణ వ్యాఖ్యలు చేశారు. వాస్తవానికి బడ్జెట్ దగ్గర ఉందని... అందుకే ప్రతిపక్షానికి మింగుడు పడటం లేదని మరో ఎమ్మెల్యే సంజీవ రెడ్డి అన్నారు.

## అది గ్యాస్, ట్రాష్ కాదా?.. కేసీఆర్‌కు మంత్రి జూపల్లి సూటి ప్రశ్న

హైదరాబాద్, జూలై 26: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంతా ట్రాస్.. గ్యాస్ అని.. ఈస్ట్‌మన్ కలర్ మాదిరిగా చెప్పారని.. ఓ కథ చెప్పినట్లు ఉందంటూ బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఎక్సైజ్ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ... 2023లో రెండు లక్షల తొంభై వేల కోట్లు ఖర్చు చేసినట్టు కేసీఆర్ ప్రజలకు చూపించారని.. ఆదాయాన్ని ఎక్కువగా చూపించి ప్రజలను మోసం చేసినప్పుడు.. అది గ్యాస్, ట్రాష్ కాదా? అని సూటిగా ప్రశ్నించారు. తెలంగాణ బడ్జెట్‌లో 25 శాతం వ్యవసాయానికి ఖర్చుపెడితే.. 15 శాతం గత ప్రభుత్వం అప్పులు తీర్చడంలోనే సరిపోతుందని తెలిపారు. కేసీఆర్ అమల్లోకి తెచ్చిన రైతు బంధుని రైతు భరోసాగా మార్చి కొనసాగించామన్నారు. రైతు పండించిన ధాన్యానికి అదనంగా 500 రూపాయిలు బోనస్ ఇచ్చామన్నారు. ఏడు నెలలకే తాము 30,000 కోట్ల అప్పు తెచ్చామని కేసీఆర్ మాట్లాడుతున్నారని.. తాము తెచ్చిన అప్పు బీఆర్ఎస్ చేసిన అప్పులు తీర్చడానికే సరిపోతుందంటూ వ్యాఖ్యలు చేశారు. "అసెంబ్లీకి కేసీఆర్ ఇన్నిరోజులు ఎందుకు రాలేదు? అంత గర్వమా? కేసీఆర్ కన్నా రేవంత్ రెడ్డిది చిన్న వయసు కాబట్టి ఆయన ముందు అసెంబ్లీలో కూర్చోవడానికి కేసీఆర్‌కు చిన్న చూపా?" ప్రశ్నల వర్షం కురిపించారు. ఆరు గ్యారంటీలు కూడా ఒక్కొక్కొటిగా అమలు చేస్తున్నప్పటికీ కేసీఆర్ తమపై విమర్శలు చేస్తూన్నారని మంత్రి జూపల్లి కృష్ణా రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు కేసీఆర్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. హైదరాబాద్‌లో వర్షాలు వస్తే కేసీఆర్ హయాంలో ఫామ్ హౌస్‌లో కూర్చొని మొసలి కన్నీరు పెట్టారని జగ్గారెడ్డి విమర్శించారు. పిట్ట కథలు చెప్పడంలో కేసీఆర్ దిట్ట అంటూ వ్యాఖ్యలు చేశారు. వాస్తవానికి దగ్గరలో నిన్నటి బడ్జెట్ ఉందన్నారు. కేసీఆర్ హుస్సేన్ సాగర్ నీళ్లను కొబ్బరి నీళ్లు చేస్తా, మూసి నదిలో ఈతకొట్టేలా చేస్తా అని గప్పాలు కొట్టిండు అని అన్నారు. ఓల్డ్ సిటీ లో మౌలిక వసతులు లేవని తెలిపారు. మెట్రో విస్తరణకు నిధులు ఇచ్చారన్నారు. రూరల్ ప్రాంతంతో పాటు రాజధాని హైదరాబాద్ కోసం భారీగా నిధులు కేటాయించారని చెప్పారు. డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ చదువుతుంటే కేసీఆర్ బయటికొచ్చి విమర్శలు చేశారని జగ్గారెడ్డి మండిపడ్డారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా కేసీఆర్‌పై మండిపడ్డారు. కేసీఆర్‌ను ప్రజలు చీల్చి చండాడితేనే ఎంపీ ఎన్నికల్లో ఒక్క సీటు గెలవక ఏడు సీట్లలో డిపాజిట్ కోల్పోయారని వ్యాఖ్యలు చేశారు. "నీ స్థానంలో ఎవరున్నా రాజకీయాలు బంద్ చేసుకొని శాశ్వతంగా రాజకీయాలు విరమించుకోవాలి. ఎనిమిది నెలలు ఇంట్లో ఉండి మధ్యలో రెండుసార్లు అసెంబ్లీ నడిచినా రాలేదు" అంటూ కేసీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. దేశ చరిత్రలో తెలంగాణ రాష్ట్రానికి వ్యవసాయ రంగానికి 72 వేల కోట్లు కాంగ్రెస్ కేటాయించిందని చెప్పుకొచ్చారు. "నువ్వు ఏనాడైనా పెట్టావా కేసీఆర్" అంటూ ప్రశ్నించారు. తెలంగాణకు అన్యాయం చేసేలా కేంద్రం ఘోరంగా బడ్జెట్ పెడితే ఎందుకు కేసీఆర్ మాట్లాడలేదని మంత్రి కోమటిరెడ్డి నిలదీశారు.

## సర్కార్ తీరుతో రైతులకు కొత్త సమస్యలు షురూ...



హైదరాబాద్, జూలై 26: రాష్ట్ర ప్రభుత్వంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రైతు రుణమాఫీ విషయంలో ఇచ్చిన మాట తప్పి.. ఆలస్యం చేయడం వల్ల రైతులకు కొత్త సమస్యలు మొదలయ్యాయని మండిపడ్డారు. ఏడు నెలల వడ్డీపై రైతులను బ్యాంకులు వేధిస్తున్నాయని చెప్పుకొచ్చారు. దీనిపై వెంటనే ప్రభుత్వం స్పందించిన రైతులకు అండగా నిలబడాలని మాజీ మంత్రి డిమాండ్ చేశారు. ఎక్స్ వేదికగా హరీష్ రావు స్పందిస్తూ.. డిసెంబర్ 9న రైతు రుణమాఫీ చేస్తామన్న మాట తప్పి, 7 నెలల తర్వాత ఆ ప్రక్రియను ప్రారంభించడం వల్ల రైతులకు కొత్త సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. ముందుగా ఏడు నెలల వడ్డీ చెల్లించాకే, రుణ మాఫీ చేస్తామని బ్యాంకర్లు వేధిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం చెప్పిన రుణమాఫీ దేవుడెరుగు, వడ్డీ చెల్లించేందుకు కొత్తగా అప్పులు చేయాల్సి వస్తుందని బాధపడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి డిసెంబర్ నుంచి జూలై దాకా వడ్డీని తామే భరిస్తామని, రైతుల నుంచి వసూలు చేయవద్దని స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గం శివంపేట్ మండలానికి చెందిన ఒక రైతు క్రాప్ లోన్‌ను, రూ.9000 మిత్తి కట్టించుకున్నాకే క్లోజ్ చేశారన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలానికి చెందిన రైతులకూ ఇదే పరిస్థితి ఎదురైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. తనకు రైతులు పంపిన విజ్ఞప్తులను ప్రభుత్వ పరిశీలనకు పంపుతున్నానని... పరిష్కరించాలని కోరుతున్నట్లు హరీష్‌రావు ట్వీట్ చేశారు. కాగా... కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల రైతు రుణమాఫీని విడుదల చేసిన విషయం తెలిసిందే. లక్ష రూపాయల వరకు రుణాలను మాఫీ చేసింది కాంగ్రెస్ సర్కార్. సుమారు పదకొండున్నర లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.7వేల కోట్లు జమ చేసింది. అలాగే ఈ నెలాఖరుకు లక్షన్నర రూపాయలు, ఆగస్టు 15 నాటికి 2 లక్షల వరకు రుణాబకాయిలను రైతుల తరపున ప్రభుత్వం బ్యాంకులకు చెల్లించేలా ప్రణాళికను సిద్ధం చేసింది.

అయితే రైతు రుణమాఫీ అంశంలో గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయి. లక్ష రూపాయల రుణాలు మాఫీ అని ప్రకటించినప్పటికీ కొన్ని చోట్ల మాత్రం మొత్తం రుణాలు మాఫీ కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఏర్పాడ్డాయి. ఓ రైతులు లక్ష రూపాయల రుణం ఉండగా కేవలం మూడు వేలు మాత్రమే మాఫీ అయినట్లు తెలుస్తోంది. మరికొన్ని చోట్ల బ్యాంకులు వడ్డీలు వసూలు చేస్తున్నట్లు సమాచారం. దీంతో రైతులు ఏం చేయాలో తెలియక అయోమయంలో ఉండిపోయే పరిస్థితి ఏర్పడింది.

## నిధులు వచ్చుడో, ఇద్దరం చచ్చుడో అన్నారు కదా.. రండి..

ఢిల్లీ: బడ్జెట్‌పై కొందరు అర్థ సత్యాలు, అసత్యాలు ప్రచారం చేస్తున్నారని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు పేర్కొన్నారు. అన్ని రాష్ట్రాలకు సమపాళ్లలో కేటాయింపులు జరిగాయన్నారు. గత పదేళ్లుగా ఎన్డీఏ నేతృత్వంలో అన్ని రాష్ట్రాలను సమదృష్టితో చూశారన్నారు. తెలంగాణలో కేసీఆర్ అధికారంలో ఉన్నా, రేవంత్ రెడ్డి అధికారంలో ఉన్నా ఆలోచన విధానం ఒకటేనన్నారు.

జెండాలు మాత్రమే మారాయి తప్ప విధానాలు మారలేదన్నారు. రేవంత్ రెడ్డి, కేసీఆర్ వైఖరి ఒకటే ఏం మారలేదన్నారు. మార్పు ఏదైనా ఉందా అంటే.. దానం బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి మారడమేనని రఘునందన్ రావు అన్నారు. మార్పు ఇంకేదైనా ఉందంటే.. కుర్చీలు మాత్రం మారాయన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను రూ. 20 కోట్లతో కేసీఆర్ కొన్నారని, కానీ తాము బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను రూ. 5 కోట్లకే కొన్నామని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మీడియాతో చిట్ చాట్‌లో చెప్పారని రఘునందన్ రావు అన్నారు.

**రూ.30 వేలు అవుతుంది.. ఇచ్చారా? :** ప్రతి మహిళకు రూ. 2,500 ఇస్తామన్నారని.. ఆ లెక్కన ఏడాదికి రూ.30 వేలు అవుతుం దని.. ఇచ్చారా? అని ప్రశ్నించారు. దీనికి బడ్జెట్‌లో కేటాయింపులు ఏవని రఘునందన్ నిలదీశారు. వరికి రూ. 500 బోనస్ ఇస్తామన్నారని.. బడ్జెట్‌లో కేటాయింపులు ఏవని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక రూ. 35,500 కోట్లు రుణం తెచ్చామన్నారని.. రంగారెడ్డి జిల్లాలో తలసరి ఆదాయం రూ. 9 లక్షల పైనే ఉందన్నారు. వికారాబాద్ జిల్లాల్లో తలసరి ఆదాయం రూ. 1 లక్ష పైన ఉందన్నారు. చేవెళ్ల నియోజకవర్గం పరిధిలో ఉన్న ఈ రెండు ప్రాంతాల మధ్య ఇంత వ్యత్యాసం ఉందని.. దేశవ్యాప్తంగా చూసినా సరే ఇదే తరహా అంతరాలు ఉంటాయన్నారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా రూ. 26 వేల కోట్లుగా చూపించారన్నారు. గ్రాంట్స్ ఇన్ ఎయిడ్ కింద రూ. 21 వేల కోట్ల పైన చూపించారని రఘునందన్ అన్నారు.




## మీ దుర్మార్గపు కుట్రలు తిప్పికొడతాం.. కార్గిల్ నుంచి పాక్‌కు మోదీ హెచ్చరిక

లద్దాఖ్: దేశం కోసం ప్రాణాలు పణంగా పెట్టి పోరాడిన సైనికుల త్యాగాలకు యావత్ భారతావని ఎప్పటికీ రుణపడి ఉంటుందని అన్నారు ప్రధానమంత్రి నరేంద్రమోదీ. కార్గిల్ 25వ విజయ దివస్‌ను పురస్కరించుకుని శుక్రవారం ఆయన లద్దాఖ్ వెళ్లారు. ద్రాస్‌లోని యుద్ధ స్మారకాన్ని సందర్శించి అమర జవాన్లకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాకిస్థాన్‌పై విరుచుకుపడ్డారు. ఉగ్రవాదాన్ని సమూలంగా పెకిలిస్తామని దాయాది దేశాన్ని మరోసారి గట్టిగా హెచ్చరించారు. "గతంలో పాకిస్థాన్ పాల్పడిన వికృత ప్రయత్నాలు విఫలమయ్యాయి. అయినా, చరిత్ర నుంచి ఆ దేశం ఎలాంటి గుణపాఠాలు నేర్చుకోలేదు సరికదా.. ఉగ్రవాదం, ప్రాక్సీ వార్‌తో ఇంకా మనపై కవ్వింపు చర్యలకు పాల్పడుతూనే ఉంది. ఈ రోజు నేను మాట్లాడే మాటలు.. ఉగ్రవాదులను తయారుచేస్తున్న వారికి (పాక్ సైన్యాన్ని ఉద్దేశిస్తూ) నేరుగా వినబడతాయి. ముష్కరులను పెంచి పోషిస్తున్న వారికి నేను చెప్పేది ఒక్కటే.. వారి దుర్మార్గపు కుట్రలు ఎన్నటికీ ఫలించవు. మా దళాలు ఉగ్రవాదాన్ని నలిపివేసి.. శత్రువులకు తగిన జవాబిస్తాయి" అని మోదీ పాక్‌ను హెచ్చరించారు. "కార్గిల్ యుద్ధానికి లద్దాఖ్ సాక్షిగా నిలుస్తుంది. అమరుల త్యాగాలకు గుర్తుగా విజయ్ దివస్ జరుపుకుంటున్నాం. మన బలానికి, సహనానికి, వాస్తవాలకు ఈ విజయగాథ నిదర్శనం. దేశం కోసం ప్రాణాలు పణంగా పెట్టిన సైనికులు చిరకాలం గుర్తుండిపోతారు. కార్గిల్ యుద్ధ సమయంలో సామాన్యుడిగా సైనికుల మధ్య ఉండే అదృష్టం నాకు దక్కింది. దేశం కోసం వారు చేసిన పోరాటం నా మదిలో నిలిచిపోయింది. లద్దాఖ్, జమ్మూకశ్మీర్ అభివృద్ధి కోసం ఎలాంటి సవాళ్లనైనా భారత్ అధిగమిస్తుంది. మరికొద్ది రోజుల్లో ఆర్టికల్ 370ని రద్దు చేసి ఐదేళ్లు పూర్తవుతాయి. ఇప్పుడు జమ్మూకశ్మీర్ ప్రజలు సరికొత్త భవిష్యత్తు కోసం ఎదురుచూస్తున్నారు. పెద్ద కలల గురించి మాట్లాడుకుంటున్నారు. ప్రస్తుతం కశ్మీర్ ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలకు నిలయంగా ఉంది. ఈ భూలోక స్వర్గం శాంతి, సౌభ్రాతృత్వం వైపు వేగంగా పరిగెడుతోంది" అని మోదీ తెలిపారు. అంతకుముందు, యుద్ధ స్మారకం వద్ద కార్గిల్ అమరవీరులకు ప్రధాని నివాళులర్పించారు. వీర జవాన్ల కుటుంబసభ్యులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా షింకున్ లా టన్నెల్ ప్రాజెక్ట్ నిర్మాణపనులను ప్రధాని మోదీ ప్రారంభించారు. టన్నెల్ నిర్మాణ ప్రాంతం వద్ద వర్చువల్‌గా తొలి బ్లాస్ట్ చేశారు. 4.1 కిలోమీటర్ల పొడవైన ఈ ట్విన్ ట్యూబ్ టన్నెల్‌ను 15,800 అడుగుల ఎత్తులో నిర్మించనున్నారు. అత్యవసర పరిస్థితుల్లో సాయుధ దళాలను వేగంగా తరలించేందుకు, సైనిక సామగ్రిని చేరవేసేందుకు ఈ సొరంగం సమర్థంగా ఉపయోగపడనుంది. దీని నిర్మాణం పూర్తయితే ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన సొరంగంగా గుర్తింపు సాధించనుంది.

# బోనాల జాతరకు సర్వం సిద్ధం..

### - పూర్తయిన విద్యుత్ దీపాల అలంకరణ - ఏర్పాట్లు సిద్ధం చేసిన ఆలయ కమిటీలు



హైదరాబాద్: ఈనెల 28వ తేదీన జరగనున్న ఆషాఢం బోనాల జాతరకు ఆలయాలు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఇప్పటికే ఆయా ఆలయాల్లో అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ కమిటీలు ప్రత్యేక చొరవ తీసుకొని భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నారు. గోల్నాక శ్రీలక్ష్మీనగర్‌లోని శ్రీదేవి నల్లపోచమ్మ దేవాలయాన్ని ఇప్పటికే ముస్తాబు చేశారు. ఆలయానికి రంగులు వేసి విద్యుత్ దీపాలతో అలంకరించి ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం ఉదయం అమ్మవారికి అభిషేకం, అలంకరణ, ఆలయ కమిటీ పక్షాన బోనం సమర్పిస్తారని కమిటీ ప్రధాన కార్యదర్శి కొమ్మిడి గోపాల్‌రెడ్డి తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి వరకు అమ్మవారికి బోనాలు సమర్పించే కార్యక్రమం కొనసాగుతుందన్నారు. అలాగే తొట్టెల, ఫలహారం బండ్ల ఊరేగింపులు ఆలయానికి తరలి వస్తాయని ఆయన తెలిపారు. బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్ గౌడ్, పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మాజీ కార్పొరేటర్లు ఆలయాన్ని సందర్శించనున్నారని ఆయన తెలిపారు.

**గంగానగర్ మైసమ్మ ఆలయంలో..** బోనాల ఉత్సవాలను పునస్కరించుకునిగంగానగర్‌లోని శ్రీమహంకాళి, శ్రీబంగారుమైసమ్మ దేవాలయాల్లో ఇప్పటికే అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. బస్తీ కమిటీ సభ్యులు ఆర్.కె. బాబు, కె.రాంచందర్, సింగీతం రాజేష్, శేఖర్, పరుశురాం, లక్ష్మీనారాయణ తదితరులు ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు.

## ధరణి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: ధరణి సమస్యల పరిష్కారానికి లోతుగా అధ్యయనం చేయాలని, శాశ్వత పరిష్కారం చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు.

సచివాలయంలో ఆయన ధరణిలో సమస్యలు, మార్పులు–చేర్పులు ఇతర అంశాలపై సమీక్ష నిర్వహించారు. "సవరణల వల్ల కొత్త సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. మార్పులు, చేర్పులపై ప్రజాభిప్రాయం, అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసిన వారి అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకోవాలి. వారి అభిప్రాయాలు, సూచనలు ఆధారంగా సమగ్ర చట్టం తేవాలి. ధరణిపై అవసరమైతే అసెంబ్లీలో చర్చ చేపడదాం"అని సీఎం రేవంత్ అన్నారు. సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎస్ శాంతి కుమారి, కోదండరెడ్డి, కె.కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం పూర్తికి రూ.1.47 లక్షల కోట్లు కావాల్సిందే..!!



హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు కోసం అధిక వడ్డీతో మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు రుణాలు తీసుకున్నారని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. ప్రాజెక్టుల విషయంలో గత కొన్ని రోజులుగా బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య పెద్ద మాటల యుద్ధమే నడుస్తోంది. ఓ వైపు మీడియా ముందుకొచ్చి బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతుంటే.. ఇందుకు కౌంటర్‌గా మంత్రులు మీడియా, సోషల్ మీడియా వేదికగా ఓ రేంజ్‌లో ఇచ్చిపడేస్తున్నారు. తాజాగా కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై శుక్రవారం మంత్రి ఉత్తమ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కాళేశ్వరం వ్యయం రూ.38,500 కోట్ల నుంచి రూ.80 వేల కోట్లకు పెంచారని మండిపడ్డారు. కాగ్ ప్రకారం కాళేశ్వరం పూర్తి కావాలంటే రూ.1.47 లక్షల కోట్లు కావాలని స్పష్టం చేశారు. ప్రాజెక్టు రన్నింగ్ కాస్ట్ కూడా చాలా ఎక్కువని తెలిపారు. అన్ని పంపులు రన్ చేస్తే కరెంట్ బిల్లే రూ.10 వేల కోట్లు అవుతుందని తేల్చిచెప్పారు. ఏడాదికి కాళేశ్వరంపై రూ.15 వేల కోట్లు ఖర్చు చేయాల్సి వస్తుందని అన్నారు. అన్ని మోటార్లు రన్ చేస్తే వ్యయం ఇంకా పెరుగుతుందన్నారు. 93 వేల ఎకరాల ఆయకట్టు కోసం రూ.94 వేల కోట్లు ఖర్చే చేశారని అన్నారు. మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇరిగేషన్‌కు రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు పెట్టారన్నారు. ఎక్కువ ఖర్చయితే.. ఎక్కువ కమీషన్లు వస్తాయని ఇలా చేశారని విమర్శించారు. ప్రాణహిత– చేవెళ్ల ప్రాజెక్టును నిలిపేశారని మంత్రి ఉత్తమ్ ఫైర్ అయ్యారు. మేడిగడ్డపై కాంగ్రెస్ కుట్ర చేసిందని BRS ఆరోపిస్తుందని చెప్పారు. మేడిగడ్డ కూలినప్పుడు కూడా BRS ప్రభుత్వమే ఉందని వివరించారు. మేడిగడ్డ పిల్లర్లు 6 అడుగుల లోపలికి కుంగాయన్నారు. నాసిరకంగా నిర్మించడంతోనే కుంగిందని NDSA రిపోర్టులో ఉందని తెలిపారు. అక్టోబర్ 21వ తేదీన బ్యారేజీ కుంగిందని.. .కాంగ్రెస్ డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చిందని గుర్తుచేశారు. మేడిగడ్డ దగ్గర ఎవరో బాంబులు పెట్టినట్లు FIRకు ఫైల్ చేశారని చెప్పారు. బ్యారేజీ కుంగినా మాజీ సీఎం కేసీఆర్ నోరు మెదపలేదని మండిపడ్డారు. పూర్తిసామర్థ్యంతో పంపింగ్ చేస్తే.. ఏదైనా ప్రమాదం జరిగితే..మేడిగడ్డ సమీపంలోని 44 గ్రామాలు కొట్టుకుపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. భద్రాచలం కూడా కొట్టుకుపోతుందని హెచ్చరించారు. ఎన్డీఎస్ఏ సలహా మేరకు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల గేట్లు తెరిచామని వివరించారు. మేడిగడ్డ కుంగినప్పుడు గత ప్రభుత్వమే నీళ్లను వదిలిందని తెలిపారు.

డీపీఆర్‌లోని అంశాలను గత కేసీఆర్ ప్రభుత్వం ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. సెంట్రల్ డిజైన్ సంస్థ ప్రకారం నిర్మాణం జరగలేదన్నారు. ఒక వ్యక్తి ఆలోచనల ప్రకారం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారని చెప్పారు. ఇంత ఘోర తప్పిదం ఎవరూ చేసి ఉండరని అన్నారు. ప్రజలకు బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, కేటీఆర్ క్షమాపణలు చెప్పాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com